ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 67 పేజీలు: 10+4 వెల: 6.50

వేగంగా వాహనం నడిపినా వీసా రద్దు.. 5
తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం కోర్టు సీరియస్

# 10 నుంచి 15 నిమిషాల్లోనే.. రిజిస్ట్రేషన్ పూర్తి

## 10 నుంచి స్లాట్ బుకింగ్

### ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

### చట్టసవరణతో డబుల్ రిజిస్ట్రేషన్‌కు చెక్: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సమర్థ వంతంగా సులువుగా,వేగవంతంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా మరింత మెరుగైన సేవలను అందించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఇందులో భాగంగానే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నామన్నారు. మంగళవారం వెల్లడించారు. రాష్ట్రంలో 144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను మొదటి దశలో ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 10వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురాబోతున్నామని ప్రకటించారు. హైదరాబాద్ లోని ఆజంపుర, చిక్కడపల్లి, సంగారెడ్డి జిల్లా సదాశివపేట, మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్,రంగారెడ్డి జిల్లా శంషాబాద్, సరూర్‌నగర్, చంపాపేట్, పెద్దపల్లి జిల్లా రామగుండం,ఖమ్మం జిల్లా కూసుమంచి,ఖమ్మం,మేడ్చల్ ,మహబూబ్ నగర్ ,జగిత్యాల, నిర్మల్, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, కొత్తగూడెం, ఆర్మూర్, భువనగిరి, చౌటుప్పల్,నాగర్ కర్నూల్ మొత్తం 22 చోట్ల ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వలన జరిగే జాప్యాన్ని నివారించడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయరోజువారి పనివేళలను 48 స్లాట్లుగా విభజించినట్లు తెలిపారు. ప్రజలు నేరుగా >>2



న్యూఢిల్లీలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయిన దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్

# రక్షణ, వాణిజ్యరంగాల్లో పరస్పర సహకారం

### దుబాయ్ యువరాజుతో భేటీలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** భారత్‌లోమొట్టమొదటిసారి పర్యటనకు వచ్చిన దుబాయ్ యువరాజు రాకతో రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సహకారం మరింత పటిష్టం అవుతుందని ప్రధానిమోడీ ఆకాంక్షించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అత్యంతశక్తివంతమైన యువరాజు తొలిసారి భారత్‌కు రావడం రెండుదేశాలమధ్య పరస్పర మైత్రీబంధానికి నిదర్శనమాన్నరు. దుబాయ్ యువరాజు షేక్ >>2




# అమలులోకి వక్ఫ్ సవరణ చట్టం

### నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** దేశంలో వక్ఫ్‌సవరణ చట్టంనేటినుంచి అమలులోకి వచ్చింది. ఈమేరకు కేంద్రం నోటిఫికేషన్ జారీచేసింది. గత వారంపార్లమెంటు ఉభయ సభలు సవరణ చట్టాన్ని ఆమోదించి రాష్ట్రపతికి పంపింన విషయం తెలిసిందే. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదించగా ఎప్పటినుంచి అమలుకు వస్తుందనేది స్పష్టత రాలేదు. అయితే మంగళవారంనుంచి వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చిందని నోటీఫికేషన్‌లోపేర్కొంది. కేంద్రం పంపిన వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును ఏప్రిల్ 8న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. రెండు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని న్యాయమంత్రిత్వశాఖ తన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఏప్రిల్ 4న రాజ్యసభ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లురాగా లోక్‌సభ సుదీర్ఘ చర్చ తర్వాత ఏప్రిల్ 3న బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సభలో 288 మంది ఎంపిలుఅనుకూలంగాను 232 మంది వ్యతిరేకంగాను ఓటు వేసారు. అయితే 1995 చట్టంప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం చట్టం కింద ఒక వ్యక్తి తన ఆస్తిని మతపరమైన దాతృత్వ ఉద్దేశాలకోసం శాశ్వతంగా అంకితంచేయడం. ఒకటి ప్రకటన ద్వారా దీర్ఘకాల వినియోగం >>2

# 15 యేళ్ల తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

### 1061 పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు

### విద్యారంగ పునర్నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం తొలి అడుగు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఏప్రిల్8:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పునర్నిర్మాణం వైపు ప్రజా ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ట్విట్టర్ వేదికగా ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 1061 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు విడుదల చేసినట్లు తెలిపారు. గడచిన 15 ఏళ్లుగా ఈ ప్రక్రియ జరగకపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని, విస్మయాన్ని కలిగించిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో విద్యరంగం పట్ల చూపిన నిర్లక్ష్యం పేద బిడ్డల భవిష్యతును దెబ్బతిందఆని సిఎం విమర్శించారు. క్షమించరాని నేరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి వ్యవస్థలో జరిగిన ఇలాంటి తప్పిదాలను గుర్తిస్తూ, సరిచేస్తూ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర పునర్‌నిర్మాణం దిశగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో గల ఖాళీలను నింపుతూ,నాణ్యతగత బోధనకు అవసరమైన మానవ వనరులను సమకూర్చే దిశగా ఈ చర్యలు కీలకమని వ్యాఖ్యానించారు. ఈ పోస్టుల భర్తీతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు కొత్త ఊపిరి లభించనుంది. విద్యారంగాన్ని బలోపేత చేయడమే సమగ్ర అభివృద్ధికి మించిన దారి అంటూ ముఖ్యమంత్రి పేర్కొంటూ ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలో మంగళవారం రాట్నం వడుకుతున్న సిఎం రేవంత్

## సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్8:** గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతీ ఆశ్రమాన్ని సిఎం రేవంత్ సందర్శించారు. జాతిపిత మహాత్మ గాంధీకి నివాళులర్పించారు. ఆశ్రమంలో సాగిన మహా త్మాగాంధీ జీవన విధానం,ఆశ్రమ విశిష్టతలను అడిగితెలుసుకున్నారు. గాంధీ వాడిన చరఖా తిప్పి దాన్ని పరిశీలించారు. అనంతరం ఆశ్రమంలోనిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు. అహ్మదాబాద్ రెండు రోజుల పాటు జరిగే ఎఐసిసి ప్రత్యేక సమావేశాల కోసం ఆయన గుజరాత్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. కాగా, సిడబ్ల్యుసి సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క,మంత్రి దామోదర రాజనర్సింహ్మా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నేత కొప్పుల రాజు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి,ఏపీ పిసిసి మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు:

# శ్రవణ్ రావును సుదీర్ఘంగా విచారించిన సిట్



### చెక్ చేసిన రెండు ఫోన్లలో డేటా ఆధారంగా ప్రశ్నలు సంధించిన పోలీసులు

### మరోసారి పిలిస్తే విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరవ నిందితుడుగా వున్న మీడియా అధినేత శ్రవణ్ రావును మూడవసా రి ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారుల ఎదుటహాజరయ్యారు. ఇంతకు ముందు రెండు సార్లు శ్రవణ్ రావును విచారించిన సిట్ అధికారులు మంగళవారం 11 గం టల పాటు విచారించారు. జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసును విచారించే నిమిత్తం ఏర్పాటైన సిట్ కార్యాలయంలో శ్రవణ్ రావు విచారణ జరిగింది. ఉదయం 11 గంటల సమయంలో విచారణకు రాగా రాత్రి 10 గంటల వరకు ఈ విచారణ జరిగింది. గత ఏడాది (2024) మార్చి నెలలో వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు వుండడం తెలిసిందే. ప్రభాకర్ రావుతో పాటు ఆరవ ముద్దాయిగా వున్న శ్రవణ్ రావు ఈ కేసు వెలుగు చూడక ముందే గత ఏడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు పారిపోవడం విదితమే. ఈ కేసులో మిగతా నిందితులుగా వున్న నలుగురు పోలీసు అధికారులు అరెస్టయి పది నెలల తరువాత జైలు నుంచి బెయిలుపై విడుదలయ్యారు. అమెరికాలో వున్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను భారత్‌కు రప్పించేందుకు సిట్ అధికా రులు చేస్తున్న ప్రయత్నాలు ఇటీవలే ఓ కొలిక్కి వచ్చి వీరిపై ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా ఇదే సమయంలో ప్రభాకర్ రావు హైకోర్టులో ముంద స్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా శ్రవణ్ రావు >>2



### దిల్‌సుక్‌నగర్ జంట పేలుళ్ల

# నిందితులకు 'ఉరి' సబబే

### ఎన్ఐఎ కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన దిల్‌సుక్‌నగర్ జంట పేలుళ్ల కేసులో నిందితులుగా వున్న ఐదుగురు ఉగ్రవాదులకు హైకోర్టు ఉరిశిక్షను ఖరారు చేసింది. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టి వేయాలన్న నిందితుల పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టి వేసింది . 2013 ఫిబ్రవరి 21వ తేదీన దిల్‌సుక్‌నగర్‌లోని బస్ స్టాప్, మిర్చి పాయింట్ వద్ద జంట బాంబు పేలుళ్ల సంభవించడం తెలిసిందే. మొదట బస్ స్టాప్ వద్ద రెండవ ది మిర్చి పాయింట్ వద్ద పేలుళ్ల సంభవించాయి. ఈ పేలుళ్లలో 18 మంది మరణించగా 131 మంది గాయపడ్డారు. అప్పటి పేలుళ్లలో గాయపడ్డ వారిలో అనేక మ ంది ఇప్పటికీ చికిత్స పొందుతూనే వుండగా చాలా మంది నడవలేక పోతున్నారు. ఈ పేలుళ్లపై మొదట సరూర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టగా ఆ తరువాత ఉమ్మడి ఎపి సర్కారు సిట్‌కు బదలాయించింది. దీని తరువాత కేంద్ర హోం శాఖ రంగంలో దిగడంతో ఎన్ఐఎ దీని విచారణను చేబట్టింది. ఈ పేలుళ్లకు ఇండియన్ ముజహిదీన్ అనే ఉగ్రవాద సంస్థ కారణమని ఎన్ఐఎ తేల్చింది. ఈ సంస్థకు చెందిన ఉగ్రవాది కర్నాటకకు చెందిన రియాజ్ భత్కల్ పేలుళ్లకు సూత్రధారిగా తేలింది. ఇతను ఇప్పటికీ పట్టుబడలేదు. పాకిస్తాన్‌లో >>2

### దంతెవాడలో 26 మంది

# నక్సల్స్ లొంగుబాటు

### సత్ఫలితాలు ఇస్తున్న 'కమ్ బ్యాక్ హోమ్' ఆపరేషన్

### వివరాలు వెల్లడించిన డిఐజి కమ్లోచన్ కశ్యప్, దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్



దంతెవాడలో లొంగిపోయిన మావోయిస్టులను చూపిస్తున్న డిఐజి, ఎస్పీ

**భద్రాద్రికొత్తగూడెం, ప్రభాతవార్త,ప్రతినిధి:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో పోలీసులు, పారామిలటరీ బలగాలు నిర్వహిస్తున్న నక్సల్ నిర్మూలన ప్రచారం లోన్ వరటు (కమ్ బ్యాక్ హోమ్) సత్ఫలితాలు ఇస్తుంది. ఈ ప్రచారం స్ఫూర్తితో తాజాగా ముగ్గురు రివార్డ్ మావోయిస్టు నేతలతో సహా మొత్తం 26 మంది మావోయిస్టులు దంతెవాడ డిఆర్‌జి కార్యాలయం వద్దలొంగిపోయారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయులసమావేశంలో డీఐజీ దంతెవాడ రేంజ్ కమ్లోచన్ కశ్యప్, ఎస్పీ గౌరవ్ రాయ్‌లు మాటాడుతూ.. లొంగిపోయిన వారిలో ప్రముఖుడు రాజేష్ కశ్యప్ ఉన్నాడని, అతను అమడై ఏరియాజోన్ మిలిషియా కమాండర్‌గా చురుకుగా ఉన్నాడని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అతనిపై రూ.3లక్షల రివార్డును ప్రకటించిందనివెల్లడించారు. అదేవిధంగా గంపూర్ ఆర్పీసీ జనతన సర్కార్ ప్రెసిడెంట్ అయిన కోసా మాద్వి (రూ.1 లక్ష రివార్డ్), బెచాపాల్ ఆర్పీసీ సీఎన్ఎం సభ్యుడు ఛోటు కుంజమ్ (రివార్డ్ రూ.50 వేలు)లు లొంగిపోయినట్లు వెల్లడించారు. జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చిన మావోయిస్టులు అంతకుముందు వారి ప్రాంతాలలో రోడ్లు తవ్వడం, పోస్టర్లు మరియు బ్యానర్లు వేయడం, దోపిడీలు మరియు గ్రామస్థులపై దౌర్జన్యాలు వంటి నక్సలైట్ కార్యకలాపాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. సమావేశంలో సిఆర్‌పిఎఫ్‌లోని వివిధ బెటాలియన్ కమాండెంట్‌లు, అదనపు పోలీసు సూపరింటెండెంట్‌లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం యొక్క కొత్త పునరావాస విధానం ప్రకారం తక్షణ >>2



### గచ్చిబౌలి భూముల బాగోతాన్ని

# 2 రోజుల్లో బయటపెడతా

### వరంగల్ సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం


### టిడిపి తర్వాత బిఆర్ఎస్ మాత్రమే విజయవంతంగా పాతికేళ్లు పూర్తి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్8:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వెనకున్న పెద్ద బాగోతాన్ని రెండు రోజుల్లో బయటపెడతాని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆ వ్యవహారంలో ఒక బీజేపీ ఎంపీ కూడా ఉన్నారనిఆరోపించారు. రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్, బీజేపీపార్టీల ఉమ్మడి ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటే సరిపోదని జంతువుల మరణానికి కారణమైన వారిపై కేసులు పెట్టాలని, భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కు తగ్గాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఫెయిల్ సీఎంకాబట్టే కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకుంటోందని, మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదిపాటు జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాలకు వరంగల్ సభ ప్రారంభమని రెండు ఢిల్లీ పార్టీలు తెలంగాణకు హానికరంఅన్న అంశాన్ని ప్రజలకువివరిస్తామని మంగళవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో కేటీఆర్ చెప్పారు. నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ తర్వాత టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ మాత్రమే విజయవంతంగా పాతికేళ్లు పూర్తి చేసుకుంటోందని,ఏడాది పాటు నిర్వహించే రజతోత్సవాలకు 27న బహిరంగసభ ప్రారంభమని పేర్కొన్నారు. సభ కోసం వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో రైతుల >>2

# సర్కార్‌కు నిధుల సవాల్

### ఆర్థిక ప్రణాళికపై కేంద్ర ఆంక్షల ప్రభావం

### సొంత ఆదాయంపైనే ఎక్కువ ఆధారం



**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26లో తెలంగాణ సర్కార్‌కు నిధులు పెద్ద సవాల్ కానున్నాయి. అప్పులను సమకూర్చుకునే విషయంలో కేంద్ర ఆర్థిక ఆంక్షలు, గ్రాంట్లలో కోత వంటి వాటి ప్రభావం రాష్ట్ర ఆర్థిక ప్రణాళికపై చూపించనుంది. ఇచ్చిన హామీలను విధిగా అమలు చేయడం తప్పనిసరి పరిస్థితుల్లో అందుకు అవసరమైన నిధుల సమీకరణపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. అసలే తెలంగాణ ఖజానా లోటుతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయ, వ్యయాలు మధ్య వ్యత్యాసం భారీగా ఉండటంతో అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత ఏర్పడింది. నెలవారీ ఆదాయం మరో రూ.4వేల కోట్లు పెరిగితే తప్ప ఆర్థిక పరిస్థితి మెరుగు పడేలా కనిపించడం లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం విశేషం. ఆర్థిక శాఖ లెక్కల ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం నెలకు రూ.18వేల 500 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే. తెచ్చిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే ప్రతి నెలా రూ. 13వేల కోట్లు ఖర్చువుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3,04,965 కోట్లతో వార్షిక అంచనా బడ్జెట్‌ను తీసుకొచ్చింది. ఇందులో ఆరు ఎన్నికల హామీల అమలు కోసం రూ.56,000 కోట్లకు పైగా అవసరం ఉండగా, బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా రూ.64,000 కోట్లు సేకరించాలని భావిస్తోంది. మరో పక్క రాష్ట్ర >>2


న్యూఢిల్లీలో మంగళవారం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అయిన దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ షేక్ హమ్దాన్ బిన్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్

# పరస్పర సహకారం

>>హమ్దన్‌బిన్ మహ్మద్ అల్‌మక్తూమ్ భారత్‌లో రెండురోజులపర్యటననిమిత్తం ఢిల్లీకి చేరారు. దుబాయ్ యువరారాజు భారత్‌లో చేస్తున్న మొదటి అధికారిక పర్యటన కావడంతో ఆయన వెంట యుఎఇకి చెందిన పలువురు మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు, వ్యాపార వేత్తల బృందం కూడా ఉంది. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, రక్షణ సాంస్కృతిక సహకారంపై ఇరుదేశాధినేతలు చర్చించనున్నారు. బుధవారం షేక్ హమ్దన్ ముంబయికి వెళతారు. ఆయన భారత్ యుఎఇలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతంచేసేందుకు దోహదంచేస్తుందని విదేశాంగశాఖప్రకటించింది. వాణిజ్యసంబంధాల విస్తరణ కీలక అజెండాగా ఉంది. రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్య 85 బిలియన్ డాలర్లు దాటింది. అలాగే భారత్‌లోమౌలికసదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, స్మార్ట్‌సిటీలు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో యుఎఇనుంచి భారత్ పెట్టుబడులను ఆశిస్తోంది. ఇక దుబాయ్ యువరాజు షేక్ హమ్దన్ యుఎఇ రక్షణమంత్రిగా కూడా వ్యవహరిస్తుండటంతో రెండుదేశాలమధ్య పరస్పర రక్షణ సహకారం బలోపేతంచేయడంపై రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చలుజరుపుతారు. భారతీయ స్టార్టప్‌లు దుబాయిలోని పెట్టుబడిదారులమధ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై చర్చలుజరపనున్నారు. సాంస్కృతిక సంబంధాలను కూడా రెండుదేశాలమధ్య పెంపొందించుకునేదిశగా చర్చలు జరుగుతున్నాయి. అలాగే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోకూడా చర్చలుజరిపన యువరాజు రక్షణరంగంలో పరస్పరం కలిసి పనిచేసేందుకు ఒపనపందం జరిగింది.

# వక్ఫ్ సవరణ చట్టం

>> ఆధారంగా (వక్ఫ్‌బై యూజర్) వారసత్వం అంతరించినపుడు (వక్ఫ్ అలల్ ఔలాద్) ఏర్పడుతుంది. ఈ చట్టం కింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించేవాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంటుంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వేచేస్తారు. వివాదాను వక్ఫ్‌ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి. వాటి నిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. చట్టంప్రకారం వక్ఫ్‌బోర్డు సభ్యులుముస్లింలు మాత్రమే కావాల్సి ఉంటుంది. ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం ఆస్తులు దుర్వినియోగం తదితర సమస్యలున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్‌బోర్డులుప్రభుత్వ ఆస్తులనుసైతం వక్ఫ్‌గాప్రకటించడం వివాదాస్పదంగా మారింది. కొత్తగా తెచ్చిన చట్టంప్రకారంఎవరైనావక్ఫ్ ఆస్తిగాప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్ల ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి ఆతనికి మాత్రమే సొంతమై ఉండాలి. సవరణ చట్టంలో వక్ఫ్‌బై యూజర్ నిబంధన తొలగించారు. వక్ఫ్ అలల్ ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్‌నుంచి కలెక్టర్‌కు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరునెలల్లో కేంద్రీయ పోర్టల్‌లోనమోదుచేయాల్సి ఉంటుంది. వక్ఫ్‌బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతోపాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను సైతం చేర్చాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్‌నిర్ణం మాత్రమే అంతిమం కాదు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీలకు అవకాశం ఉంది. ఇకపై వక్ఫ్‌బోర్డులకు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారాలు ఉండవు.

# సర్కార్‌కు నిధుల సవాల్

>> బకాయిలు రూ. 4.51 లక్షల కోట్లకు పైగా (ఎఫ్ఆర్‌బిఎం రుణాలు) ఉన్నాయి మరియు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 5 లక్షల కోట్లకు పైగా పెరుగుతుందని అంచనా వేసింది. 2025-26లో సొంత పన్ను ఆదాయం రూ.1,45,420 కోట్లుగా బడ్జెట్‌లో అంచనా వేయబడింది. ఇదే సమయంలో బడ్జెట్ వెలుపల రుణాల సమస్యను పరిష్కరించడానికి, రుణ ఖర్చులను తగ్గించడానికి మరియు ఈ రుణాలకు సంబంధించిన తిరిగి చెల్లించే కాలాలను పొడిగించడానికి రాష్ట్రం ఆర్థిక సంస్థలతో చురుకుగా చర్చలు జరుపుతోంది, ఈ పరిస్థితుల్లో అప్పుల విషయంలో కేంద్ర ఆర్థిక నియంత్రణ చర్యలు సర్కార్‌ను ఇబ్బందులపాల్చేసేవిగా ఉన్నాయి. కేంద్రం నుండి ఇప్పటి వరకూ ఆశించిన గ్రాంట్లు రానప్పటికీ మరోమారు 64 వేల కోట్ల రూపాయలను అంచనా బడ్జెట్‌లో పేర్కొంది. కీలకమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు ఎన్నికల హామీలలో మహిళలకు నెలకు రూ.2,500, రూ.500 కి గ్యాస్ సిలిండర్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద రైతులు మరియు కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 ఉన్నాయి. ఇక గృహ జ్యోతి కింద అన్ని గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు కింద ఇంటి స్థలం మరియు ఇల్లు లేని వారికి ఐదు లక్షలు, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షలు, చేయు పథకం ప్రకారం నెలకు రూ.4 వేల సామాజిక భద్రతా పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వానికి సవాల్‌గా మారనుంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖకు రూ.24,439 కోట్లు కేటాయించగా, ఇందులో రైతు భరోసా నిమిత్తం ఎకరానికి ఏటా రూ.12,000 పెట్టుబడి మద్దతు, రైతుల నుండి సేకరించిన సన్న రకం వరికి క్వింటాలుకు రూ.500 అదనపు ప్రోత్సాహకం చెల్లించాల్సి ఉంది. వీటన్నింటికీ పెద్ద ఎత్తున నిధులు కావాల్సి ఉంది. అలాగే కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సమ్మక సాగర్ తదితర సాగు నీటి ప్రాజెక్టుల పనులను కొంత వరకూ అయినా చేపట్టాల్సి ఉంటుంది. మరోపక్క పీఆర్సీ అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారు. దీంతో పాటు కొత్త ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ వల్ల శాలరీ బడ్జెట్ పెరగనుంది. దీనికి ఒకట్రెండు పెండింగ్ డీఏలు తోడైతే ఆ మేరకు అదనపు నిధులు కావాలి. పైగా గత ఏడాదితో పోలిస్తే అప్పుల కిస్తీలు, వడ్డీల మొత్తం కూడా పెరగనుంది.నేపథ్యంలో అందుకు అనుగుణంగా నిధులను సమకూర్చు కోవడంపై దృష్టిసారించింది. ఇదే విషయాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియవచ్చింది.

# జిజెఎల్ఏ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీలకి ఒడి సౌకర్యం

## ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,ఏప్రిల్ 08,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొన్ని గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అదర్ డ్యూటీ(ఒడి) సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా తాజాగా గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జిజేఎల్ఏ)కి కూడా ఓడీ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, జనరల్ సెక్రటరీకి ఓడీ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబర్ 455ను జారీ చేసింది. 2024 సంవత్సరంతోపాటు 2025 విద్యా సంవత్సరానికి కూడా ఓడీ సౌకర్యంను కల్పిస్తున్నట్టు జీఏడీ ఇన్‌చార్జ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం రఘునందన్‌రావు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో జిజేఎల్ఏ అధ్యక్షులుగా కొనసాగుతున్న డాక్టర్ పి మధుసూదన్ రెడ్డితోపాటు జనరల్ సెక్రటరీ బలరామ్ జాదవ్‌కి ఓడీ సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటికే కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకి ఓడీ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

# హ్యాట్రిక్ ఓటమి రికార్డుతో చెన్నై సూపర్‌కింగ్స్

## 18 పరుగుల తేడాతో పంజాబ్‌కింగ్స్ గెలుపు

**ముల్లన్‌పూర్(పంజాబ్), ఏప్రిల్ 8:** ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ మళ్లీ విజయాలతో దూసుకుపోతోంది. ముల్లన్‌పూర్‌మైదానంలో ప్రియాన్ష్ ఆర్య 103 పరుగులుచేసి మెరుపు సెంచరీతో భారీస్కోర్‌చేసింది పంజాబ్ జట్టు. మాజీ ఛాంపియన్ సీఎస్కేను 201కే కట్టడిచేసింది. ఈ మ్యాచ్‌తో సిఎస్కే హ్యాట్రిక్ ఓటమి చెత్తరికార్డు మూటగట్టుకుంది. ఈసీజన్‌లో 190 ప్లస్ లక్ష్యం ఛేదించని సీఎస్కే మళ్లీ విఫలం అయింది ఓపెనర్ డెవాన్‌కాన్వే 69పరుగులతో రిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఇంపాక్ట్‌ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసాడు.చివరిలో ఎంఎస్‌ధోనీ 22 పరుగులుచేసినా ఓటమినుంచి తప్పించలేక పోయాడు. బౌలింగ్‌లో భారీగా పరుగులిచ్చిన చెన్నై బ్యాటింగ్‌లో రాణించలేక మూడో ఓటమి మూటగట్టుకుంది. రాజస్థాన్ చేతిలో ఓటమి నుంచి తేరుకున్న పంజాబ్‌ప్రత్యర్థికి భారీ లక్ష్యం నిర్దేశించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ప్రియాన్ష్ ఆర్య విధ్వంసక శతకం, శశాంక్‌సింగ్ 54 నాటౌట్‌లతో చెన్నై సూపర్‌కింగ్స్‌కు 220 పరుగుల టార్గెట్ ఇచ్చింది. ఛేదనలో ఓపెనర్ రచీన్ రవీంద్ర36 పరుగులు చేసాడు. గ్లెన్‌మాక్స్‌వెల్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఒక్కపరుగుతో ఫెర్గుసన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. 62 పరుగులవద్ద రెండో వికెట్ పడటంతో ఇంపాక్ట్ ప్లేయర్ శివందూబే 42 పరుగులుచేసినా ఓపెనర్ డేవాన్ కాన్వే 69 పరుగులుచేసిరిటైర్ట్ హర్ట్‌గా వెనుదిరిగినా మూడో వికెట్‌కు 90 పరుగులు కీలకభాగస్వామ్యం తెచ్చారు. దూబేను బౌల్డ్ చేసిన ఫెర్గుసన్‌చెన్నైకి షాకిచ్చాడు. ధోనీ 22, 19వఓవర్‌లో బౌండరీ, సిక్స్ కొట్టడంతో సిఎస్కే స్కోరు 190 దాటింది. యశ్‌ఠాకూర్ వేసిన 20వ ఓవర్ తొలి బంతికే ధోనీ ఔట్ అయ్యాడు. చివరి ఓవర్‌లోతొమ్మిది పరుగులు మాత్రమే రావడంతో చెన్నై జట్టు విజయానికి 19 పరుగుల దూరంలో నిలిచిపోయింది.

## వారం - వర్జ్యం

తేది : 09-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల ద్వాదశి రా.10.57
మఖ ఉ.9.58
వర్జ్యం సా.6.47 - రా.8.33
దు.ఉ.11.45- మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్తులాభం.

**వృషభం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తివ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** ప్రయాణాలలో తొందర పాటు వద్దు. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**కన్య :** అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు వుంటాయి.

**వృశ్చికం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభం.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు తీరుతాయి.

**కుంభం:** ధనవ్యయం. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వివాదాలకు, తగాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రిజిస్ట్రేషన్ పూర్తి

>> వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని ఆ రోజు నిర్ధేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెంటనే వెళ్లిపోవచ్చున్నారు.స్లాట్ బుక్ చేసుకోనివారికోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారని, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు.అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకం పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేసేందుకు 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు మరియు సిబ్బందిని నియమించడం జరిగిందని, దీనివలన కుత్బుల్లాపూర్ కార్యాలయంలో 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు.స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని అనుసంధానం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ విధానాన్ని ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట - సరూర్ నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేయడం జరిగిందని తెలిపారు.దస్తావేజులను స్వయంగా తయారు చేసుకోవచ్చు రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యూల్ ని ప్రవేశపెట్టామని మొదటగా సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం ఉంటుందని ఇది కూడా ఐచ్ఛికమేనని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజు పైన అమ్మినవాళ్ళు, కొన్నవాళ్లు, సాక్షులు,సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా సంతకాలు చేయడానికి చాలా సమయం పట్టడంతో దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతుంది. దీని వలన ప్రజల సమయం వృధా అవడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారు.దీన్ని నివారించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇసంతకం ప్రవేశపెడుతున్నామని ఈనెల చివరిలోగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.డబుల్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ ప్రతిరోజు ఎక్కడో ఒకచోట మా ఆస్తి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందనే ఫిర్యాదులు ప్రజల నుండి ఎక్కువగా వస్తున్నాయని,డబుల్ రిజిస్ట్రేషన్‌లను నివారించేందుకు చట్టాన్ని సవరించబోతున్నామన్నారు.డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ఇప్పటికే చట్టాలను సవరించుకున్నాయని,అదేవిధంగా తెలంగాణలో కూడా చట్టసవరణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22బి తీసుకువస్తామని తెలిపారు.

# నిందితులకు 'ఉరి' సబబే

>> తలదాచుకున్నాడని తేలింది. ఇతనికి తోడుగా వున్న అసదుల్లా అక్తర్ అలియాస్ హడ్డీ, జియా ఉర్ రహమాన్ అలియాస్ వఘాస్ ఊరఫ్ నబీల్ అహ్మద్, మహమ్మద్ తహాసీన్ అక్తర్ అలియాస్ హసన్ ఊరఫ్ మోను, యాసిన్ భక్తల్ అలియాస్ షారుక్, అజాజ్ షేక్ అ లియాస్ సమద్ అర్మాన్ తుండె, ఊరఫ్ సాగర్‌లు పేలుళ్లలో కీలకంగా వ్యవహరించారు. పేలుళ్ల తరువాత నెలల వ్యవధిలోనే నేరగాళ్లను ఎన్ఐఎ అరెస్టు చేసింది. పా ర్లమెంట్‌పై దాడిచేసిన అఫ్జల్ గురును ఉరితీసినందుకు ప్రతీకారంగానే తాము ఈ జంట పేలుళ్లకు పాల్పడినట్లు ఉగ్రవాదులు తెలిపారు.
పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో ఇజాజ్ షేక్ అనే ఉగ్రవాది చర్లపల్లి జైలులో ప్రత్యేక బ్యారక్‌లో భద్రత మధ్య వుంచగా మిగతా నలుగురు ఉగ్రవాదులు తీహార్ జైల్లో వున్నారు.. కాగా ఈ కేసును నాంపల్లి ఎన్ ఐఎ కోర్టు మూడేళ్ల పాటు విచారించింది. విచారణలో భాగంగా మొదట్లో ఉగ్ర వా దులను కోర్టుకు తీసుకురాగా ఆ తరువాత భద్రతా కారణాల వల్ల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. ఈ విచారణ 2016 డిసెంబర్ 13వ తేదీన ముగియడంతో అదే రోజున ఎన్ఐఎ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తూ పట్టుబడ్డ ఐదుగురు ని ందితులకు ఉరిశిక్ష విధించారు. ఉరిశిక్ష అనంతరం దీనిని ధృవీకరణ కోసం ఎన్ఐఎ కోర్టు హైకోర్టుకు నివేదించింది. ఇదే సమయంలో ఉరిశిక్ష పడ్డ ఐదుగురు నిందితులు తమ శిక్షను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో అప్పీల్ చేశారు. దీనిపై జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ లక్ష్మణ్‌లతో కూడిన ధర్మాసనం 45 రోజుల పాటు విచారించి ఎన్ఐఎ కోర్టు తీర్పును సమర్థించింది. ఎన్ఐఎ కోర్టు ఇచ్చిన తీర్పు సరిగ్గానే వుందని, దీనిని మార్చాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు అనంతరం అక్కడే వు న్న బాధితులు హర్షం వ్యక్తం చేసి పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.

**సుప్రీం కోర్టులో సవాల్ చేస్తాం...డిఫెన్స్ న్యాయవాది వెల్లడి**

ఇదిలావుండగా దిల్‌సుక్‌నగర్ జంట పేలుళ్ల కేసులో ఆరవ నిందితుడుగా వున్న అజాజ్ షేక్ సమర్ అర్మాన్ తరపున వాదించిన న్యాయవాది మహమ్మద్ షుజావుల్లా మాట్లాడుతూ హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. ఈ కేసులో ఉరిశిక్ష పడ్డ వారంతా అమాయకులేనని ఆయన తెలిపారు. హైకోర్టు తీర్పు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఒక నిందితుడి తరపునే వాదించాని, అయితే ఐదుగురు కూడా నిర్ధోషులేనని తెలిపారు. హైకోర్టు తన వాదనలను పరిగణలోకి తీసుకోలేదని, దీనిపై సుప్రీం కోర్టులో అన్ని విషయాలు చెబుతానని ఆయన తెలిపారు.

# విచారించిన సిట్

>> తనను అరెస్టు చేయకుండా సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. దీని తరువాత శ్రవణ్ రావుకు పోలీసులు నోటీసులు జారీ చేయగా గత నెల 29వ తేదీన మొదటిసారి సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మొదటి దఫా విచారణలో ఆరున్నర గం టల పాటు శ్రవణ్ రావును పోలీసులు విచారించారు. ఈ విచారణలో ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడ కొన్నారు...? ఎవరి వద్ద కొన్నారు...? ఇందు కోసం ఎంత డబ్బులు వెచ్చించారు...? ఈ డబ్బులను ఎవరు సమకూర్చారు...? ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగింది...? ఎంత కాలం పాటు జరి గింది...? నాటి పి సిసి చీఫ్‌గా వున్న రేవంత్ రెడ్డితో పాటు ప్రతిపక్ష నేతల ఫోన్‌లను ఎందుకు ట్యాపింగ్ చేయాల్సి వచ్చింది...? రేవంత్ రెడ్డి ఇంటికి సమీపంలో మొ బైల్ ట్యాపింగ్ కేం ద్రం ఏర్పాటు చేసి ఆయన ఫోన్‌ను ట్యాపింగ్ చేసిన మాట నిజమేనా...? ఇలా చేయమని ఎవరు ఆదేశించారు...? దీంతో పాటు అప్పట్లో జరిగిన ఉప ఎన్నికల సమ యంలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తల వాహనాలలో వున్న డబ్బులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం వెనుక ట్యాపింగ్ వుండడం నిజమేనా...? కేవలం ప్రతిపక్ష నేత లతో పాటు వారి అనుచరుల డబ్బులు మాత్రమే పోలీసులు జప్తు చేయడం వెనుక ట్యాపింగ్ జరగడం నిజమేనా...? వంటి అంశాలపై వందల సంఖ్యలో ప్రశ్నలకు పో లీసులు శ్రవణ్ రావు నుంచి సమాధానాలు రాబట్టారు. దీని తరువాత ఈ నెల రెండవ తేదీన మరోసారి విచారణకు ఆయనను పిలిచారు. రెండవసారి విచారణ కేవలం గంట పాటే జరిగింది. ఈసారి విచారణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మీరు వాడిన ఫోన్లను తేవాలని పోలీసులు కోరగా ఆయన రెండు ఫోన్లను ఇచ్చారు. అయితే ఈ ఫోన్లలో ఎలాంటి సమాచారం లేదని, అసలైన ఫోన్లకు ఇవ్వాలని కోరగా వేరే ఫోన్లను ఇచ్చినట్లు తెలిసింది. ఈ ఫోన్లలో లభించిన సమాచారం ఆధారంగా మంగళవారం నాడు మూడవ దఫా విచారణకు రావాలని పోలీసులు పిలిచారు. పోలీసుల నోటీసులకు స్పందించిన శ్రవణ్ రావు ఉదయం 11 గంటలకు సిట్ అధికారు ల ఎదుట 2023 ఎన్నికల సమయంలో వాడిన ఫోన్‌లతో పాటు కొన్ని పత్రాలతో హాజరవగా రాత్రి పది గంటల వరకు విచారణ సాగింది. ఈ విచారణలో సిట్ బాస్‌గా వున్న పశ్చిమ మండల డిసిపి విజయ్ కుమార్, ఎసిపిగా వున్న వెంకటగిరితో పాటు వారి బృందంలోని అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ విచారణలో శ్రవణ్ రావును సిట్ అధికారులు 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్‌ల ట్యాపింగ్ గురించి ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో పాటు ఆ సమయంలో ఎవరెవరి ఫోన్‌లను ట్యాపింగ్ చేశారు. ఎన్ని నెలలు ట్యాపింగ్ చేశారు...? ఇందుకోసం ఎన్ని కేంద్రాలు, ఎన్ని మొబైల్ ట్యాపింగ్ కేంద్రాలు ఉపయోగించారు...? ఇం దులో పాల్గొన్న పోలీసు అధికారులు ఎందరు...? ప్రైవేటు వ్యక్తులు ఎదరు...? అనే వివరాలను కూడా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ స్కాంలో అప్పట్లో అధికారంలో వున్న రాజకీయ నాయకులు ఎవరైనా సహకరించారా...? అని సిట్ అధికారులు శ్రవణ్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా సిట్ అధికారుల ప్రశ్నలకు శ్రవణ్ రావు మొదట తడబడినా ఆ తరువాత సమాధానాలు చెప్పినట్లు సమాచారం. కాగా విచారణ తరువాత మరోసారి పిలిస్తే విచారణకు రావాలని సిట్ అ ధికారులు ఆయనను ఆదేశించారు. రాత్రి పది గంటల ప్రాంతంలో పోలీసు స్టేషన్ నుంచి బయటకు వచ్చిన శ్రవణ్ రావు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.



న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన ఒడిశా పెట్టుబడిదారుల సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరికి జ్ఞాపికను అందజేస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

# 2 రోజుల్లో బయటపెడతా

>> సమ్మతితో పూర్తిగా ప్రైవేట్ భూములే సిద్ధం చేసినట్లు చెప్పారు. సభ అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేశామని, త్వరగా అనుమతి ఇవ్వాలని నిన్న డీజీపీని కూడా కోరినట్లు ఆయన తెలిపారు. సభకు పోలీసులు అనుమతి ఇస్తారని ఆశిస్తున్నామని ఇవ్వకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. 3000 ఆర్టీసీ బస్సులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అన్ని జిల్లాల నేతలతో కేసీఆర్ సమావేశమై నియోజకవర్గాల వారీగా సన్నాహకాలు సమీక్షించారని వరంగల్‌లో అవసరమైన కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ చరిత్రలో ఇది పెద్ద సభ అవుతుందన్న కేటీఆర్ దిల్లీ పార్టీలను నమ్ముకుంటే అధోగతే అన్నారు. పాతికేళ్ల గొప్ప సందర్భంలో ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని 27న సభ తర్వాత పార్టీ సభ్యత్వాలు, విద్యార్థి విభాగం సభ్యత్వాలు డిజిటల్ విధానంలో చేపడతామని అన్నారు. అక్టోబర్ 2025 లో పార్టీ అధ్యక్ష ఎన్నిక జరగాల్సి ఉంటుందని సభ్యత్వ నమోదు తర్వాత వార్డు మొదలు అన్ని స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మే నుంచి అక్టోబర్ వరకు పార్టీ సంస్థాగత నిర్మాణం, ఆ తర్వాత జిల్లా కార్యాలయాల్లో నియోజకవర్గాల వారీగా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని కేటీఆర్ వివరించారు. ప్రతి నెల వివిధ జిల్లాల్లో వివిధ కార్యక్రమాలు చేపడతామని జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల రావచ్చు అంటున్నారని తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామన్న ఉపముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. జంతువుల వధకు కారణమైన వారిపై కేసులు పెట్టాలని, 400 ఎకరాల విషయంలో ప్రభుత్వం వెనక్కు తగ్గాల్సిందేనని డిమాండ్ చేశారు. ఏఐ జెనరేటెడ్ అని ప్రభుత్వం తప్పించుకోవాలని చూడడం తగదని,ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్ అని తామూ అనవచ్చని వ్యాఖ్యానించారు. జంతువులు, పక్షులు దిక్కులేక చుట్టుపక్కల ఉన్న ఇండ్ల వద్దకు పోతున్నాయని భారీగా ఖర్చు చేసి టూల్ కిట్ సాయంతో సోషల్ మీడియాలో ఎదురుదాడి చేయిస్తున్నారని ఆక్షేపించారు. తనకు దక్కనిది ఎవరికీ దక్కకూడదన్న ఉద్దేశంతోనే 2000 ఎకరాల్లో ఏకో పార్కు అని దుర్మార్గంగా ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు కంటే తానే ఎక్కువ అని సీఎం అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు.2013 చట్టం ప్రకారం సామాజిక, పర్యావరణ ప్రభావం అధ్యయనం జరగాలన్న, ఆయన ఒక్క చెట్టు కొట్టాలన్నా అనుమతి అవసరమని, టీజీఐఐసీ ఎవరి అనుమతి తీసుకొందని ప్రశ్నించారు. కౌంటర్‌కు పది రోజుల సమయం తీసుకొని ఆలోగా మొత్తం తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నించిందని ఆక్షేపించారు. ఇప్పటి వరకు జరిగిన చెట్లు, వన్యప్రాణుల నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

# దంతెవాడలో 26 మంది నక్సల్స్ లొంగుబాటు

>> సహాయం మొత్తం రూ.50,000తో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర అవసరమైన సౌకర్యాలు అందించబడతాయని డీఐజీ డీఐజీ దంతెవాడ రేంజ్ కమ్లోచన్ కశ్యప్ తెలిపారు. ఆర్ఎఫ్‌టీ (ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దంతెవాడ,సీఆర్‌పీఎఫ్ యొక్క 111వ, 195వ, 230వ, 231వ బెటాలియన్లు ఈ మొత్తం ఆపరేషన్‌లో ముఖ్యమైన పాత్ర పోషించాయని, వారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని, ఒంటరి వారటు ప్రచారంలో ఇప్పటి వరకు 224 మంది రివార్డు పొందిన మావోయిస్టులతో సహా మొత్తం 953 మంది మావోయిస్టులు లొంగిపోయి తిరిగి సమాజ స్రవంతిలోకి వచ్చారని తెలియజేశారు.

# పవన్ కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలి: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్8:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడికి జరిగిన ప్రమాద వార్తపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం శంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ షాక్‌కు గురయ్యారు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు తన ట్విట్టర్ ఖాతాలో సిఎం రేవంత్ పోస్ట్ చేశారు. అగ్ని ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు.

# పోలీసుల విచారణకు సహకరించాలని క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్8:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారానికి సంబంధించి నకిలీ వీడియోలను పోస్టు చేశారన్న కేసులో పోలీసులకు సహకరించాలని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌ను హైకోర్టు ఆదేశించింది. 400 ఎకరాల భూముల విషయంలో నకిలీ ఏఐ వీడియోలు, చిత్రాలను పోస్టు చేశారంటూ ఆయనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ మన్నె క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పోలీసుల విచారణకు సహకరించాలని ఆయనను ఆదేశించింది. అలాగే కొణతం దిలీప్‌నకు నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు తెలియజేశారు.

# తాగిన మత్తులో పాదచారులపై వాహనాన్ని నడిపిన కాంగ్రెస్ నాయకుడు.. ముగ్గురు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్8:** జైపూర్‌లోని ఇరుకు రోడ్డులో కాంగ్రెస్ నాయకుడొకరు తాగిన మత్తులో పాదచారులపై ఎస్‌యువిని వేగంగా నడపడంతో ముగ్గురు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాంగ్రెస్ వెంటనే ఆ నాయకుడిని పార్టీ నుంచి బహిష్కరించింది. కారు ఎంఐ రోడ్డు నుంచి నహార్‌గఢ్ ప్రాంతంలోని ఇరుకైన సందులో వెళుతుండగా, అది దారిలో ఉన్న పాదచారులను, వాహనాలను ఢీ కొట్టింది. ఆ కారును నడింపింది 62 ఏళ్ల ఉస్మాన్ ఖాన్‌గా గుర్తించారు. ఆయన ఓ ఫ్యాక్టరీ యజమాని, పైగా కాంగ్రెస్ జైపూర్ జిల్లా ఉపాధ్యక్షుడు.ఈ ఘటన తర్వాత బాధితులకు, వారి బంధువులకు ఆర్థిక పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, ఇతర సాయం అందించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు నహార్‌గఢ్ పోలీస్ స్టేషన్ వద్ద గుమిగూడి రోడ్లను దిగ్బంధించి నిరసన తెలిపారు. శాస్త్రినగర్‌లోని రాణా కాలనీ నివాసి అయిన ఉస్మాన్‌ఖాన్ ఘటన జరిగిన సమయంలో మద్యం మత్తులో ఉన్నాడని అదనపు డిసిపి(నార్త్) బజరంగ్ సింగ్ షెకావత్ తెలిపారు.

# శరవేగంగా కొనసాగుతోన్న 'ఇందిరమ్మ' పథకం

## మొదటి దశలో రూ.1 లక్ష లబ్ధిదారుల ఖాతాలో జమ

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా అమలు అవుతోంది. పునాది దశ పూర్తిచేసిన లబ్ధిదారుల ఖాతాల్లో రూ. లక్ష చొప్పున నిధులు జమ చేయనున్నారు. తెలంగాణలో ఇండ్ల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న పేద ప్రజలకు గుడ్ న్యూస్. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రస్తుతం వేగంగా అమలు అవుతోంది. ఈ పథకం కింద ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు మొదటి విడతగా రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.ఇల్లు నిర్మాణానికి పునాది దశ పూర్తయిన లబ్ధిదారుల ఖాతాల్లో త్వరలోనే నిధులు జమ చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే పథకానికి అవసరమైన నిధులు సమీకరించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా హౌసింగ్ కార్పొరేషన్ హడ్కో బ్యాంక్ నుంచి రూ. 3,000 కోట్ల రుణం పొందింది. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా పునాది దశ పూర్తి చేసిన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలు ఎలా సాగుతున్నాయో తెలుసుకోవడానికి అధికారులు ప్రతీ ఇంటినీ పరిశీలిస్తున్నారు. ఇళ్లకు సంబంధించిన ఫోటోలు తీసి, జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 1,265 ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాగా, ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పునాది దశ పూర్తిచేసిన లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయనున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చెక్కుల పంపిణీ కూడా చేయనున్నారు. ఇల్లు నిర్మించడానికి తగినంత నిధులు లేని లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాల సౌకర్యాన్ని కూడా అందిస్తున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు మండలంలో కొందరికి ఇప్పటికే రూ.లక్ష చొప్పున రుణాలు మంజూరు చేశారు. అలాగే ఇతర జిల్లాల్లో కూడా ఈ విధంగా అవసరమైన రుణాలు అందేలా చూడాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా సెర్ప్ సీఈవోకు సహకారం అందించాలని కూడా లేఖ పంపించారు. పునాది పూర్తయ్యాక లభించే రూ.లక్ష సాయం ఎస్‌హెచ్‌జీ( సెల్ఫ్‌హెల్ప్) నుంచి తీసుకున్న రుణాన్ని తీర్చడానికే ఉపయోగించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇది రుణాల తిరగడంలో స్థిరత్వాన్ని తీసుకొస్తుంది.ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కేంద్ర ప్రభుత్వ పీఎంఏవై థకంతో అనుసంధానం చేసి, కేంద్రం నుంచి అదనపు నిధులు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో పిఎంఏవై రూరల్ కింద రాష్ట్రానికి ఇళ్లు మంజూరు చేయాలన్న రాష్ట్ర విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. కేంద్ర పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.72,000, పట్టణాల్లో రూ.1.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అధికారికంగా ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 71 వేల మందిని ఎంపిక చేయగా, ఇప్పటికే 44,616 మందికి మంజూరు పత్రాలు ఇచ్చారు. అయితే ఇప్పటివరకు కేవలం 13,222 ఇళ్లకు మాత్రమే స్థలాలు గుర్తించగా, 1,250 ఇళ్లు పునాది దశను పూర్తిచేశాయి. మొదటి విడతగా పునాది పూర్తి చేసిన వారందరికీ రూ.లక్ష చొప్పున సాయం అందించనున్నారు. ఈ డబ్బు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేయడం ద్వారా ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా పారదర్శకతను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ప్రజలను రెచ్చగొట్టడానికే అభూత కల్పనలు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ప్రజలను రెచ్చగొట్టడానికి లేనివి ఉన్నట్లుగా చూపుతున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిందించారు. గాంధీ భవన్‌లో మీడియా మాట్లాడుతూ కేటిఆర్ పెట్టిన ఫోటోలతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లాంటి పెద్దమనుషులు ఇరుక్కుంటున్నారని అన్నారు. హెచ్‌సియు భూములపై పోస్టులు కేంద్రమంత్రి డిలీట్ చేశారని ఆయన గుర్తుచేశారు. కిషన్‌రెడ్డి చూసి మిగితా వాళ్ళు కూడా తొలగించారని ఆయన తెలిపారు. కవిత తీహార్‌జైలు నుంచిరాగానే బయట కనపడటానికి ఏదో ఒక కార్యక్రమాన్ని తీసుకొంటున్నదని అన్నారు. కెసిఆర్ వలే కాంగ్రెస్ ఏక పాత్రాభినయం చేయదని ఆయన అన్నారు. బండి సంజయ్ తెలంగాణకు రాగానే కార్పొరేటర్ అవుతారని ఐఎన్‌జి బిల్లిరావ్‌పై విచారణవేయాలని ఆనాటి ముఖ్యమంత్రి ప్రధానమంత్రి పై కూడా విచారణ చేయాలని ఆయన సూచించారు. గోపన్‌పల్లిలో నాలుగు వందల ఎకరాల భూమి కాపాడింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆయన తెలిపారు. కేటిఆర్, రేవంత్‌రెడ్డి ఒకటే బండి సంజయ్ తగదని కేవలం డిలిమిటేషన్ కోసం చెన్నైపోతే ఒక్కటైనట్లా అని ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజనతో అన్యాయం జరుగొద్దని పోరాటం చేస్తున్నారు.

# జిఎస్టీ వృద్ధి రేటులో వెనుకబడిన తెలంగాణ : మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 8:** 2025 మార్చి నెల తెలంగాణ జీఎస్టీ వృద్ధి జీరో శాతంకు పడిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. దేశవ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధి రేటు 10శాతం ఉండగా, తెలంగాణ రాష్ట్రం దేశీయ వృద్ధి రేటుతో పోలిస్తే చాలా వెనకబడి ఉందని మంగళవారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాసనసభలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. 'జీఎస్టీ వృద్ధి 12.3శాతంగా ఉందని శాసనసభలో ప్రకటించడం శోచనీయం' అని హరీశ్ రావు అన్నారు. ఆర్థిక మంత్రి సభను మాత్రమే కాదు.. రాష్ట్ర పౌరులను మోసం చేశారు. కొవిడ్ వేళ తప్ప ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఎన్నడూ నమోదు కాలేదన్నారు. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే భట్టి విక్రమార్క వాదనలు పూర్తిగా అవాస్తవమైనవిగా తేలిపోయాయని ఎక్స్‌లో స్పష్టం చేశారు.

'బడ్జెట్ సమావేశాల్లో నేను ఈ విషయాన్ని ప్రస్తావించి, రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5శాతంకు పరిమిత మవుతుందని హెచ్చరించాను. మా సలహాలు,హెచ్చరికలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 2024-25లో రాష్ట్రం కేవలం 5.1 శాతం వృద్ధి సాధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఇప్పటివరకు ఎన్నడూ నమోదు కాలేదు, కోవిడ్19 లాక్‌డౌన్ కాలంలో తప్ప. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనం' అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు కారణమని హరీశ్ రావు పేర్కొన్నారు. 'క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అమలులో లోపాలు, రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడి సహాయం అందించకపోవడం, రైతు భరోసా పథకం కింద రూ.12,000 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థం తగ్గిపోయింది. అలాగే, హైడ్రా, మూసీ ప్రాజెక్టుల వంటి తప్పుడు విధానాలతో భయాందోళనలు సృష్టించి పెట్టుబడులు రాకుండా చేయడం, ఫార్మా సిటీ, మెట్రో రైలు ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతింది" అని ఆయన వివరించారు.రాష్ట్ర వృద్ధి రేటు తగ్గడానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థం తగ్గిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అంకెల గారడీతో కాకుండా వాస్తవాల ఆధారంగా పాలన అందించాలని హరీశ్‌రావు సూచించారు.

# మియాపూర్‌లో ఘోర రోడ్డుప్రమాదం

## ట్రాఫిక్ కానిస్టేబుళ్లపైకి దూసుకువెళ్లిన లారీ

## ఒకరు మృతి - మరో ఇద్దరికి తీవ్రగాయాలు

## మద్యం మత్తులో లారీడ్రైవర్



హోంగార్డు సింహాచలం (ఫైల్)

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మద్యం మత్తులో ఉన్న ఓ లారీ డ్రైవర్ మియాపూర్‌లో బీభత్సం సృష్టించాడు. అతివేగంగా దూసుకు వచ్చిన లారీ అదుపుతప్పి మియాపూర్ మెట్రో సమీపంలో ట్రాఫిక్ పోస్టును ఢీకొట్టగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మీద నుంచి లారీ వెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఓ హోంగార్డు తీవ్రగాయాలతో మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఐడిఏ బొల్లారంలో నివాసం ఉండే సింహాచలం(42) మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఇదే పోలీస్ స్టేషన్‌లో బిహెచ్ఈఎల్‌కు చెందిన వికేందర్, రాజేంద్రనగర్‌కు చెందిన రాజవర్ధన్‌లు కానిస్టేబుళ్లగా పనిచేస్తున్నారు. కాగా విధుల్లో భాగంగా సోమవారం రాత్రి వికేందర్, రాజవర్ధన్‌లు సింహాచలంతో కలిసి మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని పిల్లర్ నెంబరు 600 వద్ద గల యూటర్న్ మీద విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 10.30 గంటల ప్రాంతంలో కూకట్‌పల్లి వైపు నుంచి చందానగర్ వైపు వెళ్తున్న లారీ (ఏపి15 వై4069) మితిమీరిన వేగంతో దూసుకు వచ్చింది. లారీ స్పీడ్ అదుపు తప్పి యూటర్న్ వద్ద ఉన్న ట్రాఫిక్ పోస్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్ల మీద ట్రాఫిక్ పోస్టు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ వేగం ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ పోస్టు లారీ మధ్యతోకి దూసుకుపోయింది. ట్రాఫిక్ పోస్టు కింద పడడంతో హోంగార్డు తలకు, కానిస్టేబుళ్ల వికేందర్ చేతులు, కాళ్లకు, రాజవర్ధన్ కుడి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు స్థానికులతో కలిసి వీరిని మియాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వీరిని ఏఐజీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే హోంగార్డు సింహాచలం మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. రాజవర్ధన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మియాపూర్ పోలీసులకు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన శ్రీనివాస్(48)గా లారీ డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, 389 ఎంఎల్ వచ్చింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ వికేందర్ ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు డ్రైవర్‌ను అరెస్టుచేసి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు సింహాచలంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రమాద స్థలిలో ఉన్న రెండు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి.



అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

# సిద్ధిపేట జిల్లాలో మొదటిసారిగా కాన్గల్

## లేయర్ కోళ్ల ఫామ్‌లో బర్డుఫ్లూ సోకినట్లు నిర్ధారణ

## సమీక్షాలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్ధిపేట జిల్లా తొగుట మండలం కాన్గల్‌లో గల మైనా లేయర్ కోళ్ల ఫామ్‌లోని కోళ్లకు హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్ఫ్లుంజా వైరస్(బర్డ్ ఫ్లూ) సోకినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో ఈ వ్యాధి విస్తరణ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధితశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి విస్తరించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కోళ్ల ఫారంలో మొదటిసారిగా బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిందని ఈ ప్రాంతాలకు వ్యాపించకుండా మనుషులకు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్‌లోని కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో భూమిలో పూడ్చివేయాలన్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్ పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. 70 డిగ్రీ సెంటిగ్రేడ్‌కు పైగా ఉడికించిన కోళ్ల మాంసాన్ని తినవచ్చని తెలిపారు. ఉడికించిన కోళ్ల మాంసం,కోడి గుడ్లను తినడడం వలన ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జెడి అశోక్‌కుమార్, వైద్యాధికారి పల్వాన్‌కుమార్, డిపిఆర్ఓ రవికుమార్, రెవెన్యూ, ట్రాన్స్‌ఫోర్టు, అటవీ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్, కెటిఆర్ కలిసే రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు!

## బిజెపిని దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య అపవిత్ర పొత్తులు కొనసాగుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జాన్ జబ్బులు (ప్రాణ మిత్రులు)గా మారారని అన్నారు. అందులో భాగంగానే బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో కెసిఆర్ కుటుంబం అరెస్ట్ కాకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే ఆ కేసులను నీరుగారుస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి, విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలు, ధరణి భూముల కుంభకోణం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, ఫాంహౌజ్ డ్రగ్స్ కేసు వంటి వాటిలో కెసిఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని సాక్షాత్తు సిఎం రేవంత్ రెడ్డి మొదట్లో మాట్లాడారు. కానీ కెటిఆర్‌తో కుమ్మక్కైన తరువాత ఆ కేసులను నీరుగార్చేందుకు ప్రయత్ని స్తుండటం సిగ్గుచేటు అన్నారు. అందుకు ప్రతిఫలంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో కలిసి భూముల దోపిడీకి, అవినీతికి కెటిఆర్ సహకరిస్తున్నారు. ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో, బయట నిలదీయకుండా ఉత్తుత్తి డ్రామాలాడుతున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ దుయ్యబట్టారు

# పాక్‌లో మరో గజ ఉగ్రవాది హతం

## హతుడు అజర్ మసూద్ బంధువు

## పెషావర్‌లో పట్టపగలు కాల్చివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఉగ్రవాదులకు స్వర్గధామంగా వున్న పాకిస్తాన్‌లో ఇప్పుడు వారికే రక్షణ కరువయ్యింది. భారత్‌లో అనేక నేరాలు, ఘోరాలకు పాల్పడి పాకిస్థాన్‌లో జల్సాలు చేస్తూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్న గజ ఉగ్రవాదులు ఒక్క రొక్కరుగా గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో హతమవుతున్నారు. గడచిన రెండు నెలల కాలంలో పది మంది వాంటెడ్ ఉగ్రవాదులు గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో హత మవగా మంగళవారం పాకిస్తాన్‌లోని ద్వితీయ శ్రేణి వాణిజ్య నగరం పెషావర్‌లో ఉగ్రవాద సంస్థ జైష్ ఎ మహమ్మద్ అధినేత మౌలానా అజర్‌మ మసూద్ బంధువు బజాజ్ అబిద్‌ను బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతి సమీపం నుంచి కాల్చి చంపి క్షణాల వ్యవధిలో పారిపోయారు.



హతుడు పాకిస్తాన్‌లో భారత వ్యతిరేక ఉగ్ర సంస్థ రాడికల్ ఇస్లామిస్ట్ సంస్థలో కీలక నేతగా పేరుంది. జైష్ ఎ మహమ్మద్ సంస్థకు ఇతను రిక్రూటర్‌గా పనిచేస్తున్నాడు. పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి జైష్ ఎ మహమ్మద్ సంస్థలో యువకులను భర్తీ చేసి పాకిస్తాన్ ఆక్ర మిత కాశ్మీర్ నుంచి భారత్‌లోకి దొంగచాటుగా పంపడం ఇతని విధి. కాగా ఈ కాల్పుల్లో అబిద్ హతమవగా అతని సహాయకుడు బారీ షాహిద్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఓవైపు జైష్ ఎ మహమ్మద్‌కు రిక్రూటర్‌గా వుంటూనే అహ్లే ఎ సున్నత్ వాల్ జమాత్ అనే మరో ఉగ్రవాద సంస్థలోను అబిద్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అంతర్జాతీ య ఖత్మ్ ఎ నబువత్ అనే మరో సంస్థకు ఇతను ప్రాంతీయ అధిపతిగా కూడా వున్నాడు. ఒక మసీదు వెలుపల జరిగిన దాడిలో అబిద్‌ను కాల్చి చంపారు. కాగా అబిద్ నిత్యం హిందువులు, యూదులు, క్రైస్తవులపై వ్యతిరేక ప్రచారం చేసేవాడని అక్కడి పోలీసులు చెబుతున్నారు.

# నెహ్రూ, పటేల్ స్నేహం గొప్పది..

## ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం పటేల్ భావజాలానికి వ్యతిరేకం

## అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జన ఖర్గే



**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులపై బిజెపి ఆర్ఎస్ఎస్ చరిత్రను వక్రీకరణ చేస్తూ కుట్రలు పన్నుతున్నాయని అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జన ఖర్గే ఆరోపించారు.గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ మెమోరియల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ముందస్తు కుట్రప్రకారమే జాతీయ యోధులపై తప్పుడు ప్రచారం చేశారని ఖర్గే ఆవేదన చెందారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ భావజాలానికి వైరుధ్యాలు ఉన్నాయని ఆయన లౌకిక స్వభావం కలిగిన వ్యక్తి అని అన్నారు. చివరకు ఆర్ఎస్ఎస్‌ను పటేల్ బ్యాన్ కూడా చేయించారని చెప్పారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్రనూ పోషించని ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థ పటేల్ వారసత్వాన్ని తమకు అన్వయించుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. దేశంలో ఉన్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల చూపును మరల్చేందుకే మతపరమైన అంశాలను బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు లేవనెత్తుతున్నాయని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్‌లకు వైరం ఉండేది అనేలా బిజెపి ఆర్ఎస్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తు న్నాయి. వాళ్లిద్దరి మధ్య స్నేహపూర్వక సంబం ధాలు ఉండేవని నిరూపించే ఆధారాలు చాలానే ఉన్నాయి. 1937 మార్చి 7న గుజరాత్ విద్యా పీఠ్‌లో సర్దార్ పటేల్ ప్రసంగిస్తూ 'ఈ ప్రొవిన్షియల్ ఎన్నికల్లో గెలవడం ద్వారా కాంగ్రెస్‌కు గుజరాత్ తన నిజాయితీని చూపిస్తుంది. మేం కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూని పూలతో, విశాల మనసులతో స్వాగతం పలుకుతాం' అని చెప్పారు. ఈ వ్యాఖ్యలను బట్టి నెహ్రూ పై సర్దార్ పటేల్‌కు ఉన్న ప్రేమను మనం అర్థం చేసుకోవచ్చని ఖర్గే అన్నారు.

# డీఫ్యాక్టో సిఎంలా మీనాక్షి నటరాజన్

## బిజెపిఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ డీఫ్యాక్టో సిఎంలా వ్యవహరించడం శోచనీయమని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. ఆమె ఏకంగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి హైదరాబాద్ సెంట్రల్ వర్శిటీ భూముల వ్యవహారాన్ని సమీక్షించడాన్ని చూస్తుంటే రేవంత్‌రెడ్డి ఇక డమ్మీ సిఎం అనేది స్పష్టమైపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పాలనా పగ్గాలను రాహుల్‌గాంధీ తన చేతిలోకి తీసుకున్నట్టుగా అర్థమవుతోంది. కాంగ్రెస్ ఇంచార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న కొత్తలో మీనాక్షి నటరాజన్ ప్రభుత్వ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని చెప్పారు. ప్రస్తుతం ఆమె మాట తప్పి ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఏకంగా సచివాలయానికి రావడాని చూస్తుంటే రాహుల్‌గాంధీ ఆదేశాలు ఉన్నాయని తేలిపోయిందన్నారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోనే తన నివాసంలో ఉండగా మీనాక్షి నటరాజన్ ఏకంగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి సమీక్ష చేయడాన్ని చూస్తుంటే సిఎం రేవంత్‌రెడ్డి ఇక కోరలు లేని పాము అని అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సర్కారును రాహుల్ గాంధీ రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపించాలనుకుంటున్నారని, డీఫ్యాక్టో సిఎంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇపుడు డమ్మీ సిఎంగా మిగిలిపోయిన రేవంత్‌రెడ్డి త్వరలోనే మాజీ సిఎంగా మారతాడు అని తాజా పరిణామాలను బట్టి అర్థమవుతుందన్నారు.

# తెలంగాణ సోనాకు దేశవ్యాప్త డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**తెలంగాణలో పండుతున్న వరి ధాన్యం సోనారకానికి దేశ వ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోనా రకం బియ్యం తక్కవ కాలంలోనే రాష్ట్రంతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రతో సహ వివిధ రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ సోనా-ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం బియ్యం మార్కెటింగ్ చేసేందుకు పలు సంస్థల ముందుకు వస్తున్నాయి.

# ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలి

## మావోయిస్టులతో కేంద్ర సర్కార్ శాంతి చర్చలు ప్రారంభించాలి

## ప్రజాధర్నాలో పలువురు నేతల డిమాండ్





ప్రజా ధర్నాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

**హైదరబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపివేసి, గిరిజనుల జీవించే హక్కును పరిరక్షించాలని ప్రజా ధర్నాలో పలువురు నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మావోయిస్ట్ పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రజాధర్నా నిర్వహించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఉస్మానియా యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ రమా మెల్కోటే ప్రారంభించగా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, న్యూడెమోక్రసీ నేత జేవీ చలపతిరావు, సీపీఐ నాయకురాలు పశ్యపద్మ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, అరుణోదయ నాయకురాలు విమలక్క, ఆప్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ప్రొఫెసర్ కాశిం తదితరులు ధర్నానుద్దేసించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లో ఆదివాసీలపై కొనసాగుతున్న హత్యాకాండను వెంటనే ఆపాలని, సమాజాభివృద్ధిలో ఆదివాసుల పాత్ర ప్రధానమైనదిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపి, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని, మావోయిస్ట్‌లు లేదా నక్సలైట్లు అభివృద్ధి నిరోధకంగా వ్యవహరిస్తున్నా రనటం సరికాదని సూచించారు. నక్సలైట్లు దశాబ్దాలుగా ఎందుకు పోరాడుతున్నారో గుర్తించాలని, నిజానికి పాలక వర్గాలే హింసను ప్రేరేపిస్తూ ఉంటే తమను తాము రక్షించుకునేందుకు మావో యిస్ట్‌లు ఆయుధం పట్టవలసి వస్తోందని స్పష్టం చేశారు. మావోయిస్టులు ప్రతిపా దించిన శాంతి చర్చలకు కేంద్రం స్పందించి, చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకురాలు కే.రమా, ఎంసీపీఐ (యు) నాయకులు మట్టయ్య, లిబిరేషన్‌నాయకులు రమేష్‌రాజా, రెడ్‌ఫ్లాగ్ నాయకులు రాజేష్, ప్రొఫెసర్ గడ్డ లక్ష్మిన్, ప్రొఫెసర్ వినాయకంరెడ్డి, కన్నగంటి రవి, రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.


**SARFAESI చట్టం, 2002 (చట్టం) సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు**

| క్ర. సం. | రుణగ్రహీత(లు) పేరు మరియు చిరునామాదారు (లు) | రుణ మొత్తం (రూ.) | రుణ ఖాతా నెం. | తనఖా పెట్టిన ఆస్తి వివరాలు | బకాయి మొత్తం (రూ.) | NPA తేదీ |
|---|---|---|---|---|---|---|
| | (A) | (B) | (C) | (D) | (E) | (F) |
| 1. | శ్రీ గుల్లకుంట్ల శ్రావణ్ | రూ. 47,43,750/- | 53449231 & 53449487 | రంగారెడ్డి జిల్లా, GHMC యొక్క L.B నగర్ సర్కిల్, బ్లాక్ నం.3, 8 క్రింద సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, కర్మాన్‌ఘాట్ గ్రామం, హనుమాన్‌నగర్ వద్ద ఉన్న సర్వే నం.60/# (పాత నం.60 పార్ట్‌లో (500 చ.గజాలుకు సమానమైన 418.05 చ.మీటర్లలో) 47.2 చ.గజాల భూమి యొక్క అవిభాజ్య వాటాతో కలిపి (కామన్ ఏరియా, బాల్కనీలు మరియు కార్ పార్కింగ్ సహా) 1265 చ.అడుగుల కొలత గల "ఫార్చ్యూన్ కాజిల్" అనే అపార్ట్‌మెంట్‌లో ఐదవ అంతస్తులో ఫ్లాట్ నం.502, ఫర్నీష్డ్ గల మొత్తం ఆస్తి అంతా. **మొత్తం భూమికి సరిహద్దులు:** ఉత్తరం: ఫ్లాట్ నెం.46, దక్షిణం: ఫ్లాట్ నెం.44, తూర్పు: ఫ్లాట్ నెం.65, పశ్చిమం: 40 అడుగుల వెడల్పు రోడ్డు **ఫ్లాట్ నం కోసం సరిహద్దులు, 502** ఉత్తరం; బహిరంగం, దక్షిణం: బహిరంగం, తూర్పు: ఆకాశానికి తెరవండి, పశ్చిమం: 7' కారిడార్ మరియు మెట్ల కేసు | రూ. 46,89,237.01/- | 11/1/2024 |
| 2. | 1. శ్రీ అంకం నరహరి 2. అపర్ణ అంకం | రూ. 95,70,000/- | 54336791 | 13-6-250/3/12/A నం. 13-6-250/3/12/A ఉన్న ప్రాంగణంలోని మొత్తం భాగం మరియు పార్సిల్, 600 SFT నిర్మాణాలు మరియు 168 చదరపు మీటర్లకు సమానమైన 200 చ.గజాల స్థలం, జాఫర్‌గూడ, కార్వాన్, హైదరాబాద్-500067, తెలంగాణ వద్ద ఉన్నది. **సరిహద్దులు:-** ఉత్తరం : 25 అడుగుల వెడల్పు రోడ్డు దక్షిణం : B. రాములు, ఇ.నం. 13-6-250/3 తూర్పు : సత్యనారాయణ ఇ.నం. 13-6-250/3/12 పశ్చిమం : ఇరుగుపొరుగు ఇ.నం.13-6-250/3/12/B | రూ. 90,59,591.63/- | 01/01/2025 |

అయితే, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, 1వ అంతస్తు, అశోక్ భోపాల్ ఛాంబర్స్, S.P. రోడ్, సికింద్రాబాద్-500003లో తన శాఖ కార్యాలయాన్ని కలిగి ఉంది (ఇకపై "బ్యాంక్" అని సూచిస్తారు) పైన పేర్కొన్న రుణగ్రహీత(లు) కాలమ్ A లో వ్రాసిన కాలమ్ B లో వ్రాసిన ప్రత్యేక క్రెడిట్ సౌకర్యాలు ఉన్నాయి. కాలమ్ C లో పేర్కొన్నారని అకౌంట్ ద్వారా సీరియల్ నంబర్ 1 నుండి సీరియల్ నంబర్ 7 వరకు వరుసగా. ప్రతి రుణగ్రహీత (ఇకపై "సెక్యూర్డ్ అసెట్"గా సూచిస్తారు) పేరుకు ఎదురుగా D కాలమ్‌లో వ్రాసిన స్థిరాస్తిపై తనఖా ద్వారా చెప్పబడిన క్రెడిట్ సౌకర్యాలు అంతరాంతరంగా సురక్షితం చేయబడతాయి. అంటే, పైన పేర్కొన్న రుణగ్రహీత(లు) రుణ ఖాతాలో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో విఫలమయ్యారు మరియు బ్యాంక్ ద్వారా సాధారణ బ్యాంకింగ్ వ్యాపారంలో నిర్వహించబడే ఖాతాల పుస్తకాల ప్రకారం, ప్రతి రుణగ్రహీత(ల) పేరుకు వ్యతిరేకంగా కాలమ్ E లో బాకీ ఉన్న మొత్తం ఉంది.

పైన పేర్కొన్న రుణగ్రహీత(ల) నుండి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో నిరంతర డిఫాల్ట్ కారణంగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన నిబంధనలలో కాలమ్ F లో పేర్కొన్న తేదీలలో పైన పేర్కొన్న రుణగ్రహీత(ల) యొక్క రుణ ఖాతాను బ్యాంక్ నిరర్థక ఆస్తిగా వర్గీకరించింది. తత్ఫలితంగా, సెక్షన్ 13(2) చట్టం కింద నోటీసులు కూడా అందజేయబడకుండా తిరిగి పొందిన ప్రతి రుణగ్రహీత(లు)కి జారీ చేయబడ్డాయి.

పైన పేర్కొన్న డిఫాల్ట్ దృష్ట్యా, ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు నవీనమైన వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలతో సహా పైన పేర్కొన్న కాలమ్ E లో సూచించిన మొత్తం బకాయిలను చెల్లించడం ద్వారా బ్యాంక్ పట్ల వారి పూర్తి బాధ్యతలను పూర్తి చేయవలసిందిగా బ్యాంక్ దీని ద్వారా పిలుస్తుంది. చట్టంలో బ్యాంకుకు అందుబాటులో ఉంటుంది.

అంటే, దయచేసి మీరు, పైన పేర్కొన్న రుణగ్రహీతలు (లు) పరాయీకరణ చేయడం (బదిలీ, అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాలతో సహా) లేదా మూడవ పక్షం ఆసక్తిని సృష్టించడం లేదా బ్యాంక్ నుండి నిర్దిష్ట ముందస్తు వ్రాతపూర్వక అనుమతితో మినహా ఏ పద్ధతిలోనైనా సురక్షిత ఆస్తితో వ్యవహరించడం నుండి నిరోధించబడ్డారని తెలియజేయడమైనది. దాని ఉల్లంఘనకు ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడుతుందని తెలియజేయడమైనది.

రుణగ్రహీతలు, మీ దృష్టిని SARFAESI చట్టంలోని సెక్షన్ 13లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)కి ఆకర్షితుడయ్యింది, దీని కింద మీరు సెక్యూర్డ్ ఆస్తులను రిడీమ్ చేసుకోవచ్చని పేర్కొనబడింది. ఆస్తి(లు) పబ్లిక్ వేలం మరియు/లేదా ఇ-వేలం ద్వారా, కొటేషన్లను ఆహ్వానించడం ద్వారా, పబ్లిక్ నుండి టెండర్ లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా.

అది, దయచేసి ఇది సెక్షన్ 13(2) సెక్షన్ 13(2) ప్రకారం ఫైనాన్షియల్ అసెట్స్ యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002. మీ రిస్క్, బాధ్యత మరియు ఖర్చులకు సంబంధించి పైన పేర్కొన్న ఏవైనా లేదా అన్ని హక్కులను మీకు వ్యతిరేకంగా ఉపయోగించుకునే హక్కు బ్యాంక్‌కి ఉంటుందని చెప్పనవసరం లేదు.

తేది : 09/04/2025
ప్రదేశం : సికింద్రాబాద్

సం/- అధీకృత అధికారి
స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్

వార్త

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కటే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ పుల్లర్

# ఆక్వా కుదేలు!

అమెరికా తీరుతో ఆక్వారంగం కుదేలైంది. రైతులు, వ్యాపారులు ఈ నాలుగైదు రోజుల్లోనే వందల కోట్లరూపాయల మేరకు నష్టపోయారు. 2023-24ఆర్థిక సంవత్సరంలో భారత దేశంనుంచి అమెరికాకు రూ.2.55బిలియన్ల డాలర్లవిలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలోరొయ్యలే 92శాతం వాటాను కలిగిఉన్నాయి. అమెరికా దేశానికి సముద్రఆహార ఎగుమతులపై రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారతదేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతోంది. ఈక్వెడార్ వంటి దేశాలకు ఎగుమతిదారులపై కేవలం10శాతం పన్నుమాత్రమే అమెరికా విధిస్తోంది. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్‌కు భారతదేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది. దీనివల్ల మన దేశానికి పరోక్షంగా భారీనష్టం కలిగిస్తోంది. ఈసుంకాలవిధింపులో వ్యత్యాసం వలన మత్స్యవాణిజ్య ఎగుమతులలో వారికి అనుకూలంగా మారుతోంది. ఈ ఉపద్రవం నుంచిబయటపడే మార్గాలను ప్రభుత్వం అన్వేషించాల్సి ఉంది. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే5.77శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (సివిడి) భారాన్ని అదనంగా మోస్తున్నారు. అమెరికా విధించిన కొత్తసుంకం ఏప్రిల్ 5, 2025నుండి అమల్లోకి వచ్చింది.దీని కారణంగా అమెరికా దేశానికివెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈభారం పడుతోంది. గతంలో వచ్చిన ఆర్డర్‌లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి, కోల్డ్ స్టోరేజ్‌లు, పోర్టులలో ఉన్నాయి. కొత్త నిబంధనలవల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారంపడుతోంది. యూరోపియన్ యూనియన్‌లో భారతీయ ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేట్లు, 47శాతం దిగుమతి సుంకంతో సహా నాన్‌టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్‌తో వారి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ ఎఫ్‌టిఎ) కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయి లాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారతదేశం నుండి సీఫుడ్‌ను కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. కాగా తాజాగా తుది ఉత్పత్తులపై విధించిన అధికట్యాక్సుల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దుచేస్తున్నాయి. ఇలా ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వారైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకుఇలా సుంకాల బరువు నెత్తినపడింది. అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వారంగాన్ని ఆదుకొని అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ని కోరారు. ఇలాంటి సుంకాల కారణంగా తీవ్ర భయాందోళనలు చెందుతున్న ఆక్వారైతులు ఎగుమతి దారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని చెబుతున్నా,అదంతా మేకపోతు గాంభీర్యమే. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకోగలమని భరోసా ఇచ్చారు. రాష్ట్ర తలసరి ఆదాయంలో మత్స్య రంగం కీలకభూమిక పోషిస్తోంది. ఎపిలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో కూడా తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగంఉంది. మరోవైపు ఇంకా పంట సిద్ధంగా ఉంది. అధిక సుంకాల కారణంగా రైతుల నుండి పంట సేకరిచడం ఎగుమతిదారులు నిలిపివేశారు. ఈపరిణామాలు రాష్ట్ర ఆక్వారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు సమస్యలు వచ్చాయి. ఈ కారణంగా అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి సుంకాల నుంచి రొయ్యలను మినహాయింపు జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్చలుజరపాలి. సకాలంలో దీనిపై జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించడంవల్లఆక్వాపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడవచ్చు. అమెరికా సుంకాల కారణంగా తీవ్రభయాందోళన లు చెందుతున్న ఆక్వా రైతులు,ఎగుమతిదారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇతర మార్గాల ద్వారా ఆక్వారంగం కోలుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఆక్వా రంగంపై ఆధారపడ్డ ఏఒక్కరూ అధైర్యపడకుండా ప్రభు త్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అమెరికా అధినేత ట్రంప్ సుంకాలపై నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై పరిస్థితులను నిశితంగా సమీక్షిస్తోంది. ఆరోగ్యానికి రొయ్యల వల్ల కలిగే మేలు గురించి విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు ప్రతిఒక్కరూ రొయ్యల వినియోగం పెంచేలా చేస్తే ఎగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉంది. వైరస్ వంటి ఇబ్బందులు మరింత పెరగకుండా రొయ్యలు కొనుగోలు జరిగేలా చూడాలి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఆక్వారైతులు మళ్లీ కోలుకోలేరు. అమెరికా విధించిన సుంకం ఒక్క ఆక్వారంగంపైనే కాదని,అన్ని ఎగుమతులకు వర్తిస్తుంది. ఈ ఉపద్రవం నుంచి బయటపడే మార్గాలను ప్రభుత్వం కల్పించాలని పలువురు రైతులు కోరారు.ఆక్వాసాగులో 3 లక్షల మంది రైతులు నేరుగా,పరోక్షంగా మరో 50లక్షల మంది రైతులు ఆధారపడి ఉన్నారు. ఈ ఆకస్మికంగా ఆక్వారంగానికి వచ్చిన సమస్య అనూహ్యమైనది. దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలలో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోగలిగితే గట్టెక్కే పరిసితి ఉంది.



ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

సోక్రటీస్



ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణకువతో మెలగాలి.

ఎమర్సన్

# ప్రజావాక్కు



## చిన్న చిన్న కారణాలతో తిరస్కరణ

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేస్తున్న పదవీ విరమణ పొందిన వేల మంది ఉద్యోగులు అధిక పింఛనుకోసం దరఖాస్తు చేసినతర్వాత ఒక ఏడాదిన్నర పాటు పరిశీలనపేరిట ప్రాసెస్ పెట్టిన ఈ.పి.యఫ్.వో గత కొద్దిరోజుల నుండికారణమేమి తెలియ చేయకుండానే దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లుగా సమాచారమిస్తుంది.ఇది ఒక్కరి సమస్య కాదు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు పింఛనుదారులకి అధిక పింఛను ఇవ్వబోమని, కట్టిన సొమ్మును వెనక్కిఇస్తామని ఈ పి.యఫ్.వో అధికారులు తెలుపగా వెంటనే విషయం తెలుసుకున్న సి.యం. చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వారందరికీ న్యాయం జరిగేలా చేసారు. ఇదే తరహాలో చంద్రబాబు కేంద్రకార్మిక శాఖా మంత్రితో మాట్లాడి కేంద్ర, రాష్ట్రప్రభుత్వ రంగసంస్థల్లోని ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చూడాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఈ సేవ స్పెషల్ ఎంట్రీ టికెట్ల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అనేకరకాల సౌకర్యాలను అందిస్తుంది. దర్శనం,వసతిలాంటి వసతులు భక్తులకు ఎంతో ఉపయోగకరం. ఈస్పెషల్ ఎంట్రీదర్శనంటిక్కెట్లు కొన్ని నెలల ముందుగా స్లాట్ పద్ధతిలో తిరుమల తిరుపతి దేవస్థానం కేటాయిస్తుంది.సమస్యఇక్కడే మొదలవుతుంది. భక్తులకు ఈ దర్శనం టిక్కెట్లు లభ్యమైనప్పటికీ వసతి సౌకర్యం టిక్కెట్లు మాత్రం లభించవు. ఈ దర్శనం టిక్కెట్లు ఉన్న వారికి,తిరుమలలోవసతి ఎంతోఅవసరం.వసతి సౌకర్యం కల్పించలేనప్పుడు భక్తులు కోరితే వారి వారి ఈ-దర్శనం టిక్కెట్లు రద్దు చేసుకొనే అవకాశం కల్పించాలి.

-గోమఠం నరసింహాచార్యులు, ప్రకాశం జిల్లా

## సౌర పార్కులు ఏర్పాటు చేయాలి

దేశ అవసరాలనుతీర్చేరీతిలో సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలనిలక్ష్యంగా పెట్టుకున్న భారత ప్రభుత్వం అటు వైపుగా పంచామృత్ సూత్రంతో ముందుకు వెళుతోంది. సౌర పవనవిద్యుత్ ఉత్పత్తిద్వారా జార్ఖండ్ తెలంగాణ మధ్యప్రదేశ్ చత్తీస్‌గఢ్‌లాంటి బొగ్గుఉత్పత్తి చేసే రాష్ట్రాలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రాలలో పీపీపీ మోడ్‌లో సౌరపార్కులు,సౌరవిద్యుత్ ఉత్పత్తిక్లస్టర్లఫామ్ చేయాలి.

-భారత అవినాష్, జనగాం

## సుంకాల బాధలు భరించక తప్పదా?

అధికసుంకాలు, వీసాల గొడవలు, ఉద్యోగుల భయాందోళనలు ఇంకా యితర సమస్యల మీద అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలకు విసుగు చెంది లక్షలాది ప్రజలు ఆందోళనలకుదిగారు.ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ చేపట్టబోయే విధానాలమీద ప్రజలకు అనుమానం రాకపోలేదు. ఈయన మీద పోటీ చేసిన కమలా హారిస్ గెలుపు వాకిట వరకు వెళ్లి అపజయం పాలయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం ట్రంప్ మొదటిసారి ఎన్నికయినప్పుడు కూడా ప్రజలు శ్వేతసౌధం ముందు ఈయన ఒద్దు బాబోయ్ అని కేకలు వేసారు. కానీ ఏమీ కాలేదు కదా! ఇప్పుడు రెండవసారి ఆయన్నే ఎన్నుకున్నప్పుడు ఈ నాలుగు సంవత్సరాలు ఆయన్ను భరించవలసిందే. యూరోపియన్ దేశాలతోసహా బీద దేశాలు తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినా మొండి వానికి ఏమవుతుంది? పెరిగిన సుంకాల వల్ల భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులధరలు పెరుగుతాయంటున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మరమ్మతులు చేపట్టాలి

ఏపిలోని కొన్ని ప్రముఖ జిల్లాల్లో బడుల్లో పిల్లలకు మంచి నీరు అందించే వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల వాటి వినియోగానికి పనులు పెండింగ్ ఉన్నవి. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలు తెచ్చిన బాటిల్స్‌లో నీరు నింపుకునే సదుపాయం,బోరు మరమ్మతులు చేయిస్తే నీటికోసం పిల్లల ఎదురుచూపు ఉండదు. బడులు ప్రారంభానికి ముందుగానే వీటిని పరిష్కరిస్తే , తల్లితండ్రులు కూడా సంతోషించి ప్రభుత్వ ఉచిత పంపిణీలను ఉపయోగించి ప్రభుత్వ బడుల్లో కచ్చితంగా చేర్పించగలరు.

-బొల్లోజు మేఘనాధ్, విశాఖపట్నం

## డిప్యూటేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగుల ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో సౌకర్యంగా ఉంటే అదే ప్రాంతంలో ఉంచాలి. ట్రాన్స్‌ఫర్, డిప్యూటేషన్ నుండి ఉద్యోగ వికలాంగులకు మినాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతంలో గదులు అద్దెకు తీసుకుని పిల్లల సంరక్షణలో స్కూల్‌లో జాయిన్‌అయిన తర్వాతవారిని ఇతర ప్రాంతాలకు మార్చడం చాలా ఇబ్బంది అవుతుంది. ప్రయాణానికి అనుకూలంగా ఉండే ప్రాంతంలో ఉంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆకాశమే హద్దుగా.. ఏవియేషన్ హబ్

**శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈ కొత్త ఎయిర్‌పోర్టుల రాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్‌హబ్‌గా మారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్‌దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాలనుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది. అభివృద్ధి మొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది. ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాలలో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి.**



బొర్రెడ్డి అయోధ్యరెడ్డి

నిన్నటివరకు విమాన ప్రయాణం అంటే ధనవంతులకే పరిమితమై ఉండేది. ఇక రోజులు మారాయి, మధ్యతరగతి వారికి విమాన ప్రయాణం అంటే బస్సులలో ప్రయాణించినంత అవలీలగా పరిమాణం చెందింది. విదేశాలకు వెళ్లాలంటే తప్పనిసరై విమానాలు ఎక్కేవారు. అభివృద్ధి చెందిన నేటి పరిస్థితుల్లో పక్కరాష్ట్రానికి వెళ్లాలన్నా,సమయం ఆదా కోసం విమానాల్లో ప్రయాణం చేస్తున్నారు. గతంలో పారిశ్రామికవేత్తలే ఎక్కువగా విమానాలలో ప్రయాణించేవారు. కానీ నేడు విదేశాలకు విద్యను అభ్యసించడానికి వెళ్లే విద్యార్థులు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారు విమానాల్లో ప్రయాణించటం ఎక్కువైపోయింది. హైదరాబాద్లో శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభించినప్పుడు నష్టాలలో నడిచింది. ఈరోజు అక్కడ విమానాల రాకపోకలకు రన్వేలు సరిపోక, వాటిని విస్తరించాల్సి వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో బస్టాండ్ల మాదిరిగా కిటకిటలాడుతున్నాయి. ఎంతగా అంటే ప్రయాణికులకు వీడ్కోలు చెప్పడానికి నాలుగురైదురికిమించి విమానాశ్రయానికి రావొద్దని ఎయిర్‌పోర్టు సిబ్బంది వేడుకోవాల్సి వస్తోంది. అమెరికాలో కళాశాలలు ప్రారంభమయ్యే ఆగస్టు నెలలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. మెట్రో నగరాల విషయంలో ప్రయాణికుల సంఖ్యలో శంషాబాద్ విమానాశ్రయం దూసుకెళ్తుంది. విమాన సర్వీసుల పెరుగుదల అంశంలో హైదరాబాద్ 16.2శాతంతో ప్రథమస్థానంలో ఉండగా, చెన్నై 13.8 శాతం, బెంగళూరు 10.4శాతం, ఢిల్లీ 7.9శాతంతో పురోగతి కనిపించింది. శంషాబాద్ విమానాశ్రయంలో రోజువారీ ప్రయాణీకుల సంఖ్య లక్ష దాటే రోజు మరెంతో దూరంలో లేదు. గత ఫిబ్రవరి 21న రికార్డు స్థాయిలో ఇక్కడి నుంచి 96వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారంటే విమాన ప్రయాణాలకు మన రాష్ట్రంలో ఎంత డిమాండ్ ఉన్నదో చూడవచ్చు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సైతం ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు కేంద్రంపై ఒత్తిడి పెంచింది. దీనితో రాష్ట్రంలో కొత్తగా కేంద్రం రెండు కొత్త ఎయిర్‌పోర్టులను మంజూరు చేసింది. ఇంకో రెండు ఎయిర్‌పోర్టులు పరిశీలనలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామికంగా, పర్యాటకంగా రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడపడం కోసం అనేక ప్రణాళికలు రూపొందించింది. పర్యాటకులు రాష్ట్రానికి మరింతమంది రావాలన్నా, పారిశ్రామికవేత్తలు రాకపోకలకు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. మన రాష్ట్రంలో ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒక్కటే ప్రయాణికులకు అందుబాటులో ఉన్నది. బేగంపేటలో ఉన్న పాత విమానాశ్రయం నుంచి ప్రైవేట్ విమానాలు మాత్రమే నడుస్తున్నాయి.దుండిగల్లో ఉన్న ఎయిర్‌పోర్టు ఎయిర్‌ఫోర్స్‌కు సేవలందిస్తోంది. దీనినిదృష్టిలో పెట్టుకొని జిల్లాలకు సైతం విమానాశ్రయాలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడితెచ్చి కొత్త విమానాశ్రయాల ఏర్పాటు కు అనుమతులు సాధించారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా మామునూరు వద్ద కొత్త బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌర విమానయానశాఖ పచ్చజెండా ఊపింది. 1930లో నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ మామునూరు వద్ద ఎయిర్పోర్టును ప్రారంభించగా, అది 1981 వరకు సేవలందించింది. కాగజ్నగర్లో ఉన్న పేపర్ పరిశ్రమ, వరంగల్‌లోని ఆజాం జాహిమిల్స్



ప్రయోజనాల కోసం అప్పట్లో దీన్ని నిర్మించారు. ఈ పరిశ్రమలు మూత పడటంతో ఈ ఎయిర్‌పోర్టు కూడా మూతపడిపోయింది. గత పదేళ్లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై శ్రద్ధ చూపించలేదు. తూతూ మంత్రంగా కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించటంతో ఈ ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నవిధంగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలను, బేషజాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్రంతో సత్సంబంధాలు నెల కొల్పుకొని ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక ప్రాజెక్టులు సాధించారు. ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను పదేపదే కలిసి రాష్ట్రానికి రావాల్సిన జాతీయ రహదారులను సాధించారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న రోడ్ల వెడల్పుకు కంటోన్మెంట్ భూములు అవసరం కాగా, వాటిని సాధించారు.ఇప్పుడు కొత్తగా నాలుగు ఎయిర్ పోర్టులను సాధించటం కోసం తీవ్ర ప్రయత్నంచేశారు. దీనితో వరంగల్లోని మామునూర్ ఎయిర్‌పోర్టు,ఆదిలాబాద్లో ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతించింది. ఆదిలాబాద్లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ రానున్న రోజుల్లో శిక్షణా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ఐఏఎఫ్ వెల్లడించింది. వీటితో పాటు భద్రాద్రి కొత్త గూడెంలో ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని పౌర విమానయాన మంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో కూడా రామగుండం ఎయిర్‌పోర్టును నిర్మించా లని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. పౌరవిమానయాన రంగంపై చేసే ఖర్చువలన ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయి. వేలసంఖ్యలో ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పౌర విమానయానం ప్రత్యక్షంగా1.13కోట్ల ఉద్యోగాలను, పరోక్షంగా మరో8.3కోట్ల ఉద్యోగాలను సృష్టి స్తున్నది. 58శాతం అంతర్జాతీయ టూరిస్టులు విమానాల్లోనే పర్యటిస్తున్నారు. మనదేశంలో విమానాల తయారీ, నిర్వహణ, మరమ్మత్తులు చేసేవిభాగాలలో 2.5లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. వచ్చేమూడేళ్లలో వైమానిక రంగంలో ఉపాధి అవకాశాలు 40శాతం పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రతి విమానానికి 100నుంచి 150మందిసిబ్బంది కావాలి.కాబట్టి ఈ విమానయానరంగంలో ఉపాధి అవకాశాలు ఎంతఎక్కువగా వుంటాయో తెలుసుకోవచ్చు. మనదేశంలో 17 అంతర్జాతీయవిమానాశ్రయాలు మొత్తం159. వీటిసంఖ్య 2030కల్లా 200 దాటే అవకాశం ఉంది. మన దేశంలో 2023లో 15.3కోట్ల మంది విమానాల్లో ప్రయాణించగా, 2030నాటికి ఈసంఖ్య 30కోట్లకు పెరిగే అవకాశముంది. ప్రతిఏటా హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో వైమానిక ప్రదర్శన నిర్వహిస్తారు.ఇక్కడ నిర్వహించే ఎయిర్‌పోర్టుకు ప్రపంచవ్యాప్తంగా అనేక విమానయాన సంస్థలు తరలివస్తాయి. ఎయిర్ అంబులెన్స్లు, హెలికాప్టర్లు, విభిన్నమైన డ్రోన్లు ఈ ప్రదర్శనల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.ఈ ప్రదర్శనకు వందల మంది వివిధ దేశాలకు చెందిన ఎయిరోస్పేస్ ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలు,పైలట్లు, ట్రైనీ పైలట్లు హాజరవుతారు. కొన్నేళ్ల నుంచి మనదేశ విమానయాన రంగంఏటా10నుంచి 15శాతంవృద్ధిని సాధిస్తోంది. ఈ దశాబ్దంలో దేశీయ ప్రయాణికుల సంఖ్య ఏటా 15 శాతం,అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 6.1శాతం చొప్పున పెరిగింది. గత 15ఏళ్లలో విమానాల ద్వారా సరుకురవాణా దేశీయంగా 60శాతం, అంతర్జాతీయంగా 53శాతం వృద్ధిసాధించింది. ఇదేవిధంగా ఆధునిక వైద్య సేవలకు,ఎయిర్ మెడికల్ సౌలభ్యాలకు మనం చొరవ చూపుతున్నాం. ఇదేగాక, హైదరాబాద్లో జీఎంఆర్ గ్రూప్ ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ను గత ఏడాది జనవరిలో ప్రారంభించారు. శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిరోస్పేస్ అండ్ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటైన ఈ స్కూల్ నాలుగేళ్ల ఎయిర్ క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజినీరింగ్ కోర్సును అందజేస్తుంది. ఈకొత్త ఎయిర్‌పోర్టులరాకతో వేలమంది యువతకు ఉద్యోగఅవకాశాలు వస్తాయి. రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్యమరింత పెరిగే అవకాశం ఉంది. భవిష్యత్తులో తెలంగాణ ఏవియేషన్ హబ్‌గామారే అవకాశం ఉంది. దీనితో ఎయిరోస్పేస్ తయారీ రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలు లభించే అవకాశాలు లభిస్తాయి. జిల్లాల్లో ఉన్న ప్రజలు విదేశాలకు వెళ్లాలంటే హైదరాబాద్ దాకా రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల నుంచే తేలికగా విమానాలలో ప్రయాణించటానికి అవకాశం కలుగుతుంది.అభివృద్ధిమొత్తం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు సైతం విస్తరించే అవకాశం ఉంది.ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల లో విపరీతంగా అభివృద్ధి జరుగుతుంది. ఆయాప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కూడా కొత్తగా అవకాశాలు కలుగుతాయి. ●

# కలిసికట్టుగా పోరాడితేనే ప్రయోజనం!


ఫిరోజ్ ఖాన్

సంఖ్యాబలంతో లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు 2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జెడియూ, తెలుగుదేశం పార్టీ వంటి మిత్రపక్షాల సహకారంతో భారతీయ జనతాపార్టీ రెండు సభల్లోనూ బిల్ పాస్‌అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నది.ఆతర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితేవక్ఫ్‌బిల్లు విషయంలో దూకుడుగావెళ్లిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశముంది. ఎన్డీఏ, ఇండియా ఏ కూటమిలో ఉన్నా సౌత్ స్టేట్స్ కలిసికట్టుగా పోరాడకపోతే దక్షిణాది రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు తీరనినష్టం జరిగే ప్రమాదముంది. జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే ఎంపీ స్థానాలసంఖ్య 800నుంచి 1000 వరకు పెరగొచ్చు. అయితే ఈ ప్రక్రియలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో లాభపడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదమున్నది. దీంతో భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువలేకుండాపోతుంది. 1951-52లో దేశ జనాభా 36కోట్లు. అప్పుడు లోక్‌సభ సీట్లు489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశజనాభా 54 కోట్లు. అప్పుడు సీట్లసంఖ్యను 545కు పెంచారు.1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో ఎమర్జెన్సీ సమయంలో లోక్‌సభ సీట్ల సంఖ్యకు మరో 25ఏళ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా అప్పట్లో ప్రధానిగా ఉన్నా వాజ్‌పేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు.లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పునర్ వ్యవస్థీకరణ చేశారు. కొన్ని జనరల్ స్థానాలను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించి వారి ప్రాతినిధ్యం పెంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యపెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలనుపునర్విభజించాలని భావిస్తున్నది. ప్రస్తుతం 2011సెన్సెస్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కరోనా కారణంగా 2021 జనగణనను వాయిదా వేశారు. కేంద్ర ప్రభుత్వం 2025లో జనగణన చేస్తుందనే ప్రచారం సైతం జరుగుతున్నది. జనగణనకు ఇంకా ఏడాది సమయం ఉన్నందున, 2021లో చేపట్టాల్సిన జనగణనను పూర్తిచేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం సీట్లసంఖ్య 80. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 160కిపైగా పెరిగే అవకాశముంది.ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 14.7శాతం నుంచి 16శాతానికి పెరుగుతుంది. రాజస్థాన్‌లో ప్రస్తుతం 25ఎంపీ సీట్లుండగా, అవికూడా 52కి పెరుగుతాయని అంచనా. ఇక్కడ కూడా సీట్లురెట్టింపు అవుతున్నాయి. అలాగే బీహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు కూడా గణనీయస్థాయిలో పెరిగే అవకాశాలున్నాయి. 1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 కాగా, ఇందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్లసంఖ్య 522కి కాగా, దక్షిణాది వాదా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్లసంఖ్య 545కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే ప్రస్తుతం డీలిమిటేషన్‌తో తెలంగాణ లోక్‌సభ సీట్ల సంఖ్య 17 నుంచి 39కి పెరిగే అవకాశముంది. అంటే పెరుగుదల 48 శాతం మాత్రమే. దీని ద్వారా పార్లమెంటులో తెలంగాణ ప్రాతినిధ్యం 3.1 శాతం నుంచి 3.3శాతానికి చేరుకుంటుంది. అదే ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే సీట్ల సంఖ్య 25నుంచి 52కు పెరుగుతుండగా, ఏపీవాటా మాత్రం 4.6శాతం నుంచి 4.3శాతానికి పడిపోతుంది. తమిళనాడులో 28శాతం సీట్లు పెరుగనుండగా కేరళలో కేవలం ఒక్కశాతం మాత్రమే సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇలా అయితే పార్లమెంటులో తమిళనాడు ప్రాతినిధ్యం 7.2 శాతం నుంచి 6.4శాతానికి, కేరళ ప్రాతినిధ్యం 3.7 శాతం నుంచి 2.9 శాతానికి పడిపోతుంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటగలిగిన పార్టీలు దేశంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులు కోల్పోయే ప్రమాదముంది. ●

# అంతర్జాతీయ వాణిజ్యంపై ట్రంప్ సుంకం!

తోట యోగేందర్

గత కొంతకాలంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇతర దేశాల నుండి అమెరికా దేశంలోకి దిగుమతి అయ్యే వస్తువులపై పన్నులను ఎడాపెడా పెంచారు. భారత్‌పై 26 శాతం,చైనాపై 34 శాతం వరకు దిగుమతి సుంకాన్ని పెంచారు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో చేసిన ప్రసంగంలో, చైనా, భారతదేశం,యూరోపియన్ యూనియన్ వంటి కొన్ని వాణిజ్య భాగస్వాములకు అమెరికా నుంచి దిగుమతి రేట్లు 50 శాతం వరకు చేరుకోవడంతో, తమ దేశంలోకి జరిగే అన్ని దిగుమతులపై యునైటెడ్ స్టేట్స్ 10శాతం సుంకాన్ని విధిస్తుందని ట్రంప్ ప్రకటించారు. ఈ విధానం ట్రంప్'పరస్పర' వాణిజ్య వ్యూహానికి ప్రతిబింబంగా పరిగణించబడుతుంది. దీనిలో ఇతరదేశాలు వస్తువులపై విధించిన సుంకాలు వాణిజ్య అడ్డంకులకు ప్రతీకారంగా యునైటెడ్ స్టేట్స్ సుంకాలను వర్తింపజేస్తుంది. ఈ చర్య వాణిజ్య సంబంధాలను తిరిగి సమతుల్యం చేయడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దాని అమలు దేశీయంగా ప్రపంచవ్యాప్తంగా అనేకసమస్యలు సృష్టించే అవకాశంఉంది. ముఖ్యంగా, అమెరికా వస్తువులపై సుంకాలు విధించే లేదా అమెరికాకు వ్యతిరేకంగా వాణిజ్యపద్ధతుల్లో పాల్గొనే దేశాలపై యునైటెడ్ స్టేట్స్ ప్రతీకారం తీర్చుకుంటుంది.చైనా లేదా యూరోపియన్ యూనియన్ వంటి దేశం అమెరికన్ వస్తువులపై 20శాతం సుంకాన్ని వసూలు చేస్తే, ఆ దేశం నుండి వచ్చే వస్తువులపై ప్రతిఫలంగా 20శాతం సుంకాన్ని వర్తింపజేస్తుంది. ఈవిధానం వాణిజ్య అసమతుల్యతలను సరిచేస్తుందని, అమెరికా అధ్యక్షుడి భావన. కరెన్సీ మానిప్యులేషన్, కోటాలు, రాయితీలు వంటి నాన్‌టారిఫ్ అడ్డంకులు వంటి హానికరమైన వాణిజ్య పద్ధతులుగా తాను భావించే వాటికి ఈసుంకాలు ప్రతిస్పందన అనిట్రంప్ తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. ఇతర దేశాల 'అన్యాయమైన' పద్ధతుల కారణంగా అమెరికన్ పరిశ్రమలు తయారీదారులు చాలా కాలంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. దానికి ప్రతిగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ టారిఫ్‌ల అమలు ఈ నెల మొదటివారిలో ప్రారంభమైంది. ఇది అనేక తక్షణ ఆర్థిక ప్రభావాలను కలిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ సుంకాలు తప్పనిసరిగా దిగుమతి చేసుకున్న వస్తువుల ధరకు జోడించబడే పన్నులు. ఈ అదనపు ఖర్చులు తరచుగా వినియోగదారులకు బదిలీ చేయబడతాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు, ఎలక్ట్రానిక్



వస్తువుల నుంచి దుస్తులు, ఆహార ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. అయితే ఇటువంటి సుంకాల చర్యలు ద్రవ్యోల్బణానికి దారితీస్తాయని, అమెరికన్ల జీవన వ్యయం పెరుగుతుందని పలువురు ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశీ పోటీని తగ్గించడం వల్ల దేశీయ ఉత్పత్తి పెరగవచ్చు. కాబట్టి తయారీ రంగం స్వల్పకాలిక ప్రయోజనాలను అనుభవించవచ్చు.అయితే, దీర్ఘకాలంలో మొత్తం ఆర్థిక ప్రభావం అంత అనుకూలంగా ఉండకపోవచ్చునని ఆర్థికవేత్తలభావన. వినియోగదారులు ధరల పెంపుదల భారాన్ని అనుభవించే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలు,ముఖ్యంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో చాలా కష్టపడవచ్చు అని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ టారిఫ్‌లు వినియోగదారుల వ్యయం తగ్గడానికి దారితీస్తాయని మరి కొందరి అభిప్రాయం. ఎందుకంటే పెరుగుతున్న ధరల కారణంగా కుటుంబాలు తక్కువ ఖర్చు చేసే ఆదాయాన్ని కలిగి ఉంటాయి. ఇది ఆర్థిక వృద్ధికి ఉపాధి అవకాశాలకు హాని కలిగించవచ్చు. ఇంకా ఇతర దేశాలు అమెరికా ఎగుమతులపై తమ సొంత సుంకాలను విధించడం ద్వారాపై ప్రతీకారం తీర్చుకోవడంతో వాణిజ్య యుద్ధం తీవ్రమవుతుంది. ఇది వ్యవసాయం, ఆటోమొబైల్స్ సాంకేతికత వంటి పరిశ్రమలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనీ ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. టారిఫ్ విధానంతో ముడిపడి ఉన్న అతిపెద్ద ప్రమాదాలలో ఒకటి ప్రపంచ వాణిజ్య సంబంధాలలో ఉద్రిక్తతలను పెంచేఅవకాశం. ఈ టారిఫ్‌లను విధించడం వాణిజ్యానికి న్యాయాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విశ్వసిస్తుండగా, ఇతర దేశాలు, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్, చైనా, భారతదేశం ఈ చర్యను ప్రతికూలంగా భావించి తదనుగుణంగా ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉంది. ఆధునిక ప్రపంచం ఆర్థిక పరస్పర అనుసంధానం అంటే సుంకాల వంటి వాణిజ్య అడ్డంకులు అలల ప్రభావాలను కలిగి ఉంటాయి. యూరోపియన్ యూనియన్ నుండి దిగుమతి చేసుకున్న వస్తువులపై 20శాతం సుంకం కేవలం వినియోగదారులపైనే కాకుండా, అమెరికన్ ఎగుమతులపై ఆధారపడే యూరోపియన్ వ్యాపారాలపై కూడా ప్రభావం చూపుతుంది. అదేవిధంగా, ప్రపంచంలోని అతిపెద్ద ఎగుమతిదారులలో ఒకటైన చైనా, వస్తువులపై దాని స్వంత సుంకాలను వర్తింపజేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవచ్చు, ఈ విధంగా ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తుంది.రెండు ఆర్థిక వ్యవస్థలకు హానికలిగించే వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చు. ఈ విధానాల వల్ల ప్రపంచ మార్కెట్లు అనేక ప్రతి కూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ●

# వేగంగా వాహనం నడిపినా వీసా రద్దు..

## అమెరికాలో విద్యార్థులకు కొత్త ఆందోళన?




**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అర్థంకాని పరిస్థితుల్లో అమెరికాలోని విదేశీ విద్యార్థులు వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓ కథనం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడి నోటీసులు అందుకున్నా సరే వీసా రద్దు వంటి కఠిన శిక్ష ఎదురవుతున్నట్లు ఈ కథనం పేర్కొంది. భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పలు అమెరికా కళాశాలలు పేర్కొన్నారు. వారిలో చాలామందికి క్యాంపస్‌లలో జరుగుతోన్న అనుకూల ఆందోళనలతో ఎలాంటి సంబంధం లేదు. అయినప్పటికీ గతంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారనే కారణం చూపించి వీసాలను రద్దు చేసినట్లు ఆ మీడియా కథనం వెల్లడించింది. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ సహా పలు ప్రముఖ విశ్వవిద్యాలయ అధికారులు ఈ ఆకస్మిక వీసా రద్దుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ డేటాబేస్‌ను చూసిన తర్వాత ఆ విషయం తమకు తెలిసిందన్నారు. వీసా రద్దుకు సంబంధించిన కారణాలు కూడా ప్రభుత్వం పేర్కొనడం లేదని చెప్పారు. ప్రభావిత విద్యార్థుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో గాజా సంబంధిత అంశాలపై మద్దతు తెలిపినందుకు మరికొందరికి స్టూడెంట్ వీసాలు రద్దయ్యాయి. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై అమెరికా నిఘా పెట్టినట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన నాటి నుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు పోస్టులు చేశారు. ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి ఎఐతో స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయని ఆ నివేదిక పేర్కొంది. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలని ఈ మెయిల్స్ పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే యాక్సియోస్ నివేదిక, తాజా కథనం వెలువడటం చర్చనీయాంశంగా మారింది.



# బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా.. అందుకే దేవుడు బతికించాడు

## మాజీ ప్రధాని షేక్ హసీనా

**ఢాకా, ఏప్రిల్ 8:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా మళ్లీ దేశానికి తిరిగి రానున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలతో జరిగిన సంభాషణ సందర్భంగా హసీనా హామీ ఇచ్చారు. బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఏదో ఒకకారణం వల్లే ఆ దేవుడు నన్ను ఇంకాబతికించాడు. అవామీ లీగ్ పార్టీ సభ్యులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుంది. తప్ప కుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉం చండి. నేను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాను' అని షేక్ హసీనా భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ యూనస్‌పై మండి పడ్డారు. 'యూనస్‌కు ప్రజలంటే ప్రేమ లేదు. అధిక వడ్డీకి రుణాలుఇచ్చి ఆయన విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపి వచ్చారు. ఆ సమయంలో ఆయన తీరును అర్థం చేసుకోలేక పోయాం. అతడికి దేశం ఎంతో సహాయం చేసింది' అని అన్నారు.

**బంగ్లాలో ఎన్నో నేరాలు:** 'యూనస్ వల్ల దేశ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అతడికి అధికారంపై వ్యామోహం మాత్రమే ఉంది. వారి సారథ్యంలో బంగ్లా ప్రస్తుతం ఉగ్రవాద దేశంగా మారింది. మన నాయకులు, కార్యకర్తలను దారుణంగా హత్య చేశారు. పోలీసులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కళాకారులు ఇలా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్నో అత్యాచారాలు, హత్యలు, దొంగతనాలు జరుగుతున్నాయి. కానీ, మీడియాకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటారనే భయంతో ఈ నేరాలు బయటకు రావడం లేదు' అని తాత్కాలిక ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.

**వారికి శిక్ష తప్పదు:** తన తండ్రి బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబర్ రెహమాన్ సహా తన కుటుంబం మొత్తం హత్యలకు గురైన సంఘటనలను షేక్ హసీనా గుర్తు చేసుకున్నారు. 'ఒక్క రోజులోనే నా తండ్రి, తల్లి, సోదరుడిని కోల్పోయాను. నాడు వారు మమ్మల్ని దేశంలోకి రానివ్వలేదు. మీ సొంత వారిని కోల్పోయి ఇప్పుడు మీరంతా అనుభవిస్తున్న బాధను నేను అర్థం చేసుకోగలను. నా ద్వారా మీ అందరికీ మంచి చేయాలని ఆ భగవంతుడు కోరుకుం టున్నాడేమో. అందుకే నన్ను ఇంకా రక్షిస్తున్నాడు. నేను తిరిగి వచ్చాక అన్యాయం చేసిన వారందరికీ కఠిన శిక్ష అమలు చేస్తా' అని హసీనా ప్రతిన బూనారు.

# అమెరికాతో వాణిజ్య యుద్ధానికి చైనా మార్కెట్లు రెడీ?



**బీజింగ్, ఏప్రిల్ 8:** నానాటికీ వాణిజ్య యుద్ధం ముదురుతుండడంతో అమెరికాతో అమీతుమీ తేల్చుకొనేందుకు చైనా మార్కెట్లు, నియంత్రణ సంస్థలు సన్నాహాలు మొదలుపెట్టాయి. తాజాగా ఆ దేశానికి చెందిన ఎన్ఎఫ్ఆర్ఎ (నేషనల్ ఫైనాన్షియల్ రెగ్యులేటరీ అడ్మినిస్ట్రేషన్), పీపుల్ బ్యాంక్ ఆఫ్ చైనా (పిబిసి), ప్రభుత్వ రంగంలోని ప్రధాన పెట్టుబడి సంస్థలు మంగళవారం ఉదయం కీలక నిర్ణయం తీసుకొన్నట్లు గ్లోబల్ టైమ్స్ పత్రిక పేర్కొంది. దేశంలోని క్యాపిటల్ మార్కెట్‌కు బలమైన మద్దతు ఇవ్వనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎన్ఎఫ్ఆర్ఎ బీమా ఫండ్స్ ఈక్విటీ పెట్టుబడులపై ఓ నోటీసు జారీ చేసింది. దీని ప్రకారం ఆ ఫండ్స్ మరింత మొత్తాలను స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లభించింది. దీంతో వాస్తవిక ఆర్థిక వ్యవస్థకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి. దేశంలోకి ఇటీవల అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక సంస్థల్లో పెట్టుబడులను ఇవి ప్రోత్సహిస్తాయని భావిస్తున్నారు. మరోవైపు పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా కూడా స్టాక్ మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటుకు అవసరమైన సొమ్మును ది సెంట్రల్ హుయ్‌జిన్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్‌కు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ చైనా ప్రధాన భూభాగంలోని కంపెనీల షేర్లను కొనుగోలు చేయనుంది. ఈ విషయాన్ని మంగళవారం పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా ప్రకటించింది.

**ట్రంప్..తప్పు మీద తప్పు చేస్తున్నావ్ : బీజింగ్ హెచ్చరిక:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పు మీద తప్పు చేస్తున్నారని చైనా విమర్శించింది. ఆయన ప్రపంచ వాణిజ్య యుద్ధంలో అవకాశాలు వెతుక్కొంటున్నారని అభిప్రాయపడింది. చైనా ప్రభుత్వం అమెరికా వస్తువులపై విధించిన సుంకాల ఉపసంహరణకు ట్రంప్ 48 గంటల డెడ్‌లైన్ విధించిన నేపథ్యం లో చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 'మాపై టారిఫ్‌లు పెంచుతామని అమెరికా బెదరించడం తప్పు మీద తప్పు. ఇది అమెరికా బ్లాక్‌మెయిల్ విధానాలను మరోసారి బహిర్గతం చేసింది. చైనా వీటిని ఏమాత్రం పట్టించుకోదు. తన దారికి రావాలని అమెరికా పట్టుబడితే చివరి వరకు పోరాడుతుంది. అమెరికా ఏకపక్షంగా విధించిన అన్ని పన్నులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. చైనా సార్వభౌమత్వం, అభివృద్ధి ప్రయోజనాలు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతిఘటన చర్యలు తీసుకుంటాం. ఇందుకు మాకు పూర్తి హక్కుంది' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భగ్గుమన్నారు. ఏప్రిల్ 9 నుంచే 50 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఆ దేశంతో చర్చలు కూడా నిలిపివేస్తామని తేల్చి చెప్పారు.



# మా భూభాగంలోకి కిమ్‌జోంగ్ సైన్యం చొరబాటు: దక్షిణ కొరియా ఆరోపణ

**సియోల్, ఏప్రిల్ 8:** ఉత్తర కొరియా సైన్యంపై హెచ్చరికల కాల్పులు జరిపినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. సరిహద్దులోని తూర్పు భూభాగంలో కిమ్ సైన్యం ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించింది. ఈ క్రమంలో హెచ్చరికలు చేయడంతో పాటు వార్నింగ్ షాట్‌లు ఇచ్చామని దాంతో 10 మంది కిమ్ సైనికులు తిరిగి వారి భూభాగంలోకి వెళ్లిపోయారని తెలిపింది. ఉత్తరకొరియా కార్యకలాపాలను నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించింది. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉన్న సైనికరహిత ప్రాంతంలో ఉల్లంఘనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. గతజూన్‌లోనూ కిమ్ సైన్యం సరిహద్దుఉల్లంఘనకు పాల్పడింది. అయితే, శత్రుసైన్యం ఉద్దేశపూర్వకంగా చొరబడలేదని దక్షిణ కొరియా అధికారులు ధ్రువీకరించడంతో ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ఇక తాజా చొరబాటు వెనుక ఉద్దేశంపై మాత్రం స్పష్టత రాలేదు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సాయం చేస్తున్న ఉత్తర కొరియా అటు అణ్వాయుధ ప్రయోగాలను ముమ్మరంగా కొనసాగిస్తూనే ఉంది. అణు నిరాయుధీకరణ చర్చలను పునఃప్రారంభించాలని అమెరికా, దక్షిణ కొరియాలు పిలుపునిస్తున్నప్పటికీ కిమ్ మాత్రం వాటిని పెడచెవిన పెడుతున్నట్లు కనిపిస్తోంది. కిమ్ తనకు మిత్రుడని, దౌత్య సంబంధాలు మెరుగుపరిచేందుకు ఆయనతో భేటీ కావడానికి సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నప్పటికీ ఉత్తర కొరియా నుంచి ఎటువంటి స్పందన లేదు.

# టిఎంసిలో రచ్చకెక్కిన విభేదాలు: మమతకు తలపోటు తెస్తున్న నేతలు!



**కోల్‌కతా, ఏప్రిల్ 8:** తృణమూల్ కాంగ్రెస్‌లోని అంతర్గతపోరు రచ్చకెక్కింది. లీకైన విడియోలు వాట్సాప్‌చాట్‌లను బిజెపి షేర్‌చేయడంతో నేతలమధ్య ఘర్షణ బయటకు వచ్చింది. కమలం పార్టీ ఐటి సెల్ ఇన్‌ఛార్జి అమిత్‌మాలవీయ వాటిని షేర్‌చేసారు. ఎన్నికలసంఘం కేంద్ర కార్యాలయం వద్ద సీనియర్ ఎంపి కల్యాణ్ బెనర్జీ, మరో ఎంపిమధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మాలవీయ పేర్కొన్న దాని ప్రకారం ఒక ప్రజంటేషన్‌ను ఇవ్వడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిదుల బృందం ఈసీ కార్యాలయానికి వెళ్లింది. ఈసీ ఆఫస్‌కు వెళ్లడానికిముందు వినతి పత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని పార్టీ ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ ఎంపి సమావేశానికి రాకుండానేరుగా ఈసీ వద్దకువెళ్లారు. ఇది ఇద్దరు ఎంపిలమధ్య గొడవకు దారితీసింది. ఆ ఘర్షణను ఆపేందుకు పోలీసులు జోక్యంచేసుకోవాలని పిలిచేవరకూ వెళ్లింది. బిజెపి షేర్ చేసిన విడియోలో కల్యాణ్‌బెనర్జీ మరో ఎంపిపై ఆగ్రహంతో ఊగిపోతున్నట్లుగా ఉంది. ఇదంతా పబ్లిక్‌ప్లేస్ కాసనత సంయమనం పాటించండి అని అక్కడున్న టిఎంసి నేత డెరెక్ ఓబ్రెయిన్ సర్దిచెప్పే ప్రయత్నంచేసినా ఫలితం లేకపోయింది. ఆతర్వాత ఎంపిలు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసారు. ఇక మాలవీయ షేర్‌చేసిన చాట్ ప్రకారం ఎఐటిసి ఎంపి 2024 పేరిట ఉన్న వాట్సప్‌గ్రూప్‌లో కల్యాణ్ బెనర్జీ కీర్తి ఆజాద్ మధ్య వాగ్వాదం నడిచింది. వారి చాటింగ్‌లో ఒక మహిల ప్రస్తావన కూడా వచ్చింది. సీనియర్ ఎంపి ప్రవర్తన కారణంగా పార్లమెంటు మహిళా సభ్యురాలు ఆగ్రూప్‌నుంచి ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై టిఎంసినేత సౌగతారాయ్ స్పందించారు. ఇలాంటివి జరిగి ఉండాల్సింది కాదు.ప్రతిపార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలి. ఈ గొడవ జరిగినపుడు నేను అక్కడ లేను. కానీ మహువా కన్నీళ్లుపెట్టుకోవడంచూసాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అని రాయ్ తెలిపారు. కల్యాణ్‌తో జరిగిన వాగ్వాదంలో ఉన్న మరో ఎంపి మహువా మొయిత్రా అని తేలింది. ఈ మొత్తం ఎపిసోడ్ ఈ లీక్స్‌పై టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా కలతచెందారని వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయద్దని నేతలకు ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే వాట్స్‌చాట్‌లలోపేర్కొన్న మహిళ ఎవరో తెలియాల్సి ఉందని మాలవీయ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే వక్ఫ్‌బిల్లుపై గతంలో జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా కల్యాణ్ నిగ్రహాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే.ఆయనకు బిజెపి ఎంపి అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం జరగ్గా తీవ్రఆగ్రహానికి గురైన టిఎంసిఎంపి పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీనితో ఆయన చేతికి గాయం కూడా అయింది.

# మీరట్ హత్యకేసులో నిందితురాలు గర్భవతి

## నిర్ధారించిన మీరట్ ఆసుపత్రి వైద్యులు



**మీరట్, ఏప్రిల్ 8:** మర్చంట్‌నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్యకేసులో నిందితురాలు ఆతడి భార్య ముస్కాన్ రస్తోగి గర్భం దాల్చినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీనిపై బాధిత కుటుంబం స్పందించింది. ఒకవేళ ఆ బిడ్డ సౌరభ్‌కు చెం దినది అయితే దత్తత తీసుకుంటామని వెల్ల డించారు. ఆమె గర్భం దాల్చిన సంగతి మాకు తెలిసింది. ఒక వేళ బయోలాజికల్‌గా కడుపులోని బిడ్డ మా సోదరుడికి చెందిందే అయితే పుట్టినతర్వాత దత్తత తీసుకునేందుకు మా కుటుంబం సిద్ధంగా ఉందని అన్నారు. ఆ బిడ్డను పెంచుకునేందుకు మా అందరికీ ఇష్టమే అని సౌరభ్ సోదరుడు మీడియాకు తెలిపాడు. కాగా ప్రేమించి పెళ్లాడిన భర్తను ప్రియుడి సాయంతో కట్టుకున్న భార్యే దారుణంగా హత్యచేసి ముక్కలు చేసిన ఘటన సంచలనం కలిగించింది. ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్న నిందితురాలు ముస్కాన్‌కు ఇటీవల వైద్యపరీక్షలు నిర్వహిస్తే ఆమె గర్భం దాల్చినట్లు తేలింది. సిఎంఓ డాక్టర్ అశోక్ కటారియా స్వయంగా వెల్లడించారు. గర్భం దాల్చిన సంగతి నిందితురాలికి తెలిపారా అన్న ప్రశ్నపై ఫలితాలు వచ్చిన సమయంలో ఈ విషయాన్ని ఆమెకు తెలియజేసారని అనుకుంటున్నా. కానీ అల్ట్రాసౌండ్ రిపోర్టు వచ్చిన తర్వాతనే ఈ విషయాన్ని జైలు అధికారులు నిందితురాలికి అధికారికంగా తెలియజేస్తారని తెలిపారు. సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో నిందితులయిన ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలు జైలులో ఉన్నారు. నిందితుడిని కలిసేందుకు ఆతడి బామ్మ వస్తున్నారని కానీ ముస్కాన్‌ను కలిసేందుకు ఎవరూ రావడంలేదని జైలు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చింది.



# హింగోలి జిల్లాలో 13వేల మందికి పైగా కేన్సర్

**ముంబయి, ఏప్రిల్ 8:** కేన్సర్ కేసులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు మహారాష్ట్రలో నిర్వహించిన సర్వేలో ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. సంజీవని అభియాన్ పేరిట హింగోలి జిల్లాలో స్థానిక యంత్రాంగం నిర్వహించిన డ్రైవ్‌లో 13,500 మంది మహిళల్లో కేన్సర్ అనుమానిత లక్షణాలు కనిపించాయి. 7000 మందిలో సర్వైకల్ కేన్సర్, 3500 మందికి రొమ్ముకేన్సర్, 2000 మందిలో నోటికేన్సర్ అనుమానిత లక్షణాలను గుర్తించినట్లు కలెక్టర్ అభినవ్‌గోయల్‌మీడియాతో వెల్లడించారు. మరికొందరిలో ఇతర కేన్సర్ లక్షణాలు కనిపించాయన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని 3.5 లక్షలమంది మహి ళలపై సర్వేజరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించామన్నారు. ప్రస్తుతంస్క్రీనింగ్ ముగిసిందని తర్వాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నిపుణులు శిక్షణ పొందిన వైద్యబృందం పర్యవేక్షణలో ఈప్రక్రియను చేపట్టామని కలెక్టర్ తెలిపారు.

# టీచర్ నియామకాల్లో సిబిఐ దర్యాప్తు అవసరంలేదు..

## మమతకు ఊరటనిచ్చిన సుప్రీం ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపివేసిన ఉపాధ్యాయనియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సక్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో సిబిఐ దర్యాప్తునిమిత్తం హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీంకోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్రకేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టంచేసింది. నిపుణులతోచర్చలుజరిపిన తర్వాతే బెంగాల్ విద్యాశాఖ ఈ అదనపు పోస్టులను సృష్టించింది. దీనికి గవర్నర్‌నుంచి ఆమోదం లభించింది. అలాంటప్పుడు ఇందులో న్యాయపరమైన జోక్యం అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అయితే టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు వెల్లడించింది. ప్రభుత్వ ప్రయోజిత ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతోపాటు గ్రూప్‌సి, గ్రూప్‌డి స్టాఫ్ సిబ్బంది నియామకాలకోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహిం చింది. 24,650ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపికప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందచేసారు. అయితే ఖాళీలు ఉన్న సంఖ్యకంటే ఎక్కువమందిని ఎంపికచేయడంపై వివాదం రాజుకుంది. ఉద్దేశ్యపూర్వకంగానే అదనపు పోస్టులను సృష్టించి అక్రమ నియామకాలు చేపట్టారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణజరిపిన కోల్‌కత్తా హైకోర్టు 2016 నాటికి ఆ నియామక ప్రక్రియ చెల్లదని తీర్పు వెలువరించింది. అంతేకాక ఈ కేసులో రాష్ట్రప్రభుత్వ అధికారుల పాత్రతోపాటు అవకతవకలపై దర్యాప్తుజరపాలని సిబిఐ ఆదేశించింది. దీన్ని సవాల్‌చేస్తూ బెంగాల్‌ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణజరిపిన సర్వోన్నత న్యాయస్థానం సిబిఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు వెలువరించింది. ఇప్పటికే 25,753 మంది టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు గత వారం తీర్పు వెలువరించింది.

# తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం సీరియస్

## వీటో అధికారం గవర్నర్‌కు లేదు.. సుప్రీంబెంచ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. రాష్ట్ర అసెంబ్లీ పంపించిన బిల్లులను తన వద్దనే పెట్టుకుని వీటో అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టంచేసింది. జస్టిస్ జెబి పార్డీవాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యలు అక్రమం అని పేర్కొన్న కోర్టు ఆయన వద్ద బిల్లులకు గవర్నర్ తప్పనిసరి అనుమతి ఇవ్వాలని, అయితే బిల్లుల్లో వైరుధ్యం ఉంటే దాన్ని తిరస్కరించాలని కోర్టు పేర్కొంది. తమిళనాడు శాసనసభ పంపించిన పది బిల్లులను గవర్నర్ రిజర్వులో పెట్టుకోవడం అక్రమం అని న్యాయవ్యతిరేకమైనదని అందుకే ఆచర్యలను పక్కన పెడుతున్నామని ఆ బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటినుంచి వాటికి క్లియరెన్స్ దక్కినట్లు కోర్టుప్రకటించింది. తమ బిల్లులకు గవర్నర్ అనుమతి ఇవ్వడంలేదని తమిళనాడు ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై కోర్టు తాజా ఆదేశాలు జారీచేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్లు చాలా చురుకుగా పనిచేయాలని కోర్టు పేర్కొంది. ఓ స్నేహితుడిగా మార్గదర్శిగా, తత్వవేత్తగా గవర్నర్ పనిచేయాలని కోర్టు సూచించింది. రాజకీయ ప్రేరణతో ఆయన పని చేయకూడదని ధర్మాసనం హితవు పలికింది. సమస్యలు పరిష్కరించడంలో గవర్నర్ ఒక దూతలా ఉండాలని ఉత్ప్రేరకంగా పనిచేయాలని కోర్టుచెప్పింది. రాజ్యాంగ విలువల్ని గవర్నర్లు రక్షించాలని కోర్టుతెలిపింది. 2020నుంచి 2023వరకూ సుమారు 12 బిల్లులను తమిళనాడు అసెంబ్లీ గవర్నర్ అనుమతికోసం పంపించింది. కానీ గవర్నర్ ఆ బిల్లులను నిరవధికంగా వాయిదావేసారు. దీనితో ఆ బిల్లుల అనుమతి కోరుతూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే 2023 నవంబరులో రెండుబిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించగా మరో 10బిల్లులు గవర్నర్‌వద్దనే ఉండిపోయాయి. అయితే కొన్నిరోజుల వ్యవధిలో మళ్లీ ఆ పదిబిల్లులను రాష్ట్రశాసనసభలో పాస్‌చేయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అనుమతి కోరుతున్నట్లు తమిళనాడు సర్కారుతన పిటిషన్‌లో సుప్రీంకు వివరించింది.

# నేటి నుంచి సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ సీమాంధ్ర మీదుగా హుబ్లీ-కతిహార్-హుబ్లీ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. హుబ్లీ నుంచి కతిహార్ వెళ్లే నెంబర్ 07325ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9(నేటి) నుంచి 30వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 3.15గంటలకు హుబ్లీ నుంచి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు కతిహార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కతిహార్ నుంచి హుబ్లీ వెళ్లే నెంబర్ 07326ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12నుంచి మే 3వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు కతిహార్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 10.50గంటలకు హుబ్లీ చేరుకుంటుంది.

# న్యూఢిల్లీ డిఆర్‌ఎం కార్యాలయంపై సిబిఐ పంజా

## సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలు అరెస్టు

## సోదాల్లో రూ.63.85లక్షల నగదు, రూ.3.46కోట్ల బంగారం,కీలకపత్రాలు స్వాధీనం



సిబిఐ దాడుల్లో బయటపడిన నగదు, బంగారు ఆభరణాలు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నార్ధన్ రైల్వే న్యూఢిల్లీ డిఆర్ఎం కార్యాలయంపై సిబిఐ పంజా విసిరింది. ఈ దాడుల్లో రైల్వేకి చెందిన ఒక సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మరో ఇద్దరు సీనియర్ సెక్షన్ ఇంజనియర్లు సిబిఐ వలలో చిక్కడంతో డిఆర్ఎం కార్యాలయంలో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే. నార్ధన్ రైల్వే న్యూఢిల్లీ డివిజన్‌లో విద్యుత్ విభాగానికి చెందిన పనులను అప్పగించేందుకు గుత్తేదారును సంబంధిత విభాగం అధికార యంత్రాంగం రూ.7లక్షల లంచాన్ని డిమాండ్ చేశారని బాధిత గుత్తేదారుడు సిబిఐని ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి సదరు గుత్తేదారుడు ఇచ్చిన ముందస్తు పక్కా సమాచారంతో బాధిత కాంట్రాక్టర్ రూ.7 లక్షల లంచాన్ని ఇస్తుండగా సిబిఐ చాకచక్యంగా వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా సీనియర్ డిఇఇ సహా మరో ఇద్దరు ఎస్ఎస్ఇలను అరెస్టు చేసింది. ఇదే సమయంలో తొమ్మిది వేర్వేరు ప్రాంతాల్లో వీరికి చెందిన నివాసాలలో ఏకకాలంలో దాడులు చేసి సోదాలు నిర్వహించగా రూ.63.85లక్షల నగదు, సుమారు రూ.3.46కోట్ల విలువైన బంగారం(రూ.96.26లక్షల బంగారు ఆభరణాలు), ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాపులు, ఈకేసుకు సంబంధించిన కీలక పత్రాలు, హార్డ్ డిస్కులు సీనియర్ డిఇఇ భార్య నిర్వహించే(చెందిన) లాకర్‌లో రూ.2.5కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు సోదాల్లో స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోందని వారు పేర్కొన్నారు.

# రాజ్యాంగ రక్షణ ప్రాధాన్యత అంశంగా సిడబ్ల్యుసి



## తెలంగాణ కుల గణన, బిసి 42 రిజర్వేషన్‌పైనా చర్చ

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రాజ్యాంగ పరిరక్షణ ప్రాధాన్యత అంశం అహ్మదాబాద్‌లో సిడబ్ల్యుసి సమావేశాలు నిర్వహిస్తున్నామని ఇది దేశంలోని పౌర హక్కులు, లౌకికత్వం సమాఖ్య స్ఫూర్తి భంగం కలుగకుండా అన సరించాల్సిన రాజకీయ విధానం నిర్ణయిస్తుందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సమావేశానికి వెళ్లే ముందు విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన కులగణన, శాసనసభలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేయడం వంటి అంశాలను మిగితా రాష్ట్రాల్లో అధికారం వచ్చిన వెంటనే చేసేందుకు అనుగుణంగా ఒక రాజకీయ విధానం తీసుకొనేందుకు వీలుగా చర్చ జపేందుకు ఎఐసిసి సమయం కూడా కేటాయించిందని తెలిపారు. సామాజిక న్యాయం, దేశంలో ప్రజల మధ్య ఐక్యత పునాదిగా అభివృద్ధి దిశగా నడవడానికి అనువైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా చర్చజరుగుతుందని వివరించారు. ఎఐసిసి మీటింగ్‌లో దేశంలోని పార్టీ పెద్దలు పార్టీ అను సరించాల్సిన మారుతున్న దేశ, ప్రపంచ రాజకీయాలకు అనుగుణంగా విధివిధానాలు సందేశం రూపంలో ఇస్తారని ఇది ఒక విధంగా ప్రజలకు ఇచ్చే సందేశమేనని ఆయన అన్నారు. మతోన్మాదులు దేశం విచ్ఛిన్నం కోసం చూస్తున్న తరుణంలో జరుగుతున్న ఈ సమావేశం ఒక ముఖ్య మైన భరోసా దేశంలోని బలహీనవర్గాలకు అందిస్తుందని అన్నారు. అహ్మదాబాద్‌లో పరిస్థితులు మారాయి ఇప్పుడు కాంగ్రెస్ గాలి వీస్తున్నదని మహేష్ ఆశాభావం వ్యక్తంచేశారు. 11ఏళ్ళమోడి ప్రధానమంత్రిగా ఉండి అట్టడుగు వర్గాలకు ఏమిచేయలేదని అందరికి సమాన అవకాశాలు కల్పించే పార్టీ అని ఆయన తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అహ్మదాబాద్‌లో మంగళ,బుధవారం సమావేశాలకు ఏఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక కాంగ్రెస్ ముఖ్య మంత్రులు, మంత్రి మండలి సభ్యులు ఇతర ప్రముఖులు ఎంపిలు, పిసిసి అధ్యక్షులు హాజరవుతారని ఆయన చెప్పారు. 64 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత మోడీ సొంతగడ్డపై కీలక సమావేశం నిర్వహిస్తున్నామని తెలంగాణ నుంచి 40 మందినేతలు పాల్గొంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వంశీచంద్‌రెడ్డి ఎపి సిడబ్ల్యుసి సభ్యులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఏడాది చివరలో జరగబోయే బీహార్, 2026లో జరగబోయే తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించవలసిన వ్యూహాలు చర్చిస్తారు. లోక్‌సభ ఎన్నికలలో ఇండియాకూటమి అనుసరించిన విధానాలు ఛత్తీస్‌గఢ్, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్షలు ఉంటాయని అన్నారు.

# భూభారతి చట్టం.. రెవెన్యూకు కొత్త ఊపిరి

## రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభలో ఉద్యోగ జెఏసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నూతనంగా అమలులోకి వస్తున్న భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు చేరువ అవుతాయన్నారు.గ్రామీణ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడం వలన రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు. మంగళవారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్ లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలోకి జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)లుగా వస్తున్న పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏలు సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం జీపీవో పోస్ట్ కొత్తగా క్రియేట్ చెసిందని, అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చినట్లుగానే జీపీవోలకు కూడా పదోన్నతులు వస్తాయన్నారు. ఆప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కూడా ఇతర ప్రభుత్వ ఉద్యోగులందరికీ వచ్చిట్లుగానే కామన్ సర్వీస్ తో పాటు పదోన్నతులు వస్తాయన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖలో నియామకం చేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులో భరోస లభిస్తుందన్నారు.

ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాదించామని, అలాగే గతంలో ధరణిలో తహశీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు.భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని చైర్మన్ వి. లచ్చిరెడ్డి అన్నారు.ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు చెప్పారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలను సర్దుబాటు చేసి ఆ కుటుంబాలకు న్యాయం చేసేలా, కారుణ్య నియామకాలను చేపట్టేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సమాయత్తం

## అన్ని ట్రేడ్ యూనియన్లతో రాష్ట్ర సదస్సు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను, ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నందుకు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక, రాష్ట్ర కార్మిక సంఘాల, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల సదస్సు కార్మికవర్గానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర సదస్సుకు ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసి డెంట్ విజయ్‌కుమార్ యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ తదితర నాయకులు అధ్యక్షత వహించగా సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ రాష్ట్ర సదస్సు ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను పెంచి పోషిస్తుందని ఆయన విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు వచ్చే నెల 20న సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని ఆయన తెలిపారు. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ కార్మికవర్గం మే 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని ఆయన కోరారు.

ఈ తీర్మానంపై కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఐఎన్‌టియుసి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, హెచ్‌ఎంఎస్ నాయకులు అంజద్, సిఐటియు నాయకులు సాయిబాబ, టియుసిఐ నాయకులు కె.సూర్యం, టిఎన్‌టియుసి నాయకులు ఎం.కె.బోస్, బిఆర్‌టియు నాయకులు జి.రాంబాబు యాదవ్, ఎఐయుటియుసి నాయకులు కృష్ణ, తదితరులు మాట్లాడారు. మే 20న దేశవ్యాపిత సమ్మెలో రాష్ట్రంలోని అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# లిక్కర్ మరకల చెరిపివేతకు ఎమ్మెల్సీ కవిత పాట్లు

## అధికారం పోగానే ధర్నాలు

### విప్ ఆది శ్రీనివాస్




**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** లిక్కర్ మరకలను తుడిచి వేసుకోవడానికి కల్వకుంట్ల కవిత నానా పాట్లు పడుతున్నారని విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జైలు నుంచి బయటకు వచ్చాక బిఆర్ఎస్‌లో తన స్థానం కోసం కల్వకుంట్ల కవిత అనేక విన్యాసాలు చేస్తున్నారని అన్నారు.రిజర్వేషన్లు, జ్యోతిరావుఫూలే విగ్రహం పేరిట కవిత డ్రామా చేస్తోందని విమర్శించారు. జ్యోతిరావు పూలే పేరు ఎత్తే అర్హత అసలు కవితకు ఉందా?! అని నిలదీశారు. బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాల ఏర్పాటు చేసిన మహనీయుడు ఫూలే అని కొనియాడారు. మహిళా విద్యకు మార్గదర్శకుడు స్వయంగా తన భార్య సావిత్రి బాయి కి రాయడం, చదవడం నేర్పి మార్గదర్శిగా నిలిచారని అన్నారు. జ్యోతిరావు ఫూలే సావిత్రి బాయి దంపతులు ఆదర్శప్రాయులు ఇలాంటి వారి గురించి కవిత మాట్లాడటం అంటే అంతకు మించిన దౌర్భాగ్యం ఇంకోటి లేదు. కేసీఆర్ ఆయన బిడ్డ కవితకు ఏం నేర్పాడో అందరికీ తెలుసు దేశంలో లిక్కర్ స్కాం అరెస్ట్ అయిన మొదటి మహిళా నాయకురాలు కవిత అని విమర్శించారు. దాదాపు ఆరు నెలలు లిక్కర్ కేసులో తీహార్ జైలు ఉండి వచ్చిన నాయకురాలు సావిత్రి బాయి పులే గురించి మాట్లాడితే తెలంగాణ ప్రజలు వినాలా అని ఆయన ప్రశ్నించారు. పులే విగ్రహం పెట్టాలని కవిత చెపితే ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ తెలుసు కోవాలా పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు జ్యోతి రావు ఫూలే ఎందుకు కవితకు గుర్తుకు రాలేదు పులే విగ్రహం పెట్టాలని ఆయన వాళ్లకు అయ్యకు ఎందుకు చెప్పలేదు అని ఆయన కవితను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు గంటల్లోనే ప్రగతి భవన్ కంచెలను బద్దలు కొట్టించారు ప్రగతి భవన్ కు మహాత్మ జ్యోతిరావు పులే పేరు పెట్టింది మా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రజా ప్రభుత్వం అని అన్నారు. నీకు బిసిల పైన అంత ప్రేమ ఉంటే తెలంగాణ జాగృతి అధ్యక్ష పదవి నుంచి తప్పుకుని బిసి నేతకు ఇవ్వు అని సూచించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కోసం కులగణన చేసిన ప్రభుత్వం మాది అని ఆయన తెలిపారు. అసెం బ్లీలో బిల్లు పెట్టి అమోదించిన చరిత్ర మాది.కేంద్రం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా బిసి లకు రాజకీయం గా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నామని ప్రకటించారు.

# ఎస్ఎస్‌సి మూల్యాంకన కేంద్రం ఆకస్మిక తనిఖీ

## వసతులను పరిశీలించిన పాఠశాల విద్య డైరెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఈ నెల 4 వరకు జరిగిన విషయం తెలిసిందే. పరీక్షల అనంతరం నిర్వహించే జవాబుపత్రాల మూల్యాంకనం రాష్ట్రంలో 19 కేంద్రాల్లో కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా సంగా రెడ్డిలో కొనసాగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి పరీక్షలకి సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 7 నుంచి 15 వరకు 19 కేంద్రాల్లో నిర్వహించబడుతోంది. మంగళవారం ఉదయం పాఠశాల విద్యా సంచాలకులు ఇవి నరసింహా రెడ్డి సంగారెడ్డి జిల్లా నందలి 10వ తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. మూల్యాంకన కేంద్రంనందు ఉపాధ్యాయుల హాజరుతోపాటు వసతుల ఏర్పాట్లు పరిశీలించారని ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఏ కృష్ణారావు తెలిపారు. మూల్యాంకన కేంద్రంలోని వసతులపట్ల పాఠశాల విద్య డైరక్టర్ సంతృప్తి వ్యక్త పరచినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు మూల్యాంకనము చేయు విధానమును పరిశీలించి జిల్లా విద్యాశాఖాధికారి(డిఈవో) వెంకటేశ్వర్లుతోపాటు అధికారులతో క్యాంపు నిర్వహణను సమీక్షించారు.

# చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలి

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలి

### అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

**గోదావరిఖని, ప్రభాతవార్త:** అధికారులు చిత్తశుద్ధితో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కృషి చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మంగళవారం అన్నారు. ఎన్టీపీసీ మిలినీయం హాల్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమాం దీపక్, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, తదితరులతో కలిసి జిల్లా అధికారులతో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సమీక్షి ంచారు. గతంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో జారీ చేసిన సూచనలు, పనుల పురోగతి వివరాలను, తమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఈడి ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, పరిశ్రమల శాఖ, లీడ్ బ్యాంకు మేనేజర్ వివరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పకడ్బందీగా నమోదు చేయాలని, నిందితులకు చట్టం ప్రకారం శిక్ష పడేందుకు వీలుగా అవసరమైన సాక్ష్యాలను పక్కాగా నమోదు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని, అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాల్సి ఉంటుందని అన్నారు. నిమ్న వర్గాల యువత పరిశ్రమల స్థాపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు సబ్సిడీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. రామగుండం, బెల్లంపల్లిలో ఉన్న ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎస్సి ఔత్సాహిక వేత్తలకు భూ కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఔత్సా హికవేత్తలకు గ్యారెంటీ లేకుండా రుణాలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను బ్యాంకులు తూచా తప్పకుండా పాటించేలా చూడాలని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, కులాంతర వివాహాల సబ్సిడీ సకాలంలో అందేవిధంగా చూడాలని అన్నారు. బ్యాంకుల ద్వారా ఎస్సి లబ్దిదారులకు విద్యా రుణాల మంజూరు ఎలా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా రుణాల పంపిణీపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. భూ వివాదాల సమయంలో సర్వే నిర్వహించాలని అన్నారు. దళితుల భూమిని ఆక్రమించాలని చూసే వారిపై చట్ట ప్రకారం కేసుల నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో పోలీసులు అరెస్ట్ చేయడం లేదనే మాట బయట బలంగా వినపడుతుందని, తప్పుడు కేసు కాని పక్షంలో తప్పనిసరిగా విచారించి నిందితులను అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని శాఖల వారిగా బ్యాక్ లాగ్ పోస్టులు, కారుణ్య నియామకాలు, పదోన్నతుల పెండిరగ్ వివరాలను అందించాలని అన్నారు. ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎన్టీపీసీ, సింగరేణి, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కింద జరిగే భూసేకరణలో దళితులకు కూడా న్యాయమైన పరిహారం తప్పనిసరిగా అందజేయాలని, పరిహారం అందించిన తర్వాత మాత్రమే భూ బదలాయింపులు జరగాలని అన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రింద నమోదైన కేసుల్లో బాధితులకు చట్ట ప్రకారం పరిహారం అందించామని అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, పెద్దపల్లి, గోదావరిఖని ఎసిపిలు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్సీ కవిత

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో విగ్రహ సాధన దీక్ష

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అసెంబ్లీలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన పూలే విగ్రహసాధన దీక్షకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ దీక్షనుద్దేశించి కవిత మాట్లాడుతూ ఈ నెల 11న జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆరోజు పూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ వంటి మహనీయులు సైతం గురువుగా చెప్పుకునే జ్యోతిబాపూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటుచేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. 1848లోనే మహిళల కోసం పాఠశాల ఏర్పాటుచేసిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిబాపూలే అని, ఆయన కృషితోనే నేడు అనేక మంది మహిళలు ఉన్నతవిద్యను అభ్యసించి, అనేక రంగాలలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. కుల వివక్ష కోసం పోరాడి, బడుగుబలహీన వర్గాలను జాగృతంచేసి, వారి అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుని విగ్రహం చూస్తేనే మనకు ఒక ధైర్యం ఇస్తుందని అన్నారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఎలా ఉందో అదేవిధంగా అంబేద్కర్ విగ్రహం పక్కన జ్యోతిబా పూలే విగ్రహం కూడా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న పూలే జన్మదినం రోజు విగ్రహంపై ప్రకటన ఇచ్చి, బీసీలకు స్ఫూర్తినివ్వాలని డిమాండ్ చేశారు. బిల్లు పాస్ కాగానే అఖిల పక్షాన్ని తీసుకుని ఢిల్లీకి పోతామన్న కంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీజేపీతో ఎటువంటి లాలూచీ లేకపోతే బీసీ బిల్లుపై కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

## మండిపడుతున్న సిపిఎం, సిపిఐ

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ధరల పెంపును తగ్గించడం కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేసే వంటగ్యాస్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాపిత నిరసనలకు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలకు తగ్గించి ఆ ఫలితాలు అందించాల్సిందిపోయి... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్‌పై రు.50లు పెంచడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్నిరకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, నేడు, రేపు(ఏప్రిల్ 9, 10 తేదీల్లో) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టా లని నిర్ణయించినట్టు జాన్‌వెస్లీ తెలిపారు.

### పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి: కూనంనేని

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై రూ. 50 అదనంగా పెంచడం వలన మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాలలో ఖాళీ సిలిండర్లతో నేడు(బుధవారం) నిరసన ధర్నాలు చేపట్టాలని సిపిఐ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు తెలిపారు.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘోరం..

## బాలికపై ఇద్దరు యువకుల అత్యాచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో 12 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం జరిపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు ఆమె బంధువు ఒకరి పాత్ర కూడా వుండడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. ఆదిలాబాద్ పట్టణంలోని మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాల నీకి చెందిన 12 ఏళ్ల బాలికను 35 ఏళ్ల మహిళ పథకం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకు వెళ్లింది. ఆమె వెంట మరో వ్యక్తి కూడా వున్నారు. మహిళకు బంధువులైన ఇద్దరు యువకులు అంతకు ముందే అక్కడ వుండగా వారిద్దరు ఆ బాలికపై అత్యాచారం చేశారు. దీనిని బాలిక పతిఘటించగా సదరు అత్యాచారానికి పాల్పడ్డ యువకుల బంధువైన మహిళతో పాటు మరో వ్యక్తి బాలికను చంపుతానని భయ పెట్టారు. కాగా రాత్రి వేళ ఆ బాలికను సదరు మహిళ ఇంటి వద్ద దించి ఇంట్లో వారికి ఏమీ చెప్పవద్దని హెచ్చరించింది. అయితే ఆలస్యంగా ఇంటికి వచ్చిన బాలికను తల్లి, ఇతర కుటుంబ సభ్యులు నిలదీయడంతో జరిగిన విషయం చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే రంగంలో దిగిన పోలీసులు బాలికను రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించా అత్యాచారం జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. అనంతరం బాలికపై అత్యాచారం చేసిన ఇద్దరు యువకులతోపాటు వారికి సహకరించిన మహిళపైనా, ఆమె బంధువుపై నా ఇమ్మోరబుల్ ట్రాఫిక్ యాక్ట్, అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా టెండర్లు పిలవాలి

## వాళ్లకూ రెండేళ్లకోసారి లైసెన్స్‌లు ఇవ్వాలి

### తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్

**హైదరాబాద్, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** తెలంగాణలోని బార్ అండ్ రెస్టారెంట్స్‌కు కూడా ప్రతి రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలోనే లైసెన్స్ ఇవ్వాలని అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. తాము రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలో లైసెన్స్ తీసుకోవడం వల్ల ప్రభుత్వానికి 87 శాతం ఆదాయం వస్తుంటే...బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా కేవలం 13 నుంచి 15 శాతం ఆదాయం మాత్రమే వస్తుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం షాపుల యజమానులపై, పర్మిట్ రూం, సమయం కుదింపుపై బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. జిల్లాల్లో 10 గంటలకు మద్యం షాపులు మూసివేసినట్లే.. నగరాల్లో కూడా 10గంటలకే మద్యం దుకాణాలను మూసివేయాలనడం అవివేకమన్నారు. రాష్ట్రంలో బార్లు అర్ధరాత్రి 12 గంటల వరకు నడుస్తున్నా తామేమి అభ్యంతరం చెప్పడం లేదని ఎందుకు తమ దుకాణాల సమయాన్ని తగ్గించాలని రోడ్డెక్కుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల సమయాన్ని 11 గంటలకు పైగా పెంచడం వల్ల ఆ ప్రభావం తమపై పడుతుందని, దాని వల్ల 20శాతం నష్టాలు చవిచూస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, ట్రెజరర్ సుభాశ్, వైస్ ప్రెసిడెంట్ ప్రభు, ఇతర కార్యవర్గం పాల్గొన్నారు.

# వచ్చే యేడాది నుంచి ఎస్సీ గురుకులాల్లో కోడింగ్ కోర్సులు

## ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండేషన్‌తో ఎంఒయు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సులను ప్రారంభించ నున్నారు. ఇందుకు సంబంధించి ఆర్‌పిఎఫ్-యుకె ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నట్టు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఐదేళ్లపాటు ఎంవోయూ చేసుకొని.. 6వ తరగతి నుండి ఇంటర్ వరకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యం అనేది కీలకంగా మారింది. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు, వీలైనంత త్వరగా జీవితంలో ఒక మంచి హోదా, ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి వేతనం వున్న ఉద్యోగాలవైపు దృష్టి సారిస్తోంది. విద్యార్థుల అభిరుచులు, వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎస్సీ గురుకుల విద్యాసంస్థలో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్టు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 238 గురుకుల పాఠశాలల్లో ఈ కోడింగ్ కోర్సుకి శిక్షణ ఇవ్వనున్నట్టు కార్యదర్శి వెల్లడించారు. గత ఏడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే ఈ కోడింగ్ శిక్షణ ఉండేదని.. దానిని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వున్నా అన్ని పాఠశాలలో విస్తరింపజేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. శిక్షణకు లండన్‌కు చెందిన ఆర్‌పిఎఫ్‌తో ఐదేళ్లకు గాను గురుకుల సంస్థతో ఒప్పందం (ఎంఒయూ) కుదుర్చుకున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఫౌండేషన్ వారు విద్యార్థులకు కావాల్సిన నైపుణ్య శిక్షణ, కరిక్యులమ్(పాఠ్య ప్రణాళిక), అక్షన్ ప్లాన్(కార్యాచరణ ప్రణాళిక), మోనిటరింగ్ (పర్యవేక్షణ), పెడగోజి(బోధన) వంటి అంశాలలో ఫౌండేషన్ వారి సారథ్యంలో ఈ పర్యవేక్షణ కొనసాగనుంది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలో విద్యనభ్యసిస్తున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ వరకు చదివే విద్యార్థులందరికీ సాంకేతికత అంశాల్లో రాటుదేలేలా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

కృత్రిమ మేధ(ఏఐ), కోడింగ్, మెషీన్ లెర్నింగ్(ఎంఎల్), రోబోటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాల్ని వారికి బోధించేందుకు రంగం సిద్ధం చేసినట్టు అలగు వర్షిణి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రతి పాఠశాలలో ఐదుమంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేసి.. దానిలో ఫలితాలు మెరుగ్గా రావడంతో ఫౌండేషన్ ప్రతినిధులను ఒప్పించడం ద్వారా రానున్న విద్యా సంవత్సరం(2025-26) నుంచి ఈ పాఠ్యాంశాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలో అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అన్ని పాఠశాలల్లో కంప్యూటింగ్ పాఠ్యాంశాలను రెగ్యులర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థులకు రెండు గంటలపాటు తరగతులు మరో రెండు గంటల ప్రాజెక్ట్ వర్క్‌తో విద్యార్థులకు నేర్పిస్తారు. పాఠశాలలోని దాదాపు 1,52,000 మంది విద్యార్థులందరికీ కంప్యూటింగ్ పాఠ్యాంశాలను ఒక సబ్జెక్టుగా నేర్పడంతో పాటు మూల్యాంకనం చేస్తారని.. కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేస్తారని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు పలు అంకురా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు.

# ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలి: డిజిపి జితేందర్

**ముగిసిన అర్ధవార్షిక క్రైం సమీక్ష**

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న అర్ధ వార్షిక క్రైం రివ్యూ సమీక్ష మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు సమిష్టిగా కృషి చేసి అధిగమించాలని కోరారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ విషయంలో మరింత చురుకుగా పనిచేయాలని ఆయన కోరారు. డ్రగ్స్ కట్టడికి, యువతలో ఈ విషయంలో మరింత చైతన్యం తీసుకువచ్చేందుకు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను వాడుకోవాలని, వారిని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించే ప్రచారంలో భాగస్వాములను చేయాలని డిజిపి కోరారు. విద్యా సంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీలను చురుకుగా పనిచేసేలా చూడాలని ఆయన తెలిపారు. నేరాల నివారణలో కీలకంగా వున్న సిసిటివిఎస్ ప్రాజెక్టును మరింత బలోపేతం చేయాలని, నేరాళ్లను సమస్త జారీచేసే ప్రక్రియ పటిష్టం చేయాలని డిజిపి కోరారు. సిఐడి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయల్ మాట్లాడుతూ నేరాల నివారణలో సిఐడి చేపట్టిన పనుల గురించి తెలపడంతో పాటు సాధించిన విజయాలను వివరించారు. నేరాళ్లకు పెరిగిన శిక్షల శాతం గురించి కూడా ఆమె వివరించారు. శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ రాష్ట్రంలో శాంతి భద్రతలు సవ్యంగా వున్నాయని తెలిపారు. అన్ని జిల్లాల పోలీసుల సమిష్టి కృషి వల్ల ఇది సాధ్యమయ్యింది అని ఆయన తెలిపారు. నకిలీ విత్తనాల విషయంలో కఠినంగా వున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ స మావేశంలో టెక్నికల్ విభాగం అదనపు డిజి శ్రీనివాస రావు, మహిళా భద్రతా విభాగం డిఐజి రెమా రాజేశ్వరి, (ప్రొక్యూర్మెంట్స్) విభాగం డైరెక్టర్ సాంబశివరెడ్డి, టి. నాబ్ డైరెక్టర్ సాంబశివరావు, హోంగార్డుల విభాగం అదనపు డిజి స్వాతి లక్రా, అదనపు డిజి పర్సనల్ అనిల్ కుమార్, సిటీ అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) విశ్వప్రసాద్, పి అండ్ ఎల్ ఐజి రమేష్ రెడ్డి, మల్టీ జోన్ 1, 2 ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మోహినీజీ మరణం విశ్వ ఆధ్యాత్మికకు తీరని లోటు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్8:** బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్‌గా సేవలందించిన రాజయోగిని దాదీ రతన్ మోహినీజీ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దాదీజీ జీవితం ఆదర్శప్రాయమైనది, ఆమె ఆధ్యాత్మిక బలానికి, నిర్మలత్వానికి,విశ్వ సోదరభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమె భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో విస్తరింది, సమాజానికి శాంతి, మానవతా విలువలసందేశాన్ని అందించిన మహనీయురాలు.దాదీ మృతి రాష్ట్రానికి, దేశానికి విశ్వ ఆధ్యాత్మికతకు తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆమె జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శిగా నిలుస్తుందన్నారు.

# 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు

**హైదరాబాద్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** తెలంగాణలో 604 కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం సరఫరా కంపెనీలు దరఖాస్తులు చేసుకున్నాయని ఎక్సైజ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. టిజిబిసిఎల్ ఆహ్వానం మేరకు 45 మద్యం సరఫరా పాత కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నాయని తెలిపారు. తెలంగాణలో తొలిసారిగా కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల కోసం 47 కొత్త కంపెనీలు 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లను తీసుక వచ్చేందుకు ఎక్సైజ్‌శాఖకు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. టిజిబిసిఎల్ ఫిబ్రవరి 23న నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. దరఖాస్తులను మార్చి 15వరకు తీసుకుంటామని తెలుపగా టిజిబిసిఎల్ కొత్త నిబంధనల మేరకు అవసరమైన పత్రాలను సమర్పించలేక పోతున్నామని దరఖాస్తులకు మరికొంత సమయం ఇవ్వాలని పలు కంపెనీలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్‌కు కోరగా ఈ మేరకు కమిషనర్ కొత్త దరఖాస్తులకు ఏప్రిల్ 2వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు.ఏప్రిల్ 2 వరకు వచ్చిన దరఖాస్తులను లెక్కింపగా 92 కంపెనీల నుంచి 604కొత్త మద్యం బ్రాండ్ల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం కొత్త బ్రాండ్ల ప్రభుత్వ ఆమోదం మేరకు అనుమతి ఇస్తామని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు.

# తెలంగాణ అతిథ్యానికి వన్నె తెచ్చేలా మిస్‌వరల్డ్ పోటీలు

## హైదరాబాద్ రానున్న 120 దేశాల మోడల్స్

## స్వాగత ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** తెలంగాణ టూరిజం బ్రాండ్ పెరిగేలా, తెలంగాణ అతిథ్యానికి వన్నె తెచ్చేలా మిస్ వరల్డ్ పోటీలు ఉండాలని తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్ అధికారులను దిశానిర్దేశం చేశారు.స్వాగత ఏర్పాట్లపై మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. మే7నుంచి 31 వరకు 72వ మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో జరుగుతాయని, ఈ పోటీలలో120 దేశాలకు చెందిన మోడల్స్ మే 6,7 న హైదరాబాద్ చేరుకుంటా రన్నారు, వారి రాకను పురస్కరించుకుని చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమొహల్లా ప్యాలెస్‌లో వెల్కమ్ డిన్నర్ ఉంటుందన్నారు.వీటి ఏర్పాట్ల కోసం టూరిజం, జీహెచ్ఎంసీ, హెరిటేజ్, పోలీస్ ఆఫీసర్లతో ప్యాలెస్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు చెప్పారు. వెల్కమ్ డిన్నర్ లో తెలంగాణ టూరిజం బ్రాండ్ ఇమేజ్ అనుగుణంగా ఏర్పాట్లను చేయాలని స్మితా సభర్వాల్ అధికారులకు సూచించారు.120 మంది మోడల్స్ తో పాటు సుమారు 400 మంది ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పాల్గొంటారు. ఈ సమీక్ష సమావేశంలో టూరిజం డైరెక్టర్ హానుమంతు, డైరెక్టర్ యూత్ సర్వీసెస్ డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, శిల్పా రామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు, సెట్విన్ ఎండి వేణుగోపాల్, టూరిజం, పోలీస్, జిహెచ్ ఎంసి అధికారులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ధూల్‌పేట్‌లో వంద కేసుల రికార్డు

**250 రోజులు ..102 కేసుల నమోదు**

**401 కేజీల గంజాయి స్వాధీనం**

**425 మందిపై కేసులు నమోదు...**

**ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహాసన్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ఆపరేషన్ ధూల్‌పేట్‌లో వంద కేసులు నమోదు చేసి ఎక్సైజ్ శాఖ రికార్డును సృష్టించారు.ఆపరేషన్ ధూల్‌పేట్‌తో గంజాయి అమ్మకాలకు క్లోజ్ చేశారు. గంజాయి అమ్మకందార్ల పాలిట ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు సింహ స్వప్నంగా మారాయి. ఆపరేషన్ ధూల్‌పేట్ 250 రోజులు.102 కేసులు,425 మందిపై కేసు నమోదు చేసి 327 మందితో జైల్లోని కటకటాలు లెక్కించారు. మరో 85 మంది ఎక్సైజ్ శాఖ నుంచి తప్పించుక తిరుగుతున్నారు. ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు పూర్తి స్థాయిలో నిర్మూలన లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ దాడులను మరింత ముమ్మరం చేయాలని భావిస్తోంది.ఆపరేషన్ ధూల్‌పేట్ రీతిలో హైదరాబాద్ వ్యాప్తంగా ఈ ఎక్సైజ్ దాడులను విస్తరిస్తున్నారు. నిజాం కాలంలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన లోథా సామాజిక వర్గం వచ్చారు. నిజాం కాలంలో ఏమి చేసేవారో తెలియదు కానీ..రాష్ట్రం ఏర్పడిన అనంతరం నాటుసారా తయారు చేసేవారు.ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో నాటుసారా తయారీని నిలిపి వేశారు.అప్పటి నుంచి మళ్లీ గంజాయి అమ్మకాలు దిశగా తమ దృష్టిని మల్లించారు. జులై 17న ఆపరేషన్ ధూల్‌పేట్ ప్రారంభించారు.ఆపరేషన్ ధూల్‌పేట్ ఏర్పాటు చేసి 250 రోజులు కావస్తుంది. గంజాయి అమ్మకాలు ధూల్‌పేట్‌లో 90 శాతంగా కనుమరుగయ్యాయి. ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా 102 కేసులను నమోదు చేశారు. 327 మందిని రిమాండ్‌కు పంపించగా,13 మందిని బౌండోవర్ చేశారు. 85 మంది పరారీలో ఉన్నారు. 147 మొబైల్స్‌ను,58 బైకులను, 2 కార్లను స్వాధీనం చేసుకున్నారు.

**పూర్తిగా నిర్మూలించే వరకు దాడులు కొనసాగిస్తాం : కమలాహాసన్ రెడ్డి:** గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించే వరకు ఈ దాడులను కొనసాగిస్తూనే ఉంటామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహాసన్ రెడ్డి అన్నారు.హైదరాబాద్‌ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు 90 శాతంగా తగ్గిపోయాయి. మిగిలిన కొద్ది అమ్మకాలను నిర్మూలించే వరకు ఆపరేషన్ ధూల్‌పేట్‌ను కొనసాగిస్తాం. ధూల్‌పేట్ నుంచి చాలా మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి గంజాయి అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఎస్టిఎఫ్ ఇతర టీమ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నాం. డ్రగ్స్, గంజాయి అమ్మకాలు, నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ నిర్మూలన దిశగా పని చేస్తున్నామన్నారు.

# యువ వికాసానికి 9 లక్షల దరఖాస్తులు

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణలో రాజీవ్ యువ వికాసం స్కీముకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలు, ఇంటర్ నెట్ సెంటర్లకు లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఈబీసి వర్గాల నుండి 9 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు.

# వర్సిటీల పోస్టుల భర్తీలో పాత పద్ధతిని కొనసాగించాలి

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యూనివర్సిటీల పోస్టుల భర్తీలో పాత పద్ధతిని అనుసరించాలని. లెక్చరర్ గా అనుభవం అనే అంశాన్ని ఎత్తివేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియా మకాల్లో ఎలాంటి అంశాలను చేర్చకుండా డైరెక్టుగా రిక్రూట్ మెంట్ నిర్వహించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 12 యుని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించడం అభినందనీ యమన్నారు. చాలా కాలంగా రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అధ్యాపకుల రిక్రూట్మెంట్ చేపట్టలేదని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో రిక్రూట్‌మెంట్ జరిగిందని గుర్తు చేశారు. ఈ సారి నిర్వహించే రిక్రూట్ మెంట్‌లో 3 దశలలో సెలక్షన్ ఉంటుందని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొందన్నారు.

# ట్రంప్ నిర్ణయంతో మామిడి రైతులకు దెబ్బ: రూ.50 కోట్ల అదనపు భారం

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అనేక దేశాలపై అదనపు సుంకాలు విధించడంతో పలు రంగాలు నష్టాలను చవిచూస్తున్నాయి. ఇందులో భాగంగా భారత్‌పై ట్రంప్ 22 శాతం నుంచి 26 శాతం వరకు పన్ను పెంచారు 26 శాతం సుంకాలు విధించడంతో మనదేశంలోని పలు రంగాలపై ప్రతికూల ప్రభావం పడింది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం మన దేశ మామిడి పండ్లపై కూడా పడుతోంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వాటి ఉత్పత్తిలో ముందు వరసలో ఉన్నాయి. ఇరు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 7,64,500 ఎకరాల్లో సాగవుతోంది. వాటిల్లో ప్రతి ఏడాది 24,45,900 టన్నుల మామిడి పండ్ల దిగుమతి వస్తోంది. భారత్ నుంచి అమెరికాకు ప్రతి ఏడాది 45 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే 10 - 15 వేల టన్నుల మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి. వాటి విలువ రూ.150 - రూ.230 కోట్ల మధ్య ఉంటుంది. టారిఫ్‌ల పెంపుతో వాటి విలువ ఇప్పుడు మరో రూ.50 కోట్లకు పైగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో అమెరికాలో భారత మామిడి పండ్ల ధరలు పెరిగి, డిమాండ్ తగ్గే ముప్పు ఉంటుంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోవచ్చు. అమెరికాకు ఈక్వెడార్‌తో పాటు ఇండొనేషియా తక్కువ ధరకు మామిడిని ఎగుమతి చేస్తే మన దేశ రైతులు యూఎస్‌లో మార్కెట్‌ను కోల్పోయే అవకాశం ఉంది.

# రైతులను మోసగిస్తున్న పలు విత్తన సంస్థలు

**సాధారణ పంటలే విత్తనాలుగా ప్యాకింగ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలం గాణలో పలు విత్తన సంస్థలు రైతులను మోసం చేస్తున్నాయి. రాష్ట్రంలో వివిధ కంపెనీల మాయాజాలనికి, మోసాలు రైతులు బలవుతున్నారు. ప్రతీ ఏటా వానాకాలం సీజను రెండు మూడు నెలలు ముందు నుండే విత్తన సంస్థలు రైతులను నమ్మకంగా ముంచేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వరికి సంబంధించి కిలో మంచి విత్తనాలను కొనుగోలు చేసి వాటిలో నాసికరం కలిపి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. 30 కిలోల విత్తన బస్తాలను రైతుల పేర్లతో వివిధ సంస్థలు కొనుగోలు చేసి వాటిని 8 కిలోల బ్యాగ్‌లలో ప్యాకింగ్ చేసి ఇతర బ్రాండ్ల పేరు మీద హైబ్రీడ్ సీడ్ పేరుతో విక్రయిస్తున్నారు. ఈ విధంగా బీపీటీ, ఆర్ఎస్ఆర్, 1001, 1010 రకాలతోపాటు, నోటిఫైడ్ వరివిత్తనాలను రైతులకు అమ్ముతున్నట్లు సమాచారం. మరికొన్ని సంస్థలు అనామక కంపెనీల పేరుతో లైసెన్సులు తీసుకుని నాసిరకం విత్తనాలు అమ్ముతున్నారు. సాధారణ పంటనే ప్రముఖసంస్థల పేర్లతో ప్యాకింగ్ చేసివిక్రయిస్తున్నారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితరరాష్ట్రాల నుండి సాధారణ పంటలను తెచ్చి అధిక రేట్లకు అమ్ముతున్నారు.

# విద్యారంగంపై సిఎం రేవంత్‌కి ప్రత్యేక శ్రద్ధ

## వర్సిటీలో ఖాళీల నియామకం గైడ్ లైన్స్ విడుదల:కె.కేశవరావు

**హైదరాబాద్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులలో 50 శాతం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో విద్యారంగంపై ఆయనకున్న శ్రద్ధను సూచిస్తుందని ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఒక ప్రకటనలో ప్రశంసించారు. రాష్ట్రంలో ఏ రంగంలో ఎలాంటిసమస్యలు వచ్చినా తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవడం సీఎం ప్రత్యేకత అని కొనియాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలో తగినంతమంది లెక్చరర్లు లేకపోవడం వల్ల న్యాక్ గ్రేడింగ్ తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని ఇటీవల తాము సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారన్నారు. రాష్ట్రంలోనే అన్ని యూనివర్సిటీలోని లెక్చరర్ పోస్టుల్లో 50 శాతం ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని, ఈ మేరకు గైడ్లెన్స్ విడుదలయ్యాయన్నారు.

# హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** దిల్‌సుఖ్‌నగర్ జంట బాంబు పేలుళ్ల ఘటనపై తెలంగాణ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మారణహోమాన్ని సృష్టించిన ఉగ్రవాదులకు ఉరి సరైన శిక్ష అని తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం పేర్కొనడం ప్రజాస్వామ్యంలో హింస, ఉగ్రవాదానికి చోటు లేదని మరోసారి స్పష్టమైందన్నారు. 12 సంవత్సరాలుగా ఒక పీడకలలా వెంటాడుతున్న బాధితుల కుటుంబాలకు సరైన న్యాయం జరిగిందని భావిస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలకు మేము అండగా ఉంటామన్నారు. ఎన్ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను హైకోర్టు సమర్థించడం పట్ల బిజెపిపక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు జీరో టోలెరెన్స్ విధానంతో మోడీప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ పేలుళ్ళ సంఘటన దర్యాప్తుచేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలియచేస్తున్నానని, దేశ భద్రతకోసం అత్యంత ప్రాధాన్యతనిస్తూ మరింత కఠినచర్యలు ప్రభుత్వాలు ఆవలంభించాలన్నారు.

# కంచె గచ్చిబౌలి భూములపై ఎఐ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా నుంచి డిలీట్

**హైదరాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** సెంట్రల్ వర్శిటీలోని కంచె గచ్చిబౌలిలో ఇటీవల జరిగిన పరిణామాలపై వారం రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫోటోలు, వీడియోలు మంగళవారం వున్నట్లుండి డిలీట్ అయ్యాయి. ఈ భూముల్లో జింకలు, నెమళ్ల వున్నట్లు, బుల్డోజర్లు నేలను చదును చేస్తున్నపుడు నెమళ్ల భయపడి ఎగురుతున్నట్లు, జింకలు గాయపడినట్లు ఏఐ ఫోటోలు, వీడియోలలో వుండడం తెలిసిందే. ఇందులో కొన్ని ఫోటోలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ ట్విటర్ హ్యాండిల్ నుంచి షేర్ అయినట్లుగా వుంది. పర్యావరణాన్ని పరిరక్షించాలని, మూగ జీవాలను కాపాడాలని పోస్టులు పెట్టారు. అంతటితో ఆగకుండా ట్విటర్, ఇన్‌స్టా, ఫేస్ బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో ఫోటో లు షేర్ అయ్యాయి. ఈ ఫోటోలు, వీడియోలు ప్రధాని మోడీతో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ట్యాగ్ చేశారు. కాగా హెచ్‌సియు భూములను కాపాడాలని కో రుతూ సినీ తారలు కూడా పోస్టులు పెట్టారు. అందరు తారలు దాదాపు ఒకే తరహా ఫోటోను వాడారు. ఇక ఈ ఫోటోలు, వీడియోలను పరిశీలించిన సైబర్ క్రైం పో లీసులు ఇవన్నీ నకిలవని తేల్చారు. ఇదంతా ఏఐ వల్ల రూపొందినవని పోలీసులు నిర్ధారించారు. కాగా బుల్డోజర్లు నేలను చదును చేస్తున్న సమయంలో నెమళ్లు ఎగురుతున్న ఫోటోను షేర్ చేసిన బిఆర్ఎస్ సోషల్ మీడియా విభాగానికి చెందిన క్రిషాంక్, దిలీప్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ట్విటర్ హ్యాండిల్‌లో షేర్ చేసిన ఫోటోలు హఠాత్తుగా డిలీట్ అయ్యాయి. ఏఐ ఫోటోలు, వీడియోలపై సైబర్ క్రైం పోలీసులు సోషల్ మీడియా వారియర్లపై నోటీసులు జారీ చేయడంతో పాటు మొత్తం వ్యవహారంపై లోతుగా విచారణ మొదలు పెట్టడంతో పలువురు ప్రముఖుల ట్విటర్ హ్యాండిల్ నుంచి ఏఐ ఫోటోలు, వీడియోలు డిలీట్ అయ్యాయి. కాగా బిఆర్ఎస్ సోషల్ మీడియా విభాగంనేత ఒకరు జింక కాళ్లు కట్టివేసినట్లు ఫోటో షేర్ చే యగా ఇది పొరపాటున జరిగిందని క్షమించాలని పోలీసులను కోరారు. ఈ ఫోటోను షేర్‌చేసిన జర్నలిస్టు కూడా పోలీసులను క్షమాపణ కోరారు. **కంచె గచ్చిబౌలి భూముల్లో ఏనుగులున్నట్లు ఏఐ ఫోటోలు:** ఇదిలావుండగా కంచె గచ్చిబౌలి భూముల్లో ఏకంగా ఏనుగులు సంచరిస్తున్నట్లు ఏఐ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఉమంగ్ జైన్ పేరు తో ఉన్న ట్విట్టర్ హ్యాండిల్‌లో ఈ ఫోటోలు వుండగా దీంతో పాటు ఒక ఏనుగు తీవ్రంగా గాయపడినట్లుగా వుంది. అడ్వకేట్ జానీ వర్మ పేరుతో వున్న హ్యాండిల్‌లో ఏకంగా ఏనుగుల గుంపు కంచె గచ్చిబౌలిలో సంచరిస్తున్నట్లుగా వుంది. కాగా ఇదే కేసులో సినీ నటి దియా మిర్జా, యూట్యూబర్ ధృవ్‌రాఠీ ఏఐ ఫోటోలను షేర్ చేసినట్లు సిఎంఓ నుంచి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందింది. కాగా దీనిపై సినీ నటి దియా మిర్జా స్పందిస్తూ తాను ఎలాం టి నకిలీ ఫోటోలను షేర్ చేయలేదని పేర్కొంది. వీటి నిర్వాహకులను విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# కెటిఆర్-రేవంత్ రాజకీయ కుట్రలపై బిజెపి పోరాటం

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రకాష్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ చుట్టూ ఉన్న విలువైన భూములపై కన్నేసి, ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అమ్మారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మియాపూర్ భూముల కేసు, గుట్టల బేగంపేట కేసు, ఫార్మా సిటికి సంబంధించిన ఏడువేల ఎకరాల భూముల సేకరణ, పరిహార వ్యవహారాల్లో బిఆర్ఎస్ అవినీతి స్పష్టంగా కనిపించిందన్నారు. వీటిపై గతంలో తీవ్రంగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మౌనంపాటిస్తున్నారు. కేసులను నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. కెటిఆర్-రేవంత్‌రెడ్డి దోచుకోవడం, దాచు కోవడంలో కలిసి పనిచేస్తున్నారన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో సుమారు రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసి, ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితికి దిగజార్చారు. సంక్షేమ పథకాలను అమలు చేయలేని స్థితికి తీసుకొచ్చారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థుల తరఫున మాట్లాడుతున్నట్టు కెటిఆర్ డ్రామాలాడుతున్నారని అన్నారు. కేవలం ఉద్యమాలను నీరుగార్చేందుకే కెటిఆర్ ప్రయత్నిస్తున్నారని, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులో సుమారు వెయ్యికోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు.

# స్టేషన్ బెయిల్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అంతిరెడ్డి

## ఫిర్యాదు దారుడు నుంచి 15 వేలు డిమాండ్

## ఎసిబిని ఆశ్రయించిన బాధితుడు



**చింతలపాలెం (ప్రభాతవార్త) ఏప్రిల్ 8:** సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్సై అంతిరెడ్డి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అదికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. నల్గొండ ఏసీబీ రేంజ్ డీఎస్పీ జగదీష్ చందర్ వెల్లడించిన వివరాలప్రకారం గత ఏడాది అక్టోబర్ 23 వ తేదీన పీడీఎస్ బియ్యం ట్రాన్స్ పోర్ట్ చేసే విషయంలో ఆరుగురిపై కేసు నమోదు అయ్యిందని, ఆ కేసు విషయంలో మరో వ్యక్తి కుడా ఉన్నాడని విచారణలో తేల్చి అతడిని స్టేషన్ కు పిలిపించి బెయిల్ ఇవ్వడానికి ఎస్సై ఆ వ్యక్తి నుంచి రూ 15 వేలు డిమాండ్ చేశాడు . దీంతో ఆ వ్యక్తి అం త మొత్తాన్ని ఇచ్చుకోలేనని 10 వేల రూపాయలు ఇస్తానని చెప్పి ఎస్ఐతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమం లోనే ఆ వ్యక్తి నల్లగొండ ఏసీబీ అదికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు దారుడికి కెమికల్ పూసిన 10 వేలు ఇచ్చి ఎస్సైకి ఇవ్వమని పంపించారు. ఆ డబ్బులు తీసుకున్న ఎస్సై తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు ఎస్ఐ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పట్టుబడ్డ ఎస్సై అంతిరెడ్డిని, హైద్రాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కేసుల న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు. మరో టీం ఎస్సై అం తిరెడ్డి ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేసి సంప్రదించాలని, వాట్సప్ నెంబర్ 9440446106 ద్వారా సమాచారం ఇవ్వాలని లేని యెడల సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు ఇవ్వవచ్చని తెలిపారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రాజకీయ పాత్రల్లో జీవిస్తున్న కెటిఆర్, రేవంత్

## బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కెటిఆర్ - రేవంత్ రెడ్డి రాజకీయ పాత్రల్లో జీవిస్తున్నారని బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్‌గా ఉన్న సమయంలో, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ అవినీతిని బయట పెడతామని పెడబొ బ్బలు పెట్టారు. ఇప్పుడు అవన్నీ ఉత్తుత్తి మాటలేనని తేటతెల్లమైందన్నారు. గత ప్రభుత్వంలో కెటిఆర్ గుట్టల బేగంపేటలోని 67 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, కోర్టులో సరైన ఆధారాలు దొరకకుండా ప్రైవేట్ ల్యాండ్ చెప్పి సర్టిఫికెట్ ఇచ్చి వాటిలో భాగం పంచుకున్నారు. ఇందులో రూ.2,500 కోట్ల స్కాం దాగి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై విచారణ జరిపిందేమీ లేదన్నారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కెటిఆర్ యువరాజులా చెలామణి అయ్యారు. గతంలో తారాచౌదరి వ్యవహారంలో ప్రముఖ నాయకుడి పేరు వచ్చింది. అప్పట్లో కెటిఆర్ దాన్ని పక్కకు పెట్టారు. అప్పట్లో ఉన్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే. మరి ఆ నాయకుడితో కెటిఆర్ ఉన్న బంధమేంటో తెలియదు. ఆ కేసును పక్కకు నెట్టేలా కెటిఆర్ వ్యవహరించారున్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. కెటిఆర్ ప్రతిపక్షంలో ఉన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలంటే అందుకు రేవంత్ రెడ్డి అంగీకరించకుండా తమ ప్రభుత్వమే విచారణ జరిపిస్తామని చెబుతోంది. ఇప్పటివరకు ఈ కేసులో పూర్తి విచారణ జరగలేదన్నారు. డ్రగ్స్ కుంభకోణంలో కెటిఆర్ వెంట్రుకలను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపించి జైలుకు పంపిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి అన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిందేమీ లేదు. ఆ కేసు పక్కదారి పట్టిందన్నారు. అవినీతి కేసుల్లో కెటిఆర్ జైలుకు పంపకుండా ఆపుతున్నది రేవంత్ రెడ్డి అన్నారు.

# పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ సిజిఎంగా సునీల్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 8 ,ప్రభాతవార్త :**పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్ మంగళవారం



బాధ్యతలు స్వీకరిం చారు. చార్టెడ్ అకౌం ట్‌గా పని చేసిన ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా బ్యాకింగ్ రంగంలో అనుభవం ఉంది. అంతే కాకుండా కార్పొరేట్ కార్యాలయంలో పలు బాధ్యతలు నిర్వహించారు. దీంతో పాటు వివిధ బ్యాంకుల నియంత్రణ కార్యాలయాలలో బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు.ఈ సం దర్భంగా బ్యాంక్ సిబ్బంది ఆయనకు అభినం దనలు తెలిపారు. చుగ్ ఆధ్వర్యంలో హైదరా బాద్ జోన్ గొప్ప విజయాలు సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# రూ.10వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సురేష్








బాధితురాలు విఓఎ స్వప్న, ఎసిబికి పట్టుబడ్డ సీసీ సురేష్, వివరిస్తున్న ఎసిబి అధికారులు

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మంగళవారం ఎసిబి కరీంనగర్ జిల్లా డిఎస్పి రమణమూర్తి, ఆయన సిబ్బంది ఆధ్వర్యంలో సిసిగా పనిచేస్తున్న పసరకోండ సురేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన హుజురాబాద్ నియోజకవర్గంలో సంచలనం రేపింది. ఎసిబి డిఎస్పి రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారంగా జమ్మికుంట మండలంలోని కోరపల్లి క్లస్టర్‌గా, గ్రామ సమాఖ్య సంఘాలు ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ పసరకోండ సురేష్ క్లస్టర్‌గా 9మంది విఓఎలు పనిచేస్తున్నారు. అందులో భాగంగానే పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె స్వప్న సమాఖ్య సంఘ నాయకు రాలిగా గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తుంది. ప్రభుత్వం వీరికి గౌరవ వేతనంగా నెలకు 5వేల రూపాయలు చెల్లిస్తూ ఉంటుంది. ఎప్పుడు 9గ్రామాల పరిధిలో విఓఎలకు వేతనాలు వచ్చిన క్లస్టర్ కో ఆర్డినేటర్ సురేష్ అందరిని అనేక అగచాట్లకు గురిచేస్తూ, 10వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఉంటాడు. అందులో భాగంగానే ఇటీవల దొడ్డె స్వప్నకు ప్రభుత్వం నుండి వేతనం వచ్చి చాలా రోజులు అవుతున్న సురేష్ జీతం డబ్బులు ఇవ్వమంటే గత సంవత్సరం పాతవి 10వేలు, ఈ సంవత్సరం 10వేలు మొత్తం 20వేల ఇస్తేనే జీతం ఇస్తానంటూ మొండికేయడంతో గత 15రోజులు క్రితం జమ్మికుంట పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద సురేష్‌కు 4వేల రూపాయలు అప్పగించడం జరిగింది. మిగతా 16వేల రూపాయలు తీసుకువస్తేనే నీకు జీతం వస్తుందని మొండికేసి ఇబ్బందులకు గురి చేయడంతో దొడ్డె స్వప్న జిల్లా ఎసిబి అధికారులను ఆశ్రయించినట్లు ఆమె విలేకరులకు వెల్లడించారు. అధికారులు సూచించిన విధంగా మంగళవారం 11-12గంటల ప్రాంతంలో ఐకెపి కార్యాలయంలో ఉన్న సీసీ సురేష్ విఓఎ దొడ్డె స్వప్న 10వేల రూపాయలు లంచం ఇస్తుండగా, ఎసిబి డిఎస్పి రమణ మూర్తి, ఆయన సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడ్డ సురేష్ నుండి, ప్రతేక్ష్య సాక్షుల నుండి వాగ్మూలం తీసుకున్న ఎసిబి అధికారులు సురేష్‌పై కేసు నమోదు చేసి, పట్టుబడ్డ సొమ్ము అక్కడి అధారాలను విలేకరు లకు డిఎస్పి రమణమూర్తి వెల్లడించారు. కరీంనగర్ ఎసిబి కోర్టులో హాజరుపర్చి, జైలుకు పంపిస్తామని డిఎస్పి రమణమూర్తి వెల్లడించారు.

# కర్రెగుట్టపై బాంబులు అమర్చాం: ప్రజలు వేట పేరుతో రావద్దు

## మావోయిస్టు నేత శాంత

**భద్రాచలం, ప్రభాతవార్త :** వేట పేరుతో కర్రెగుట్టపైకి రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వెంకటాపురం -వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత మంగళవారం పత్రికలకు విడుదల లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తూనే ఏడవ గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని మాట్లాడారని, ప్రజా పాలన అని చెప్పి ప్రజలు సమస్యలపై అనేక దరఖాస్తులు తీసుకుని అవి ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదని,బిజెపి కగార్ పేరుతో ప్రజలపై, ప్రజా సంఘాలపై, మావోయిస్టు పార్టీపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కగార్ దాడి నుండి రక్షణ పొందడానికి మేము కర్రెగుట్టపై బాంబులు అమ ర్చామని, ఈ విషయం ప్రజలకు వివిధ రూపాల్లో తెలియజేశామని, అయినప్పటికి కొద్దిమంది ఆదివాసి, ఆదివాసేతర ప్రజలను పోలీసులు మాయమాటలు చెప్పి ఇన్‌ఫార్మర్‌గా మార్చుకొని షికారు పేరుతో కర్రెగుట్టపైకి పంపిస్తున్నారని, మా రక్షణకోసం అమర్చిన బాంబులో పడి చనిపోతున్నారని, కొంతమంది గాయపడుతున్నారని తెలిపారు. కర్రెగుట్టపైకి రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు మంగళవారం శాంత పేరిట పత్రికలకు విడుదల చేసిన లేఖలో పేర్కొంది.

# అర్జున్ S/O వైజయంతి' సెకండ్ సింగిల్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. అర్జున్ S/O వైజయంతి టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నయాల్ది సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. అర్జున్ S/O వైజయంతి సెకండ్ సింగిల్ ముచ్చటగా బంధాలే సాంగ్ ఏప్రిల్ 9న రిలీజ్ కానుంది. చిత్తూరు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో గ్రాండ్ ఈవెంట్‌లో సాంగ్‌ని లాంచ్ చేయనున్నారు. మదర్ అండ్ సన్ బాడింగ్‌ని బ్యూటీఫుల్ ప్రజెంట్ చేసిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతున్నాయి. శ్రీరామ నవమి సందర్భంగా స్పెషల్ ఇంటర్వ్యూ చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మూవీ వండర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని హామీ ఇస్తుంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ తమ్మిరాజు, స్క్రీన్‌ప్లే శ్రీకాంత్ విస్సా. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది.



నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్, విజయ శాంతి, సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్
సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్
బ్యానర్లు: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్
ఎడిటర్: తమ్మిరాజు, సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి, స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ డైరెక్టర్:బ్రహ్మకడలి.

# అట్లీతో అల్లుఅర్జున్ భారీ చిత్రం

భారతదేశ సినీ ప్రేమికులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ అభిమానులు ఎదురుచూస్తున్న అత్యంత సన్సేషనల్ కాంబో అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న అత్యంత భారీ చిత్రం, సన్సేషనల్ చిత్రం ప్రకటన అధికారికంగా వచ్చేసింది. స్టార్ డైరెక్టర్ అట్లీ ఫస్ట్ తెలుగు సినిమా ఇది. కాగా ఏప్రిల్ 8 ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సన్‌పిక్చర్స్ సంస్థ ఈ భారీ ప్రకటనను ఎంతో ప్రస్టేజియస్‌గా విడుదల చేసింది. ఇండియన్ సినిమా పరిశ్రమనలో నూతన ఉత్తేజాన్ని నింపిన ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న అంతర్జాతీయ ప్రాజెక్ట్ ఇది. లాస్ ఏంజెల్స్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేకంగా హీరో అల్లు అర్జున్, హాలీవుడ్ టెక్నీషియన్స్, దర్శకుడు అట్లీలపై చిత్రీకరించిన ఓ ప్రత్యేక వీడియో ద్వారా ఈ అనౌన్స్‌మెంట్‌ను చేసి అందరిని సంభ్రమశ్చర్యాలకు గురిచేశారు. ఇప్పటివరకు టైటిల్ ఖరారు కాని ఈ పాన్‌ఇండియా చిత్రంతో, మూడుముఖ్యమైన సృజనాత్మక శక్తులు ఏకమవుతున్నాయి: భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు అట్లీ (జవాన్, థెరి, బిగిల్, మెర్సల్ వంటి చిత్రాలతో ప్రఖ్యాతి గాంచినవాడు); పుష్ప చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించి, ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు పురస్కారం పొందిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్; మరియు భారతదేశంలోని అగ్రగణ్య మీడియా సంస్థలలో ఒకటైన సన్ టీవీ నెట్‌వర్క్‌కు చెందిన సన్ పిక్చర్స్. అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణ కలిగించేలా రూపొందించనున్న ఈ సినిమా, భావోద్వేగాలు, మాస్ యాక్షన్, పెద్ద స్కేలు నిర్మాణంతో ఓ చారిత్రక సినిమాగా నిలవనుందని చెప్పబడుతోంది. ఈ ప్రత్యేక వీడియో చూసిన అందరూ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ మ్యాజిక్ జరగబోతుందని, ఈ చిత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాలీవుడ్ స్థాయి మేకింగ్ ఉండబోతుందని అర్థమవుతోంది.





అదితిరావు నయా లుక్

# 'డియర్ ఉమ' టీజర్ రిలీజ్

తెలుగమ్మాయి అయిన సుమయ రెడ్డి హీరోయిన్‌గా, నిర్మాతగా, రచయితగా డియర్ ఉమ అనే చిత్రం ఏప్రిల్ 18న రాబోతోంది. ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ మూవీకి నిర్మాతగా సుమయ రెడ్డి.. లైన్ ప్రొడ్యూసర్‌గా నగేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నితిన్ రెడ్డి వ్యవహరించారు. ఇక ఈ సినిమాకు సాయి రాజేష్ మహాదేవ్ స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఇక ఎన్నో చిత్రాలకు అద్భుతమైన విజువల్స్



అందించిన రాజ్ తోట కెమెరామెన్‌గా, బ్లాక్ బస్టర్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన రదన్ సంగీత దర్శకుడిగా పని చేశారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా డియర్ ఉమ నుంచి వచ్చిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఇప్పటికే అంచనాల్ని పెంచేశాయి. తాజాగా డియర్ ఉమ టీజర్‌ను రిలీజ్ చేశారు. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్‌ను చూసిన శివ నిర్వాణ చిత్రయూనిట్‌ను అభినందించారు. టీజర్ ఎంతో బాగుందని, ప్రేమతో పాటుగా అంతర్లీనంగా మంచి సందేశాన్నిచ్చే ఫీల్ గుడ్ ఎంటర్టైనర్‌లా ఉండబోతోందని అన్నారు. గుడిలో దేవుడి వద్ద చేసే ప్రార్థనల కన్నా.. హాస్పిటల్‌లో నాలుగు గోడల మధ్య చేసే ప్రార్థనేలా ఎక్కువ్త అంటూ ప్రారంభమైన టీజర్‌లో, రెండు జీవితాలు.. రెండు ప్రపంచాలు.. రెండు భావోద్వేగాలు.. ఇద్దరి ప్రేమలు.. ఒక హృదయం.. ఒక యుద్ధం, పేషెంట్స్‌కి, డాక్టర్లకు మధ్య మీలాంటి కమిషన్స్ ఏజెన్సీ, బ్రోకర్లు ఉండకూడదు సర్.. దీని కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాన్త అనే డైలాగ్స్ ఎంతో ఎమోషనల్‌గా అనిపించాయి. హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమతో పాటుగా ఇందులో సమాజాన్ని మేల్కొలిపే చక్కటి సందేశాన్ని ఇవ్వబోతోన్నట్టుగా అర్థం అవుతోంది. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను లవ్, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామా ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించారు. ఇక ఏప్రిల్ 18న ఈ మూవీని భారీ ఎత్తున విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో కమల్ కామరాజు, సప్త గిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూప లక్ష్మీ వంటి వారు నటించారు. నటీనటులు: సుమయ రెడ్డి, పృథ్వీ అంబర్, కమల్ కామరాజు, సప్త గిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూప లక్ష్మీ తదితరులు, సాంకేతిక బృందం: బ్యానర్: సుమ చిత్రఆర్ట్స్, నిర్మాత: సుమయ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నితిన్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: నగేష్ యూ.జీ, దర్శకుడు: సాయి రాజేష్ మహాదేవ్.

# 18న 'జగమెరిగిన సత్యం'

అమృత సత్యనారాయణ క్రియేషన్స్ ప్రొడక్షన్ నంబర్ 1గా తెరకెక్కిన చిత్రం జగమెరిగిన సత్యం. అచ్చ విజయ భాస్కర్ నిర్మించిన ఈ చిత్రానికి తిరుపతి పాలే దర్శకత్వం వహించారు. అవినాష్ వర్మ ఆద్య రెడ్డి, నీలిమ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్ర షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకొని ఏప్రిల్18న థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో తెలంగాణ నేపధ్యంలో 1994 లో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు తిరుపతి పాలే. ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా నిర్మాత అచ్చ విజయ భాస్కర్ సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. సురేష్ బొబ్బిలి అందించిన ఈ చిత్ర పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా హీరో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ, జగమెరిగిన సత్యం టైటిల్ బాగుంది. సాంగ్స్ ప్రోమోస్ బాగున్నాయి. మంచి కథ కథనాలతో వస్తోన్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయ్యి చిత్ర యూనిట్ అందరికి మంచి



గుర్తింపు తెచ్చిపెట్టాలని ఆశిస్తున్నాను అన్నారు. ఏప్రిల్ 18న ఈ సినిమాను అందరూ థియేటర్స్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నటీనటులు: అవినాష్ వర్మ, ఆద్య రెడ్డి, నీలిమ పతకమ శెట్టి తదితరులు, డైరెక్టర్: తిరుపతి పాలె, నిర్మాత: అచ్చ విజయ భాస్కర్
కెమెరామెన్: షోయబ్, ఎడిటర్: అమర్ రెడ్డి
మ్యూజిక్: సురేష్ బొబ్బిలి
ప్రొడక్షన్ డిజైనర్: శ్రీపాల్ మాచర్ల
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ కుమార్ ఘటకల.

# 'దండోరా' సెకండ్ షెడ్యూల్ షురూ

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం కలర్ ఫోటో.. బ్లాక్‌బస్టర్ మూవీ బెదురులంక 2012 చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం దండోరా. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం తాజాగా సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. 25 రోజుల పాటు కంటిన్యూగా జరగనున్న ఈ షెడ్యూల్‌లో విలక్షణ నటుడు శివాజీ పాల్గొంటున్నారు. నైంటీస్, కోర్ట్ వంటి డిఫరెంట్ కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించిన ఈ వెర్సటైల్ యాక్టర్ ఇప్పుడు దండోరా చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నారు. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ బీట్ వీడియోకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలని ప్రేమించి పెళ్లిచేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు. ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ, గ్యారీ బి.హెచ్ ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ స్టీవ్‌సన్ పెరెజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు. శివాజీ, నవదీప్, నందు, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు.సాంకేతిక నిపుణులు: బ్యానర్: లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత: రవీంద్ర బెనర్జీ ముప్పానేని.



# 'కౌసల్య తనయ రాఘవ' ట్రైలర్

ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్టైనర్ గా సాగే కౌసల్య తనయ రాఘవ ట్రైలర్ ఈ నెల 11న చిత్రం విడుదల కానుంది. మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీలు వచ్చి చాలా కాలమే అవుతోంది. ప్రస్తుతం వెండి తెరపై మాస్, మసాలా, యాక్షన్, కామెడీ చిత్రాలే కనిపిస్తున్నాయి. కానీ స్వచ్ఛమైన వింటేజ్ విలేజ్ లవ్ ఎమోషనల్ డ్రామాలు కనిపించడం లేదు. ఆ లోటుని భర్తీ చేసేందుకు కౌసల్య తనయ రాఘవ్త చిత్రం రాబోతోంది. రాజేష్ కొంచాడా, శ్రావణి శెట్టి నటీనటులుగా ఏఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై కుటుంబమంతా కలిసి చూసే మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా అడపా రత్నాకర్ నిర్మిస్తున్న ఈ మూవీకి స్వామి పట్నాయక్ కథ, కథనం, దర్శకత్వం బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ అన్నీ కూడా అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో శనివారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఆర్కే నాయుడు, చంటి, నిర్మాత రత్నాకర్ సంయుక్తంగా ఈ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇక ఈ ట్రైలర్‌ను ఓపెన్ చేసిన తీరు.. కథను చెప్పిన తీరు.. పాత్రల్ని పరిచయం చేసిన విధానం బాగుంది. సీతారాములు, రావణుడు అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని అర్థం అవుతోంది. ఓ ఊరు.. అందులో హీరో, హీరోయిన్, విలన్ పాత్ర.. అయితే ఈ చిత్రంలో మాత్రం ప్రేమతో పాటుగా మంచి సందేశాన్ని ఇచ్చినట్టుగా అనిపిస్తుంది. చదువు ముఖ్యమని అంతర్లీనంగా సందేశాన్ని ఇచ్చాడు దర్శకుడు. 80వ దశకంలో జరిగిన కథను తెరపై మరింత అందంగా మల్చినట్టు అనిపిస్తుంది. కౌసల్య తనయ రాఘవ చిత్ర ట్రైలర్‌లో విజువల్స్, మ్యూజిక్ ఎంతో నేచురల్‌గా ఉన్నాయి. యోగి రెడ్డి కెమెరా వర్క్ నాటి కాలానికి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తుంది. రాజేష్ రాజ్ తేలు మ్యూజిక్ ఎంతో వినసొంపుగా ఉంది. ఈ ట్రైలర్‌లో మ్యూజిక్, విజువల్స్ అయితే అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. త్వరలోనే ఈ సినిమాను ఏప్రిల్ 11న రిలీజ్ చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ లాంచ్ అనంతరం హీరో రాజేష్ మాట్లాడుతూ, నన్ను నమ్మి నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. కౌసల్య తనయ రాఘవ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది అన్నారు. దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ, కౌసల్య తనయ రాఘవ సినిమా అద్భుతంగా వచ్చింది. నాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నిర్మాత రత్నాకర్ ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజేష్, శ్రావణి, ఆర్కే నాయుడు ఇలా అందరూ అద్భుతంగా నటించారు. మా చిత్రం ఏప్రిల్ 11న రాబోతోంది. అందరూ చూడండ్థి అని అన్నారు.



# 11న 'చెరసాల' విడుదల

ఎస్ రాయ్ క్రియేషన్స్ బ్యానర్ మీద కద్రి అంజమ్మ సమర్పణలో కద్రి అంజమ్మ, షికార నిర్మాతలుగా రామ్ ప్రకాష్ గున్నం హీరోగా నటిస్తూ, తెరకెక్కించిన చిత్రం చెరసాల. ఈ చిత్రంలో శ్రీజిత్, నిష్కల, రమ్య వంటి వారు నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 11న రాబోతోంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. డైరెక్టర్, హీరో రామ్ ప్రకాష్ గున్నం మాట్లాడుతూ, మంచి కాన్సెప్ట్‌తో చెరసాల చిత్రం రాబోతోంది. కథ చెప్పిన వెంటనే నిర్మాతలు ఒప్పుకున్నారు. శ్రీజిత్, నిష్కల అద్భుతంగా నటించారు. మంచి టీం ఉంటేనే మంచి సినిమాను తీయగలుగుతాం. ఓ బంధం



ఎలా ఉండాలి? రిలేషన్ షిప్‌లో ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు అనే పాయింట్‌ను చూపించాను. మంచి ఎమోషన్స్‌తో పాటుగా చక్కని వినోదం కూడా ఉంటుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా మా చెరసాల చిత్రం ఉంటుంది. ఏప్రిల్ 11న రాబోతోన్న మా సినిమాను అందరూ చూడండి. హీరో శ్రీజిత్ మాట్లాడుతూ, చెరసాల సినిమాను సపోర్ట్ చేసేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను తెలుగులోనే డబ్బింగ్ చెప్పాలని ప్రయత్నించాను. కానీ అది కుదరలేదు. సినిమా అద్భుతంగా వచ్చింది. ఇంత మంచి అవకాశంఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా దర్శకుడు ఈ చిత్రంమీద నాలుగేళ్లు ఫోకస్ పెట్టాడు. మధ్యలో ఇతర ఆఫర్లు వచ్చినా కూడా మా సినిమా మీదే దృష్టి పెట్టాడు. నేను కన్నడలో ఇదివరకు సినిమాలు చేశాను. నన్ను నమ్మి మా దర్శకుడు నాకు అవకాశం ఇచ్చారు. ఇలాంటి మంచి చిత్రాలు మరిన్ని రావాలి. మా సినిమా ఏప్రిల్ 11న రాబోతోంది. హీరోయిన్ నిష్కల మాట్లాడుతూ, నాకు చెరసాల చిత్రంలో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఇది నాకు తెలుగులో తొలి చిత్రం. ఇందులో నేను ప్రియ అనే అద్భుతమైన పాత్రను పోషించాను. ఇంత మంచి సినిమాలో పని చేయడం ఆనందంగా ఉంది. డైరెక్టర్ రామ్ ప్రకాష్ సినిమాను అద్భుతంగా మలిచారు. మేం కష్టపడి, ఇష్టపడి సినిమాను చేశాం.

# 'కోర' సెన్సార్ కార్యక్రమం

డిఫెరెంట్ కాన్సెప్ట్, హై ఓల్టేజ్ యాక్షన్ మూవీని కోర అనే చిత్రాన్ని సునామీ కిట్టి హీరోగా ఒరాటశ్రీ భారీ ఎత్తున తెరకెక్కించారు. ఈ సినిమాలో చరిష్మా, పి.మూర్తి ప్రధాన పాత్రలను పోషించారు. శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ బ్యానర్ మీద డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, పాటలు సినిమా మీద అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా ఆస్కారు అవార్డు గ్రహీత చంద్రబోస్ రిలీజ్ చేసిన ఒప్పుకుందిరో అంటూ సాగే ఈ పాట అందర్నీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. తాజాగా సినిమాకి సంబంధించిన ఓ అప్డేట్ వచ్చింది. ఏప్రిల్ నెలలో ఈ మూవీని విడుదల చేయనున్నారు. ఈ మేరకు అన్ని కార్యక్రమాలు పూర్తి చేసే పనిలో చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ప్రస్తుతం అయితే సెన్సార్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సెల్వం మాతప్పన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేయగా.. బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందించారు. కె.గిరీష్ కుమార్ ఎడిటర్‌గా పని చేశారు. తారాగణం: సునామీ కిట్టి, చరిష్మా, పి.మూర్తి, ఎంకె మాత, మునిరాజు, నినాసం అశ్వత్ తదితరులు, సాంకేతిక సిబ్బంది: రచయిత, దర్శకుడు: ఒరాటశ్రీ, నిర్మాతలు: డా.ఎ.బి.నందిని, ఎ.ఎన్.బాలాజీ, బ్యానర్: శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్, కెమెరామెన్: సెల్వం మత్తప్పన్ సంగీత దర్శకుడు: బి ఆర్ హేమంత్ కుమార్, ఎడిటర్: కె.గిరీష్



# స్వచ్ఛమైన గాలికి బంతిపూల పెంపకం



మన్యాగణపతి ప్రాజెక్ట్ బ్రీత్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించిన టీనేజర్. బంతిపూలతో పర్యావరణాన్ని కాపాడుతూ స్వచ్ఛమైన గాలిని అందిస్తూ ఆరోగ్యానికి చేరువ చేయడానికి కృషి చేస్తున్నది. హైస్కూల్ విద్య నభ్యసిస్తున్న మన్య చిన్నతనం నుంచే పర్యావరణమంటే మక్కువ చూపేది. అలాగే సమాజ సేవ చేసేందుకు ఇష్టపడుతుంది. తన పదిహేనేళ్ల వయసులోనే స్వచ్ఛంద సంస్థ స్థాపించి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోంది. మొదట బెంగళూరు నగరంలో పేదవారికి, అవసరరార్థులకు పోషకాహారం అందించడం ప్రారంభించింది. ఆమె తల్లిదండ్రులు ఆమె చేస్తున్న సమాజ సేవకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటారంటోంది. తాను స్థాపించిన ఎన్జీవో వేకదిగా మొదటి పేదవారికి కడుపు నిండా ఆహారం పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల్ని సందర్శించింది. అనంతరం వారికి పోషకాహారం అందించే ఏర్పాట్లు చేసినట్లు చెపుతోంది. స్థానికంగా ఉండే రెస్టారెంట్లకు సహకారం అందిస్తూ వారు చుట్టుపక్కల ప్రజలకు తక్కువ ధరకు, ఉచితంగా నాణ్యమైన భోజనం అందేలా ఏర్పాట్లు చేసింది. అలా వేలాది మంది ఆకలి తీర్చగలిగినందుకు ఆనందంగా ఉందంటోంది. శారీరక, మానసిక ఆరోగ్యం, వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపైనా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే స్నేహితులతో కలిసి నిధులు సేకరిస్తూ వైద్యశిబిరాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది.

పర్యావరణ పరిరక్షణ పైనా దృష్టి పెట్టిన మన్య ఇంటా, బయటా పార్థేనియం మొక్కల్ని పూర్తిగా తొలగించి వాటికి బదులు బంతిపూల మొక్కల్ని నాటాలని అక్కడి కమ్యూనిటీల్లో అవగాహన పెంచుతోంది. ఇంటి గార్డెన్లలో బయట పార్కులు, రోడ్లకు ఇరువైపులా నాటే మొక్కల్లో బంతిపూల మొక్కలు నాటేలా చేస్తోంది. కలుషితమైన గాలిని నిర్మూలించి వాతావరణంలో స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను పెంచే శక్తి ఈ పూలకు ఉందని చెపుతోంది. అంతేకాదు మట్టి నాణ్యతను కూడా ఇది పెంచుతుందని తెలిపింది. ఈ కార్యక్రమంల విజయవంతమవడంతో దీన్ని బెంగళూరు వ్యాప్తంగా అమలు చేసే పనిలో నిమగ్నమయింది. బంతిపూలతో సుమారు 88 శాతం గాలి స్వచ్ఛంగా మారుతుందని చెబుతోంది.

# సానుకూల భావన కోసం..

**ఒత్తిడి మనకు పెద్దగా పరిచయం** అక్కర్లేని పేరు. నిద్రలేమి, నెలసరి సమస్యలు.. ఇలా దీనికి కారణాలు బోలెడు. కాబట్టి ఓ రెండు నిమిషాలు ఇలా చేస్తే అది కాస్తా మటుమాయం.

కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకొని వీలైనంత సేపు అలా పట్టి ఉంచండి. తర్వాత నెమ్మదిగా వదలాలి. ఈ ప్రక్రియలో ధ్యాసంతా పొట్ట మీదే ఉంచాలి. ఇలా రెండు నిమిషాలు చేస్తే చాలు. ఈ వ్యాయామం నాడీవ్యవస్థను నెమ్మ దింపజేసి.. ఒత్తిడిని దూరం చేస్తుంది.



y చిన్న చిన్న వార్మప్‌లు.. నడుముపై చేతులు ఉంచి వెనక్కి వాలడం, జాగింగ్, స్ట్రెచింగ్ వంటివీ చేయొచ్చు. వేగంగా కొద్దిసేపు నడిచినా ఫలితం కనిపిస్తుంది. y. నేల మీద కాళ్లు ముడుచుకొని కూర్చోవాలి. కళ్లు మూసి, మీరు ప్రేమించే వాళ్లనో.. మీకు ఆనందాన్నిచ్చే సందర్భాన్నో గుర్తు తెచ్చుకోండి. మనసు ఇతర అంశాల మీదకి మళ్లి ఆందోళన దూరం అవుతుంది. మనసు లగ్నం కావట్లేదనిపిస్తే ఎదురుగా ఉన్న వస్తువుని తదేకంగా చూడండి.

కళ్లు మూసి మరోసారి ప్రయత్నించండి. మనసు తేలిక పడుతుంది.

. ఇతరులతో పోలిస్తే మీరు ఏ అంశాల్లో మెరుగ్గా ఉన్నారో ఆలోచించుకోండి. కనీసం మూడు అంశాలను ఎతు క్కున్నా చాలు. జీవితం మీద సానుకూల భావన ఏర్పడు తుంది. ఇదీ ఒత్తిడిని తగ్గించే మార్గమే. పోనీ.. మంచి జోక్‌ని గుర్తుతెచ్చుకోండి. లేదా చదవండి.. నవ్వు ఎండార్ఫిన్లను విడుదల చేసి, ఒత్తిడిని దూరం చేస్తుంది. మొక్కల మధ్యకు వెళ్లండి. ఆ పూల సువాసనలు చూడండి. ఆ అవకాశం లేకపోతే ఆరోమా ఆయిల్‌ని వాసన చూడటమో.. సెంటెడ్ క్యాండిల్‌ని వెలిగించడమో చేసినా చాలు. ఇవి మనసును తేలికపరిచి ఒత్తిడిని తగ్గిస్తాయి.

## ఆధ్యాత్మికం

# ధర్మసాధనంబు

ఏ ధర్మాన్ని సాధించాలన్నా శరీరం ప్రధాన సాధనం. మోక్షం శారీరకమైంది కాకపోయినా దాన్ని సాధించటానికి శరీరం అవసరం. దేహం ఆరోగ్యంగా ఉంటే మనసు, హక్కు రెండూ నియంత్రణలో ఉంటాయి. ఈ మూడు కలిస్తేనే నరతికరణ శుద్ధి, యోగసిద్ధి ఇది మోక్షానికి మార్గం. కాబట్టి వీటన్నిటికీ మూలమైన శరీరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' అని కదా ఆర్యోక్తి. అంటే ఏ ధర్మాన్ని సాధించాలన్నా ముందుగా శరీరాన్ని జాగ్రత్తగా పరిరక్షించ ుకోవాలి అని అర్థం. శరీర పోషణ, మనసు నిలకడగా ఉంచుకోవడం, ఆత్మ స్వరూపం, పరతత్వ సాధన ఈ నాలుగూ జీవితంలో క్రమంగా సాధించవలసిన అంశాలు. వాటిని ఎలా సాధించాలో అనుగీత చెబుతుంది. అందువల్ల మోక్షసాధనలో శరీర ప్రాధాన్యాన్ని అశ్రద్ధ చేస్తే వచ్చే అనార్థలను విపులంగా వివరించింది అనుగీత. ఒక వ్యక్తి అత్యుత్సాహంతో తన స్థాయికి మించి కానీ, అలసత్వంతో తన స్థాయికి తగ్గి కానీ ప్రవర్తించ కూడదు. శరీర పోషణకు ఎంతో ముఖ్యమైన ఆహార స్వీకరణలో కూడా స్థాయి. కాలం, గుణాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరికి వారు తమ శరీరం-వాత, పిత్త,కఫ ప్రకృతుల్లో ఏదో గుర్తించి. దానికి అనుగుణమైన ఆహారం తీసుకోవాలి. అందుకు విరుద్ధమైన ఆహారం తీసుకోవడం, అతిగా తినడం, సమయానికి తినకపోవడం-ఈ మూడింటిపై ఎవరు శ్రద్ధ పెట్టరో. వారికి ఆహారమే శత్రువు అవుతుంది.

# చిలగడ దుంప కట్లెట్స్

**కావలసినవి :** చిలకడ దుంపలు-3, ఉప్పు-పావు చెంచా, కొత్తిమీర తరుగు-చారెడు, మొక్కజొన్న పిండి-3 చెంచాలు, పచ్చిమిర్చి-2, నిమ్మరసం, కారం, అల్లం తరుగు-చెంచా చొప్పున, జీలకర్ర పొడి, గరం మసాలా, ఛాట్ మసాలా-అర చెంచా చొప్పున, నూనె-2 చెంచాలు.

**తయారీ :** చిలకడదుంపలు ఉడికించి, పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో మొక్కజొన్న పిండి, పచ్చిమిర్చి ముక్కలు, నిమ్మరసం, ఉప్పు, అల్లం తరుగు, జీలకర్ర పొడి, గరం మసాలా, ఛాట్ మసాలా, కారం.. అన్నీ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా తీసుకుని చేత్తో చిన్నగా ఒత్తుకోవాలి. కడాయిలో కాస్త నూనె వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించు కోవాలి. అంతే ఘుమఘుమలాడే చిలకడదుంప కట్లెట్లు సిద్ధం



# కొలెస్ట్రాల్‌తో మతిమరుపు!

ప్రయోజనాలు తగ్గుతున్నాయని ఇటీవల ఓ అధ్యయనం తేల్చింది. దీంతో ఆల్జీమర్స్ ప్రమాదం ఎదురయ్యే అవకాశాలూ లేకపోలేదంటోంది. అయతే ఈ సమస్యను ఆరోగ్యకరమైన జీవనశైలితో అధిగమించొచ్చని చెబుతోంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రినాలజీ అండ్ మెటాబాలిజంలో ప్రచురించిన పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధన బృంద అధ్యయనం.. ఇంకా ఏం చెబుతోందంటే..



మహిళల్లో మంచి కొలెస్ట్రాల్ కణాలు జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అయితే అవే కణాలు మెనోపాజ్‌కు దగ్గరవు తున్నప్పుడు ఆల్జీమర్స్ కీ.. కారణమవుతాయి. మెనోపాజ్‌కు ముందు ఈ కణాల సంఖ్య పెరుగుతుంటుంది. వీటి సంఖ్యతోపాటు పరిమాణం కూడా పెద్దదవుతుంది. అయితే మొదట్లో ఉండే చిన్నకణాలు అందించే ఆరోగ్యప్రయోజనాలను ఈ పెద్ద కణాలు పూర్తిగా ఇవ్వలేవని అధ్యయనం ద్వారా తెలిసింది. అలాగే ఇవి మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో అంత ప్రభావంతంగా పనిచేయడంలేదని కూడా గుర్తించారు. దీంతో వయసు పెరుగుతున్నకొద్దీ అధికాస్థాయి. పెద్ద పరిమాణంలో ఉండే కొలెస్ట్రాల్ కణాలు మెదడు ఆరోగ్యంగా ఉండేలా పనిచేయడం లేదనీ దీనికి బదులుగా చిన్నగా ఉండే మరింత చిన్న ఫాస్ఫోలిపిడ్-రిచ్ హెచ్‌డిఎల్ కణాల సంఖ్య పెరిగితే ఆల్జీమర్స్ ముప్పును తప్పించు కోవచ్చు. వృద్ధాప్యం వల్ల మెదడుపై పడే ప్రభావం నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోసిస్తామని తేలింది. కాబట్టి వాటి సంఖ్య పెరిగేందుకు పోషకాహారం, శారీరకశ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి అంటున్నారు పరిశోధకులు.

# పిల్లల అల్లరి

**ఈ రోజుల్లో పిల్లల్ని పెంచడం పెద్ద సవాలు. గారాబంగా** పెంచితే మాట వినడం లేదనీ, అలాగని కాస్త కఠినంగా వ్యవహరిస్తే మరింత మొండిగా తయారవుతున్నట్లూ చెబతున్నాయి. కొన్ని అధ్యయనాలు. అందుకే, వారినెలా చక్కదిద్దాలో తెలియక తల్లిదండ్రులు ఒత్తిడిని గురవుతున్నారట. ఈ ఇబ్బంది తలెత్తకుండా వారిని ఏ వయసులో ఎలా పెంచాలో చెబుతున్నారు నిపుణులు.



ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కువగా అల్లరి చేస్తుంటారు. అలాగని వారిని నియంత్రించడానికి కొట్టడం, తిట్టడం, శిక్షలు వేయడం వంటివి చేస్తే మరింత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే వారితో సున్నితంగా ప్రవర్తించాలి. అర్థమయ్యేలా చెప్పాలి.

ఐదేళ్ల నుంచి పదమూడేళ్ల పిల్లలు ఎదుటివారిని ఎక్కువగా గమనిస్తుంటారు. వాటిని తిరిగి అనురిస్తుంటారు. అందుకే ఈ వయసులోనే వారికి మంచి అలవాట్లు నేర్పించాలి. మంచిచెడులను బోధిస్తూ పెంచాలి. కుటుంబం లో ఎవరైనా వారి ముందు చెడుగా ప్రవర్తించినా భవిష్యత్తులో వారూ అదే చేయాలను కుంటారు. అందుకే ఈ వయసులో పిల్లల ముందు ఆలోచించి మాట్లాడాలి. ఆచితూచి నడుచుకోవాలి.

ఇక టీనేజ్‌కి వచ్చేసరికి వారికి ప్రతి విషయం అర్థమవుతుంది. ఈ వయసులోనే వారితో స్నేహంగా ఉండాలట. ఆర్థిక విషయాలు,కుటుంబ పరిస్థితులు, ప్రేమ వ్యవహారాలు ఇలా సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని వారికి అర్థమయ్యేలా ఉదాహరణలతో వివరించాలట.

# దేశంలోనే సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఎపి

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు ,డెహ్రాడూన్ లో జరిగిన చింతన్ శివిర్ సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని ప్రసంగిస్తూ పి 4 తోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కేంద్ర సామాజిక న్యాయం ,సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ లో రెండు రోజుల పాటు చింతన్ శివిర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి రెండవ రోజు సమావేశంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న పి 4 పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్ ని ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఆసక్తిగా తిలకించారు. ప్రజెంటేషన్ అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....సీఎం చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఏపీలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారు. విజన్ 2047 లో భాగంగా ఉగాది నాడు పి 4 పథకం ప్రారంభించి పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు 20 ఉన్న పేదల అభివృద్ధికి సహకరించాలి. రాష్ట్రంలో

> రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : డా. డోలా బాల వీరాంజనేయస్వామి

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ తీసుకొచ్చి ఈగల్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం. జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో డి ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత ఫించన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో వృద్ధులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలు ఫించన్ అందిస్తున్నాం. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అనుసంధానంతో పారిశుద్ధ్య నిర్వహణను మిషన్ల ద్వారా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం పీఎంఏవై కింద ఇచ్చే దానికి అదనంగా ఎస్టీలకు రూ. 75 వేలు, ఎస్సీలకు రూ. 50 వేలు ఏపీలో కూటమి ప్రభుత్వం ఇస్తోంది. పీఎం ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్ర ప్రభుత్వం గ్రామానికి ఇస్తున్న రూ. 21 లక్షల్ని రూ.75 లక్షలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా. పుట్టుకతోనే పిల్లల్లో ఆటిజం, వినికిడి లోపాలు గుర్తించేందుకు ప్రత్యేక పరికరాల్ని ప్రతి మెడికల్ కాలేజీల్లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహకారం తీసుకోవాలి. వృద్ధులకు, ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వృద్ధుల కోసం అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నాం. రూ. 143 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేయిస్తున్నా మని, ఎస్సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరి స్తున్న కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

# పోలవరం ముంపు గ్రామాల్లో శరవేగంగా పిడియఫ్ సర్వేలు



వరరామచంద్రాపురం గ్రామసభలో ప్రజల

**చింతూరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముంపునకు గురవుతున్న నిర్వాశితుల కన్నీటి గాధలను చవిచూసిన ఎపి ప్రభుత్వం,ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాది వరదలకు ముందే సర్వేలను పూర్తి చేసి నిర్వాశితులకు ఆర్ అండ్ ఆర్ చెల్లించి ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటానికి చేయాల్సిన కార్యచరణకు శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ సన్నాహాలతో పోలవరం నిర్వాశితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.పొలవరం గ్రామసభలకోసం ముంపు ప్రాంతాల ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.అందులో భాగంగా అల్లూరి జిల్లా చింతూరు ఐటిడిఎ పరిధిలో పొలవరం పిడియఫ్ సర్వేలు శరవేగంగా జరుగుతున్నాయి.గతంలో ఎన్నడు లేనంతగా సర్వేలు వేగం పుంజుకోవటంతో నిర్వాశిత ప్రజల్లో ఆశలు విరజల్లుతున్నాయి.ప్రతి ఎటా వరదలతో నరకం అనుభవిస్తున్న కుటుంబాలు ఈ ఏడాది అయిన తమకు పొలవరం పరిహారం అందితె సురక్షిత ప్రాంతాలకు తరలిపోయి కూలీ,నాలీ చేసుకోని కలోగంజో త్రాగి ప్రశాంత జీవితం గడపాలని మానసికంగా సిద్ధంగా ఉన్నారు.ప్రభుత్వం సైతం ప్రజల ఆలోచనలకు తగ్గట్టు పొలవరం పై ప్రత్యేక దృష్టి సారించటంతో ముంపు భాధిత కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.పొలవరం ముంపు గ్రామాల్లో పిడియఫ్ సర్వేలను వేగవంతం చేసిన ప్రభుత్వం ఈ ఏడాది వరదలకు ముందె జూన్ 6 నాటికి ముంపు గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించి గ్రామాలను ఖాళీచేయించటానికి వ్యూహరచన చేస్తుంది.అందుకోసం పాలక ప్రభుత్వం సర్వేలను వేగవంతం చేసింది.దాంతో ఇప్పటి వరకు అల్లూరి జిల్లాలో నత్తనడకన ఉన్న పొలవరం సర్వేలు,కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్‌కు చింతూరు సబ్‌కలెక్టర్,ఐటిడిఎ పివో భాధ్యతలతో పాటు ఆర్ అండ్ ఆర్ అధికారిగా అదనపు భాధ్యతలు అప్పగించింది.దాంతో పొలవరం ముంపు గ్రామాల్లో సర్వేలు ఊపందుకున్నాయి. ముంపు గ్రామాల్లో గ్రామ సభలను పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన ముంపు గ్రామాల్లోని ప్రజల జాభితాను సిద్ధం చేసి వారి యొక్క పిడియఫ్ సర్వేలను పూర్తి చేయటంతో పాటు లబ్దిదారుల జాబితాను సిద్ధం చేసి,ప్రతి లబ్దిదారుడి ఐడిని సృష్టించి ఆ యొక్కజాబితాను సియఫ్‌యంయస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.దానికోసం చింతూరు ఐటిడిఎలోని ఆర్ అండ్ ఆర్ సెల్‌తో పాటు దానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు,8మంది స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లు,వారి సిబ్బంది సబ్‌కలెక్టర్ కనుసన్నల్లో అహర్నిశలు శ్రమిస్తున్నారు.అర్హతలు ఉన్న ఎటక్క నిర్వాశిత కుటుంబానికి అన్యాయం జరగకుండా పూర్తి స్థాయిలో సర్వేలను క్షుణ్ణంగా పరిశీలించి ఓడిసిపడుతున్నారు.ఎట్టి పరిస్థితుల్లో పొలవరం ముంపు గ్రామాల్లోని ప్రజలకు ఆర్ అండ్ ఆర్ చెల్లించటమే లక్ష్యంగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.అయితె అధికారులు,అలానే గ్రామసభలు పెడతారు తప్ప ఆ పొలవరం డబ్బులు వచ్చినప్పుడు చూద్దాంలే ! అనే ధోరణిలో మాత్రం చాలామంది ఉన్నాయి.కాని ప్రస్తుతం జరుగుతున్న సర్వేలు చివరి దశకు చేరాయన్న విషయాన్ని పోలవరం ముంపు గ్రామాల ప్రజలు గమనించాల్సి ఉంది.పొలవరం ముంపు గ్రామాల జాబితాను 41.15 కాంటూరు పాయింట్‌లో తొలిదశలో అంటె ఫేజ్1(ఎ)లో మొత్తం 21 గ్రామాలు ఉండగా అందులో వి.ఆర్.పురం మండలంలోని 20 గ్రామాలు,కూనవరం మండలంలోని బొజ్జరాయిగూడెం గ్రామం ఉంది.ఈ గ్రామాల పరిధిలో సుమారు 2344 పిడియఫ్‌లు ఉన్నట్టు ప్రాధమిక అంచనా.ఇదే ఫేజ్ 1(బి)లో మొత్తం 32 గ్రామాలు ఉండగా వాటిలో వి.ఆర్.పురం మండలంలో 16,కూనవరం మండలంలో 10,చింతూరు మండలంలో 6 గ్రామాలు ఉన్నాయి.ఆయా గ్రామాల్లో పిడియఫ్‌ల సంఖ్య 13790.చింతూరు మండలంలోని గ్రామాల్లో చింతూరు,చూటూరు,ఉలుమూరు,ఎజి కొడేరు,మార్కండేయపేట గ్రామాలు ఉన్నాయి.

# తిరుమల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో శుభ్రత గాలికి!

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ లక్షమంది భక్తులు....సరాసరి యాభైశాతం మంది భక్తులు అల్పాహారం, మంచి నాణ్యమైన ఆహారం కోసం తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, హోటళ్ళపై ఆధారపడుతున్నారు. భక్తులకు రుచికరంగా, శుచిగా, శుభ్రమైన వాతావరణంలో ఆహారపదార్థాలు తయారుచేసి వడ్డించాలనే టిటిడి అధికారుల ఆదేశాలు ఇప్పటికీ కొన్ని హోటళ్ళు, ఫాస్టుపుడ్ కేంద్రాల యజమానులు బేఖాతర్ చేస్తున్నారు. నాణ్యత,శుభ్రత విషయంలో రాజీపడని టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇప్పటికే ఆకస్మిక తనిఖీల్లో దాదాపు 15వరకు దుకాణాలు మూయించేశారు. అయినా ఇంకా కొండపై ఫాస్టుపుడ్ కేంద్రాల యజమానుల్లో మార్పు రాకపోవడం విశేషం. భక్తుల సేవలో తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న హోటళ్ళు,ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు ఆహారపదార్థాలు నాణ్యత లేకుండా తయారుచేస్తూ వడ్డిస్తున్నారు. రోజువారీగా తిరుమలకు వస్తున్న భక్తులు చాలావరకు కొండపై హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో తయారుచేసి వడ్డించే ఆహారపదార్థాలు తింటున్నారు. ఏదో ఒకరోజు ఇలా వచ్చాం కదా అని యాత్రికులు కూడా ధరలతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చిన, నచ్చిన ఆహారపదార్థాలు భోంచేస్తున్నారు. యాత్రికులు ఒకపూట భోంచేసి వెళ్ళిన వాళ్ళు మళ్ళీ ఏడాదికో, రెండేళ్లకో తిరుమలకు వస్తారు. ఇక్కడ యాత్రికులకు రుచికరంగా, నాణ్యతతో ఆహారపదార్థాలు, తినుబండారాలు తయారుచేయాల్సిన హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు వాటిని గాలికొదిలేశారు. ఏకంగా తిరుమలలో మరుగుదొడ్లు, మూత్రశాలలకు సమీపంలోనే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు నడుపుకుని రెండు చేతుల్లా వ్యాపారాలు చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. గత ఐదేళ్ళలో తిరుమలలో విచ్చలవిడిగా హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు ఆహారపదార్థాలు రుచిగా లేకున్నా, నాణ్యత పాటించకున్నా అడిగే అధికారిగానీ, పట్టించుకున్న పాపాన లేదు. భక్తుల నుండి ఫిర్యాదులు వచ్చినా కనీసం నామమాత్రం స్పందన కరువైంది. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు వీలైనంత వరకు సంతోషకర సేవలందించాలని టిటిడి అధికారులకు ఆదేశిం చారు. తొలుత నాణ్యతగా ఉన్న ఆహారప దార్థాలు వడ్డించేలా, రుచిగా శుచిగా ఉండేలా చూడాలని సూచించారు. టిటిడి ఇఒ జె.శ్యామల రావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచ ాదరి హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై తనిఖీలు మొదలుపెట్టారు. ఇలాంటి దోరణిలోనే సిఆర్ఓ సమీపంలో అనేక ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో కూడా కనీసం శుభ్రత పాటించడంలేదనేది భక్తుల ఆవేదన. ఇక్కడ మురుగునీరు క్రింద ప్రవహి స్తున్నా, హోటళ్ళలో వండిన అల్పాహారం ఇడ్లీ, దోస,పూరీలు, పులిహోర, లెమన్‌రైస్, వడలు, సాంబారు తదితర వాటికి కనీసం మూతలు ఉండవు. ధుమ్ము, ధూళి. ఈగలు వ్రాలుతున్నా ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోరు.

# ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యటన

**విజయవాడ,ఏప్రిల్8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ఈ నెల 9వ తేది నుంచి రెండురోజులపాటు ముంబయిలో రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ పర్యటించనున్నారు.ముంబయి పోవై లేక్ లో 8 10 వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ లో పాల్గొననున్న మంత్రి దుర్గేష్ ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలు వివరిస్తారు.ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తారు.ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని భరోసా కల్పించనున్న మంత్రి దుర్గేష్ మంత్రి దుర్గేష్ తో పాటు పర్యటనలో పాల్గొననున్న పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కా అమరావతి: ఆతిథ్య రంగంలో పెట్టుబడులే లక్షయంగా ఏప్రిల్ 9,10 తేదీల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముంబయిలో పర్యటించనున్నారు. ముంబయి పోవై లేక్ లో 810వ తేదీ వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్ లో మంత్రి దుర్గేష్ పాల్గొననున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలు వివరించి ఇన్వెస్టర్లను రాష్ట్రానికి ఆహ్వానించనున్నారు. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని భరోసా కల్పించనున్నారు. పర్యాటక రంగంలో భారీగా ఉపాధి అవకాశాల కల్పన,రూ. 25,000 కోట్ల పెట్టుబడులే లక్షయంగా పనిచేస్తోన్న మంత్రి కందుల దుర్గేష్ ఇప్పటికే రూ. 1200 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టారు. 8 ఎంవోయూలు కుదుర్చుకున్నారు. మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట ముంబయి పర్యటనకు వెళ్లనున్నారు. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ కాన్ఫరెన్స్ కు వెళ్తున్న బృందం అక్కడికి హాజరయ్యే దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత హోటల్స్ గ్రూప్స్ తో ఏపీ నూతన పర్యాటక పాలసీ, పర్యాటక రంగానికి పరిశ్రమహోదా తదితర వివరాలు వెల్లడించి పెట్టుబడులను ఆకర్షించనుంది. వర్క్ షాప్ తో పాటు పదుల సంఖ్యలో వివిధ హోటల్స్ ప్రతినిధులతో భేటీ కానుంది. కూటమి ప్రభుత్వం కొత్త పర్యాటక విధానం ప్రకటించాక ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో హోటల్స్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తిని కనబరిచాయి. ఈ క్రమంలో రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో 50,000 గదుల ఏర్పాటు చేయాలన్నారు.

# లక్నో సూపర్ జెయింట్స్ హ్యాట్రిక్ విక్టరీ

## 4 రన్స్ తేడాతో పోరాడి ఓడిన కోల్‌కత్తా నైట్ రైడర్స్



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ 4 పరుగుల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. కోల్‌కతా తన సొంత మైదానంలో వరుసగా రెండో విజయం ఇది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 4 పరుగుల తేడాతో లక్నో గెలుపొందింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో 239 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 234 పరుగులు మాత్రమే చేయగలిగింది. రింకు సింగ్ 15 బంతుల్లో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ అజింక్య రహానే 61, వెంకటేష్ అయ్యర్ 45 పరుగులు చేశారు. వారిద్దరూ 40 బంతుల్లో 71 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం తెగిపోవడంతో, కోల్‌కతా జట్టు విడిపోయింది. ఆకాశ్ దీప్, శార్దూల్ ఠాకూర్‌లకు చెరో రెండు వికెట్లు దక్కాయి. అంతకు ముందు బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో ప్లేయర్ నికోలస్ పూరన్ (86 నాటౌట్) పట్టపగలే కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. క్రీజులోకి రావడమే ఆలస్యం బౌండరీలతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు అర్ధ శతకంతో గర్జించాడు. ఓపెనర్ షాన్ మార్ష్ (81) సైతం తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. పూరన్ మెరుపులతో ఆఖరి ఐదు ఓవర్లలో 86 పరుగులు రాబట్టింది. వీళ్లిద్దరి విధ్వంసక బ్యాటింగ్ ఫలితంగా కోల్‌కతా కంచుకోటలో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు షాన్ మార్ష్ (81 48 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు), ఎడెన్ మర్‌క్రమ్ (47)లు శుభారంభం ఇచ్చారు. కోల్‌కతా బౌలింగ్ దళాన్ని చీల్చిచెండాడిన వీళ్లు పవర్ ప్లేలోనే 59 రన్స్ పిండుకున్నారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసేందుకు అజింక్య రహానే ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోయింది.

అయితే 11వ ఓవర్లో హర్షిత్ రానా సూపర్ డెలివరీతో మర్‌క్రమ్‌ను బోల్డ్‌చేసి కోల్‌కతాకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత సెంచరీ దిశగా దూసుకెళ్తున్న మార్ష్‌ను రస్సెల్ బోల్తాకొట్టించాడు. దాంతో, 170 వద్ద లక్నో రెండో వికెట్ కోల్పోయింది. షాన్ మార్ష్ ఔటయ్యాక నికోలస్ పూరన్ (86: 35 బంతుల్లో 7ఫోర్లు, 8సిక్సర్లు) విధ్వంసం తారాస్థాయికి చేరింది. ఈ పవర్ హిట్టర్ హర్షిత్, రస్సెల్‌కు చుక్కలు చూపించాడు. 21బంతుల్లోనే హాఫ్ సెంచరీబాదిన పూరన్.. ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. రస్సెల్ వేసిన 18వ ఓవర్లో 4, 4, 6, 4,6 బాది 24 పరుగులు పిండుకున్నాడు. దాంతో, లక్నో స్కోర్ 200 దాటింది. వైభవ్ వేసిన 20వ ఓవర్ తొలి బంతినే బౌండరీకి పంపాడు పూరన్. ఆ తర్వాతి ఐదు బంతుల్లో 6 రన్స్ మాత్రమే వచ్చాయి. దాంతో, లక్నో జట్టు నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది.



## శ్రీలంక, దక్షిణాఫ్రికాతో త్రైపాక్షిక వన్డే సిరీస్..
# భారత్ మహిళల జట్టు ఖరారు
### టిజి నుండి అరుంధతి, ఎపి నుండి చరవాణిలకు చోటు

**న్యూఢిల్లీ:** శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో మహిళల త్రైపాక్షిక వన్డే సిరీస్ నిమిత్తం భారత్ జట్టు ఖరారైంది. ఈ మేరకు శ్రీలంకలో పర్యటించనున్న మహిళా క్రికెట్ జట్టుకు భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. ఈ నెల 27 నుండి శ్రీలంక-భారత్-దక్షిణాఫ్రికా మధ్య ట్రై సిరీస్ మొదలు కానుంది. శ్రీలంక, దక్షిణాఫ్రికాలతో జరగనున్న త్రైపాక్షిక వన్డే సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఉమెన్స్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ భారత జట్టును ముందుకు నడిపించనుండగా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనుంది. ఇక ఈ జట్టులో హైదరాబాదీ అమ్మాయి అరుంధతి, ఆంధ్ర క్రికెటర్, అన్ క్యాప్ట్ ప్లేయర్ నల్లపురెడ్డి శ్రీచరణి కూడా చోటు దక్కించుకున్నారు.

అంతేకాకుండా శ్రీచరణితో పాటు, మరో ఇద్దరు అన్ క్యాప్ట్ ప్లేయర్లు కశ్వీ గౌతమ్, శుచి ఉపాధ్యాయ్‌కు కూడా సెలక్టర్లు చోటివ్వడం విశేషం. మరోవైపు గాయాల కారణంగా రేణుకా సింగ్ ఠాకూర్, టైటస్ సాధు ఈ వన్డే సిరీస్‌కు దూరమైనట్లు బిసిసిఐ వెల్లడించింది. కాగా జనవరిలో ఐర్లాండ్‌తో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌కు హర్మన్ ప్రీత్ కౌర్ దూరంగా ఉంది. హర్మన్ ప్రీత్‌కు విశ్రాంతినిచ్చిన సెలక్టర్లు ఆమె స్థానంలో స్మృతికి సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో జనవరి 10 నుండి 15 వరకూ జరిగిన ఈ సిరీస్‌లో స్మృతి సేన ఐర్లాండ్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లో స్మృతికి దీప్తి శర్మ డిప్యూటీగా వ్యవహరించింది. కాగా ఈ నెల 27 నుండి ప్రారంభమవుతున్న ఈ ట్రై సిరీస్‌లో భాగంగా నాలుగు మ్యాచ్‌లకూ శ్రీలంకలోని కొలంబో మైదానం ఆతిథ్యం ఇవ్వనుండగా, రౌండ్ రాబిన్ పద్ధతిన జరగడంతో ప్రతీ జట్టు 4 మ్యాచ్‌లు ఆడుతుంది.

ఇందులో టాప్-2లో నిలిచి జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ నెల 27న ఇండియా-శ్రీలంక, 29న ఇండియా-దక్షిణాఫ్రికా, మే 4న ఇండియా శ్రీలంక, 7న ఇండియా-దక్షిణాఫ్రికాల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఈ సిరీస్‌కు భారత్ జట్టులో హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రీచా హోష్ (వికెట్ కీపర్, యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ, అమన్ జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, స్నేహ్ రాణా, అరుంధతి, తేజల్ హసాబ్నిన్, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్ ఉన్నారు.

## టెన్నిస్ టోర్నీలో..బోపన్న జోడీ డబుల్స్ విజయం

**న్యూఢిల్లీ:** మాంటె-కార్లో మాస్టర్స్‌లో భారత్ టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న, అమెరికాకు చెందిన బెన్ షెల్టన్ ద్వయం డబుల్స్ విజయం సాధించాడు. పారిస్‌లోని కంట్రీ క్లబ్ వేదికగా జరుగుతున్న మాంటె-కార్లో మాస్టర్స్‌లో భాగంగా జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బెన్ షెల్టన్ జోడీ 6-3, 7-5తో అర్జెంటీనాకు చెందిన ఫ్రాన్సిస్కో-చీలికి చెందిన అలెజండ్రో జంటపై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. తద్వారా బోపన్న ఎటిపి మాస్టర్స్ 1000 ఈవెంట్ చరిత్రలో సింగిల్స్ లేదా, డబుల్స్ మ్యాచ్ గెలిచిన 45 ఏళ్ల పెద్ద వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. కాగా మాంటె-కార్లో మాస్టర్స్ డబుల్స్‌లో మరో భారత్ అటగాడు యూకీ బాంబ్రీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది.

## ఓపెన్ టేబుల్ టెన్నిస్‌లో..
# ఛాంపియన్‌గా పెగూలా
### మరో మ్యాచ్‌లో మెయిన్ డ్రాకు నగాల్ అర్హత



**న్యూఢిల్లీ:** అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగులా తన కెరీర్‌లో ఎనిమిదో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. చార్ల్స్‌టన్ ఓపెన్ డబ్ల్యూటిఎ-500 టోర్న మెంట్‌లో పెగులా ఛాంపియన్‌గా అవతరించింది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్‌తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో పెగూలా 6-3, 7-5తో గెలుపొందింది. ఈ సీజన్‌లోకి పెగూలాకు ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఈ విజయంతో జెస్సికా తన కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌నుఅందుకుంది. విజేతగా నిలిచిన పెగూలాకు 1,64,000 డాలర్ల ప్రైజ్ మనీతో పాటు, 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. కాగా భారత పురుషుల టెన్నిస్ సింగిల్స్ నంబర్ వన్ సుమిత్ నగాల్ మోంజా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-100 టోర్నమెంట్‌లో మెయిన్ డ్రా కు అర్హత సాధించాడు. ఇటలీకి చెందిన ఫెడరికో ఇనాకోన్‌తో జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ నగాల్ 6-4, 6-2తో గెలుపొంది మెయిన్ డ్రాలో చోటు దక్కించుకున్నాడు. 93 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నగాల్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను మూడు సార్లు బ్రేక్ చేశాడు.

# లీగ్‌తోనే బ్రేకప్!



**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025, 18వ సీజను ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఈ టోర్నీ ప్రారంభమై ఇప్పటివరకు రెండు వారాలు గడిచాయి. ఈ రెండు వారాల్లో చాలా మ్యాచ్‌లు హోరా హోరీగా పోరాడాయి. కొన్ని జట్లు బాగా ఆడగా, కొన్ని జట్లు మాత్రం తీవ్ర నిరాశపరిచాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ వంటి జట్లు ఇప్పటివరకు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని ఏకైక జట్టు ఢిల్లీ క్యాపిటల్స్. ఈ కారణంగా ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, కొన్ని జట్ల మార్గం ఇప్పుడు కష్టంగా అనిపిస్తోంది. ఇందులో లీగ్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టు కూడాఉంది. ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్‌కు దూరమయ్యే ప్రమాదంలో మూడు జట్లు ఉన్నాయి. వాటిలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఉన్నాయి. అయితే ఇంకా వీటికి ప్లే ఆఫ్స్‌కు వెళ్లేందుకు పూర్తిగా దారులు మాత్రం మూసుకుపోలేదు. ఏదైనా అద్భుతాలు జరిగితేనే తప్ప లేకుంటే ఈ జట్లు లీగ్ దశతోను ముగించాల్సి ఉంటుంది. ప్రధానంగా గత సీజన్‌లో ఫైనలిస్ట్ జట్టు అయిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ ఐపిఎల్‌లో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. సన్ రైజర్స్ తొలి మ్యాచ్‌లోనే 286 పరుగులు చేసి సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. అయితే, అప్పటి నుంచి జట్టు బ్యాటింగ్ నిరంతరం విఫలమవుతూనే ఉంది. హైదరాబాద్ జట్టు వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగునఉంది. అలాగేఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకు ప్లేఆఫ్స్‌కు వెళ్లే మార్గం చాలా కష్టంగా మారింది. ముంబై ఇండియన్స్ లాగే ఇప్పటివరకు ఒకే ఒక మ్యాచ్‌లో గెలిచింది. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం కేవలం 2పాయింట్లతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు లేదా బ్యాట్స్‌మెన్స్ అంతగా రాణించడం లేదు. ఇక టోర్నమెంట్‌లో ముంబై ఇండియన్స్ ప్రదర్శన ఇప్పటివరకు చెప్పుకోదగిన విధంగాలేదు. 5 మ్యాచ్‌లుఆడగా, వీటిలో ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలిచింది. ముంబై ఇండియన్స్ 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

# వాణిజ్యం


# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 8:** ట్రంప్ టారిఫ్ దెబ్బతో గత సెషన్‌లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు మంగళవారం పుంజుకున్నాయి. సుంకాల విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధమన్న సంకేతాలతో ఆసియాతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. ఈ సారి ఆర్‌బిఐ నుంచి మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకుపైగా రాణించగా, నిఫ్టీ కూడా 22,600 పాయింట్ల ఎగువకు చేరింది. చివరికి అమ్మకాల కారణంగా లాభాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉదయం సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. చివరికి సెన్సెక్స్ 1089.18 పాయింట్లు పెరిగి 74,227.08 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 374.25 పాయింట్లు పెరిగి 22,535.85 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.27గా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ మినహా అన్ని షేర్లూ లాభాల్లో ముగిసాయి. టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టి, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ 100, బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్సులు కూడా 2శాతం మేర లాభాల్లో ముగిసాయి. ఇక ఆసియా-పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ 5.68శాతానికిపైగా లాభపడగా, హాంగ్‌కాంగ్, షాంఘై మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సింగపూర్, తైవాన్, జకర్తా మార్కెట్లు నష్టాల్లో ముగిసాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభమయ్యాయి. డోజోన్స్ ఫ్యూచర్స్ రెండు శాతం మేర లాభాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 64డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3020 డాలర్ల వద్ద కొనసాగింది. సుంకాలపై చర్చకు కొన్ని దేశాలు ముందుకొచ్చాయని ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. ట్రంప్ కూడా కాస్త వెనక్కి తగ్గుతారనే అంచనాలున్నాయి. దీనివల్ల వాణిజ్య యుద్ధ ఆందోళనలు తగ్గుతాయనే సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను బలపర్చాయి. చైనా, వియత్నాం తదితర దేశాలతో పోలిస్తే ట్రంప్ సుంకాల వల్ల కలిగే నష్టం మనదేశానికి తక్కువనే అంచనాలు ఇన్వెస్టర్ల ఆందోళనలకు కాస్త ఊరటనిచ్చాయి. అటు ముడిచమురు ధర తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్ల ర్యాలీకి ఓ కారణంగా మారింది. కనిష్టాల వద్ద కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.



## ఇది ఆర్థిక అణు యుద్ధం: ట్రంప్‌నకు నిపుణుల హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల ప్రభావంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు, ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని జెపి మోర్గాన్ సిఇఒ జెమి డిమోన్ అభిప్రాయపడ్డారు. ఆయన వాటాదారులకు విడుదలచేసిన వార్షిక లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. భారత్ వంటి దేశాలను తన దారిలోకి తెచ్చుకోనే కంటే, వాటితో సన్నిహిత సంబంధాలను పెంచుకోవడమే మంచిదని ఆయన సూచించారు. ఇటీవల కాలంలో విధించిన టారిఫ్‌లు ద్రవ్యోల్బణాన్ని పెంచొచ్చు. అందువల్ల ఆర్థిక మాంద్యానికి దారి తీసే అవకాశాలున్నాయి. ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగ్గ స్థాయిలో కుదుపునకులోనవుతుంది. ఇందులో పన్ను సంస్కరణలు, డీ రెగ్యులేషన్లకు దారితీయడం వంటివి సానుకూల అంశాలైతే, పన్ను, వాణిజ్య యుద్ధం, ఏ మాత్రం తగ్గుముఖం పట్టని ద్రవ్యోల్బణం, ఆర్థిక లోటు, ఆస్తుల విలువలు గణనీయంగా పెరగడం, అస్థిరత వంటివి ప్రతికూలాంశాలు. పన్నుల పెంపు వల్ల దిగుమతి చేసుకొనే వస్తువులే కాదు, దేశీయంగా తయారైన వాటి ధరలు కూడా పెరుగుతాయి. ఇవి స్వల్పకాలంలో కనబడతాయి. ముఖ్యంగా దేశీయ ఉత్పత్తుల ఇన్‌పుట్ ధరలు, డిమాండ్ రెండూ పెరుగుతాయి అని వెల్లడించారు. ఇక భారత్ వంటి నాన్ అలైన్ దేశాల విషయంలో అమెరికానే స్నేహహస్తం చాచి సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలన్నారు. కీలక వాణిజ్య భాగస్వాములతో లోతైన సంబంధాలు కలిగిఉండడం ఆర్థిక, భౌగోళిక రాజకీయపరంగా మంచింది. అమెరికా కూటమిలో భాగస్వాములు కాకుండా ఉన్న నాన్ అలైన్ దేశాలైన భారత్, బ్రెజిల్ వంటి వాటితో సన్నిహితంగా ఉండాలి. వారికి వాణిజ్యం, పెట్టుబడుల్లో అమెరికా స్నేహహస్తం అందించాలి అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు అతిపెద్ద మద్దతుదారుగా నిలిచిన సంపన్నుడు బిల్ అక్మెన్ కూడా టారిఫ్‌లను తప్పుపట్టారు.



## 'మైక్రోసాఫ్ట్‌లో డిజిటల్ ఆయుధాల తయారీ'

**వాషింగ్టన్, ఏప్రిల్ 8:** వాషింగ్టన్‌లో ఇటీవల జరిగిన మైక్రోసాఫ్ట్ 50వ వార్షికోత్సవ వేడుకలకు పాలస్తీనా అనుకూల ఉద్యోగులు అంతరాయం కలిగించారు. ఇజ్రాయెల్ సైనిక చర్యల్లో మైక్రోసాఫ్ట్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఇందులో కొందరు రాజీనామా చేశారు. వీరిలో మైక్రోసాఫ్ట్ ఎఐ విభాగానికి చెందిన ఇండో అమెరికన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వానియా అగర్వాల్ కూడా ఉన్నారు. గాజాలో హింసాకాండకు ఈ సంస్థ సహకరిస్తోందని ఆరోపిస్తూ మైక్రోసాఫ్ట్‌ను డిజిటల్ ఆయుధాల తయారీదారుగా అభివర్ణించారు. బహిరంగంగానే రాజీనామా సమర్పిస్తున్నట్లు ప్రకటిస్తూ నినాదాలతో సమావేశం నుంచి బయటకు వచ్చారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖతో మైక్రోసాఫ్ట్ కుదుర్చుకున్న 133 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని అగర్వాల్ ఖండించారు. కంపెనీ ఎఐ, అజూర్ క్లౌడ్ సేవలు పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైనిక చర్యలకు మద్దతుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్, కృత్రిమ మేధ గాజాలో ఇజ్రాయెల్ సైన్యాన్ని మరింత ప్రాణాంతకంగా, విధ్వంసకరంగా మార్చేందుకు వీలు కల్పిస్తున్నాయి అని అగర్వాల్ కంపెనీకి సమర్పించిన ఇ-మెయిల్‌లో రాశారు. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీని ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థలు, యుద్ధ మౌలిక సదుపాయాలతో ముడిపెట్టిన నివేదికలను ఆమె ఉదహరించారు. అమెజాన్‌లో మూడేళ్లకుపైగా పని చేసిన తర్వాత 2023 సెప్టెంబరులో మైక్రోసాఫ్ట్‌లో చేరిన అగర్వాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్నారు. పాలస్తీనాకు అనుకూలంగా ఉన్న ఉద్యోగుల్లో అసమ్మతి వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆమె నిరసన తెలపడం తాజాగా చర్చనీయాంశం అయింది. ఫిబ్రవరిలో సిఇఒ సత్య నాదెళ్లతో జరిగిన ఒక సమావేశంలో ఇలాంటి ఆందోళన కారణంగా అంతరాయం కలగడంతో ఐదుగురు సిబ్బందిని తొలగించారు. ఈ ఆరోపణలపై గానీ, అగర్వాల్ రాజీనామాపై గానీ మైక్రోసాఫ్ట్ ఇంకా బహిరంగంగా స్పందించలేదు.



## ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దుపై అమెజాన్ పూర్తి రీఫండ్

**ముంబై, ఏప్రిల్ 8:** ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తన వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ప్రైమ్ మెంబర్‌షిప్ క్యాన్సిలేషన్ పాలసీలో కీలక మార్పును ప్రకటించింది. సబ్‌స్క్రైబర్లు ఎప్పుడైనా సరే మెంబర్‌షిప్ క్యాన్సిల్ చేసుకుంటే పూర్తిగా రీఫండ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ విధానాన్ని ఏప్రిల్ 9 నుంచి ప్రారంభించ నుంది. సాధారణంగా అమెజాన్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్న కస్టమర్లకు అదే రోజు లేదా మరుసటి డెలివరీ అందించడం, ప్రత్యేక డీల్స్, ప్రైమ్ వీడియో, ప్రైమ్ మ్యూజిక్‌తో సహా అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లలో డిజిటల్ కంటెంట్‌కు యాక్సెస్ లభిస్తాయి. అయితే మెంబర్‌షిప్ రద్దు ప్రక్రియను కంపెనీ మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో తాజా మార్పును తీసుకొచ్చింది. అయితే ఇందులోనూ ఓ మెలిక ఉంది. కొత్త పాలసీ ప్రకారం, సబ్‌స్క్రైబర్లు తమ ప్రైమ్ మెంబర్‌షిప్ రద్దు కోసం ఎలాంటి కొనుగోళ్లు చేయనంత వరకు కొత్త ప్రయోజనాలను ఉపయోగించనంత వరకు ఎప్పుడైనా సరే పూర్తి రీఫండ్‌ను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఏవైనా ప్రయోజనాలు పొందితే, వాపసు ఉండదు. ఇప్పటివరకు ఉన్న దాని ప్రకారం, అమెజాన్ మెంబర్‌షిప్ తీసుకున్న మూడు రోజుల్లోపై మాత్రమే దాన్ని రద్దు చేసుకునే వీలుంది. ఇతర సందర్భాల్లో ఉపయోగించిన ప్రయోజనాల ఆధారంగా ఛార్జీలను వసూలు చేసి రీఫండ్ చేయడం జరుగుతుంది.




# ముద్రా యోజనకు పదేళ్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** ప్రధాన మంత్రి ముద్రా యోజన (పిఎంఎంవై) పథకం ఏప్రిల్ 8కి పదేళ్లను పూర్తి చేసుకుంది. 2025 ఏప్రిల్ 8న ఈ స్కీమ్ ప్రారంభమైనప్పటి నుంచి భారతదేశం అంతటా 52 కోట్లకుపైగా లబ్ధిదారులకు రూ.33 లక్షల కోట్లకు పైగా పూచీకత్తు లేని రుణాలను పంపిణీ చేసింది. పిఎంఎంవై స్క్రీన్ పదేళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో ముద్రా యోజన పథకం ఎంతో మందికి, వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను కల్పించింది. ఈ పథకం ద్వారా మేలు పొందిన కొంతమందితో మాట్లాడాను. వారి ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం అంటూ ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. వ్యాపారాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రారంభమైన ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం, ఎంతో మంది ఎదగడానికి ఆర్థికంగా ఉపయోపడింది. గతంలో ఈ స్కీమ్ ద్వారా రూ.10 లక్షలు లోన్ ఇచ్చేవారు. అయితే 2024-25 కేంద్ర బడ్జెట్‌లో పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. ఈ పథకం నాలుగు రకాలుగా ఉంటుంది. అవి శిశు, కిషోర్, తరుణ్, తరుణ్ ప్లస్.




# అదానీ కొలంబో టెర్మినల్ షురూ

**ముంబై, ఏప్రిల్ 8:** డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ తాజాగా శ్రీలంకలోని కొలంబో పశ్చిమ అంతర్జాతీయ టెర్మినల్ (సిడబ్ల్యూఐటి)ను ప్రారంభించినట్లు వెల్లడించింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన సిడబ్ల్యూఐటిని కన్సార్షియం నిర్వహించనున్నట్లు తెలియచేసింది. కంపెనీ అధ్యక్షతన శ్రీలంక దిగ్గజం జాన్ కీల్స్ హోల్డింగ్స్ పిఎల్‌సి, శ్రీలంక పోర్ట్స్ అథారిటీ కన్సార్షియంలో భాగమైనట్లు పేర్కొంది. 35యేళ్ల కాలానికి నిర్మించు,నిర్వహించు, బదిలీ చేయి పద్ధతిలో ఒప్పందం అమలుకానున్నట్లు వివరించింది. 80 కోట్ల డాలర్ల పెట్టుబడులతో 1,400 మీటర్ల పొడవు, 20 మీటర్ల లోతుతో అభివృద్ధి చేసిన కొలంబో టెర్మినల్ వార్షికంగా 3.2 మిలియన్ టిఇయును హ్యాండిల్ చేయగలదని తెలియచేసింది. కొలంబోలో ఇది తొలి డీప్ వాటర్ టెర్మినల్‌కాగా, పూర్తి ఆటోమేటెడ్‌గా ఏర్పాటైనట్లు పేర్కొంది. తద్వారా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలు మెరుగుపడడం, వెస్సల్ టర్న్అరౌండ్ సమయం తగ్గడంవంటి సౌకర్యాలకు వీలు కలగనున్నట్లు తెలియచేసింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.